PRAJASAKTI Regd.No. 15795/68

సిటీ◆

ప్రజాశక్తి

ప్రతి అక్షరం ప్రజల పక్షం

Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu

సంపుటి : 42 సంచిక : 310 | విజయవాడ, ఆదివారం 11 జూన్ 2023 | 6 + 8 పేజీలు + స్నేహ వెల : 7.00

Vol No | Vijayawada, Sunday 11 June 2023 | Rs

మరో రెండు రోజులు వడగాల్పులు

- నేడు 50 మండలాల్లో మరింత తీవ్రం
- విపత్తుల నిర్వహణ సంస్థ వెల్లడి

2

స్వైటెక్‌కే ఫ్రెంచ్ ఓపెన్ టైటిల్

- ఫైనల్లో ముఖోవా పై గెలుపు

6



ఎరువుల సబ్సిడీ కట్

- అంతర్జాతీయ ధరల బూచి
- రైతులకు ధరాఘాతమే



ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి- అమరావతి

కేంద్ర ప్రభుత్వం ఎరువుల సబ్సిడీని భారీగా తగ్గించింది. నత్రజని, భాస్వరం, పొటాషియం, సల్ఫర్‌లకు కిలోగ్రాముకు ఇప్పుడిస్తున్న సబ్సిడీకి భారీగా కోతలు పెట్టింది. ఇటీవలి మంత్రివర్గ సమావేశం అనంతరం ఎరువుల సబ్సిడీని తగ్గిస్తూ నోటిఫికేషన్ జారీ అయింది. 2023-24లో సబ్సిడీని తగ్గించడంతో పాటు 2023లో జనవరి-ఏప్రిల్ కాలానికి సబ్సిడీని సైతం సవరించింది. ఉక్రెయిన్ యుద్ధం నేపథ్యంలో అంతర్జాతీయంగా ఎరువులు, ఎరువుల తయారీకి ఉపయోగించే ముడిపదార్థాలు. ఇంధన ధరలు గణనీయంగా తగ్గడమే సబ్సిడీ కోతలకు కారణమని పేర్కొంది. నిరుడు యూరియా ధర టన్ను 627 డాలర్లు (డాలరు క్ష 82 రూపాయలు) ఉండగా ప్రస్తుతం 333 డాలర్లుగా ఉంది. అదేవిధంగా డిఎపి రేటు గతేడాది 925 డాలర్లు కాగా ఈ సంవత్సరం 540 డాలర్లకు తగ్గింది. నిరుడు ధర కంటే ఈ యేడు 42 శాతం మేర తగ్గింది. డిఎపి ధర నిరుడు టన్ను 1030 డాలర్లకు పెరిగింది. ఫాస్పారిక్ యాసిడ్, అమ్మోనియా ధరలు ఏడాది వ్యవధిలో 35-80 శాతం తగ్గాయి. ఒక్క ఫాస్పారిక్ యాసిడ్ ధర నిరుడు ఏప్రిల్ కంటే ఈ ఏడాది మేలో 35.2 శాతం తగ్గింది. పూల్‌చేసిన గ్యాస్ ధర ఎంఎంబిటియు 27-28 డాలర్ల నుంచి 12-13 డాలర్లకు తగ్గింది. ఈ పరిస్థితులే సబ్సిడీ తగ్గింపునకు దారి తీశాయని కేంద్ర ప్రభుత్వం సమర్థించుకుంటోంది. 2023-24 బడ్జెట్ అంచనాల్లో ఎరువుల సబ్సిడీ 1.75 లక్షల కోట్ల రూపాయలు ఉండొచ్చని అంచనా వేశారు. కాగా కొంత మంది అధికారులు మాత్రం రూ.50 వేల కోట్ల నుంచి 55 వేల కోట్లు ఎక్కువ ఉండొచ్చని చెబుతున్నారు.

ధరలు ఎక్కువే

దేశంలో పాత నిల్వలు అధికంగా ఉన్నందున ప్రస్తుత ఖరీఫ్‌లో ఎరువుల ధరలు ఎక్కువే ఉండొచ్చన్న వాదనలూ ఉన్నాయి. అంతర్జాతీయంగా ముడి సరుకుల ధరలు తగ్గినప్పటికీ పాత ధరల ప్రాతిపదికన ఎరువుల ఉత్పత్తి జరిగినందున ఖరీఫ్‌లో ధరలు తగ్గకపోవచ్చని, అంతర్జాతీయ పరిస్థితుల ఆధారంగా ప్రభుత్వం సబ్సిడీ తగ్గిస్తే, రైతులకు ధరలు పెరగడమో లేదంటే ఇప్పుడున్న ధరలే ఉంటాయని చెబుతున్నారు. ప్రస్తుతం దేశంలో 15 మిలియన్ టన్నుల ఎరువుల నిల్వలున్నాయని పరిశ్రమ వర్గాలు చెబుతున్నాయి. 7.5 మిలియన్ టన్నుల యూరియా, 3.6 మిలియన్ టన్నుల డిఎపి, 4.5 మిలియన్ టన్నుల ఎన్‌పికె నిల్వలున్నాయి. ఇవి ఖరీఫ్ అవసరాలకు సరిపోతాయని చెబుతున్నారు.


తగ్గనున్న దిగుమతులు

దేశీయంగా యూరియా ఉత్పత్తి సామర్థ్యం పెరిగిందని, కొత్త ప్లాంట్లలో ఉత్పత్తి ప్రారంభమైందని, నానో యూరియాను ప్రవేశపెడుతున్నామని, ఈ కారణాల వలన యూరియా దిగుమతులు గతం కంటే తగ్గుతాయని అంచనా వేశారు. కాగా యూరియా ఉత్పత్తి పెరిగినప్పటికీ దిగుమతులు ఇంకా అవసరమవుతాయని, నానో యూరియా ఇంకా రైతులదాకా వెళ్లలేదని చెబుతున్నారు. ఈ పరిస్థితులన్నీ చక్కదిద్దకుండా ఎరువుల సబ్సిడీ తగ్గింపుపైనే కేంద్రం దృష్టి సారించింది.

'పోలవరం' నాణ్యత బహిరంగ పర్చాలి

పనుల పరిశీలనకు అఖిలపక్షాన్ని తీసుకెళ్లాలి : వి శ్రీనివాసరావు

ప్రజాశక్తి- తాడేపల్లిగూడెం



పోలవరం ప్రాజెక్టు పనుల్లో నాణ్యత వివరాలను ప్రభుత్వం బహిరంగ పర్చాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. ఆ వివరాలు రహస్యంగా ఉంచాల్సిన అవసరం ఏమిటని ప్రశ్నించారు. రాష్ట్ర స్థాయి అఖిలపక్షాన్ని పోలవరం తీసుకెళ్లి ప్రాజెక్టు నిర్మాణ పనులను పరిశీలించే అవకాశం కల్పించాలని డిమాండ్ చేశారు. పశ్చిమగోదావరి జిల్లా తాడేపల్లిగూడెంలోని సుందరయ్య భవనంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పోలవరం ప్రాజెక్టు రాష్ట్రంలోని 26 జిల్లాలకు ప్రత్యక్షంగానో, పరోక్షంగానో ఉపయోగపడే బహుళార్థ సాధక ప్రాజెక్టని తెలిపారు. ఈ ప్రాజెక్టులో లక్షా 20 వేల నిర్వాసిత కుటుంబాలు ఉండగా, ప్రభుత్వం 39 వేల కుటుంబాలకు మాత్రమే పునరావాసం కల్పిస్తామనడం అన్యాయమన్నారు. ప్రాజెక్టు వల్ల ముంపునకు గురైన అన్ని గ్రామాల వారికీ పునరావాస కల్పించాలని డిమాండ్ చేశారు. పోలవరం ప్రాజెక్టు పునరావాస పనులకు రూ.32 వేల కోట్లు అవసరమైతే, కేంద్ర ప్రభుత్వం రూ.ఐదు వేల కోట్లు మాత్రమే కేటాయించిందన్నారు. దీంతో, ఎంతమందికి పునరావాసం లభిస్తుందని శ్రీనివాసరావు ప్రశ్నించారు. మోడీ ప్రభుత్వం పోలవరం ప్రాజెక్టును గాలికొదిలేసిందన్నారు. పోలవరం ప్రాజెక్టులో ముంపునకు గురయ్యే అన్ని గ్రామాల ప్రజలకు పునరావాసం కల్పించాకే ఆ గ్రామాలను ఖాళీ చేయించాలని, 18 సంవత్సరాలు నిండిన వారందరికీ ప్యాకేజీ వర్తింపజేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం విద్యుత్ బిల్లులు పెద్ద ఎత్తున పెంచిందని, ట్రూఅప్ ఛార్జీల పేరుతో మూడు రకాల ఛార్జీలు వేసిందని తెలిపారు. దీంతో, సాధారణ ప్రజలపై రూ.300 నుంచి రూ.350 వరకూ విద్యుత్ బిల్లుల భారం పడుతుందన్నారు. విద్యుత్ బిల్లుల పెంపుదలను వ్యతిరేకిస్తూ వామపక్ష పార్టీల ఆధ్వర్యంలో ఈ నెల 12న విజయవాడలో సమావేశం నిర్వహించి కార్యాచరణ రూపొందిస్తామని తెలిపారు.

చించినాడలో మట్టి తవ్వకాలు దారుణం

చించినాడ గ్రామంలో దళితులకు చెందిన 60 ఎకరాల భూముల్లో తవ్వకాలు జరపరాదని హైకోర్టు స్టే ఇచ్చినప్పటికీ అధికార పార్టీ యథేచ్ఛగా తవ్వకాలు సాగించడం దారుణమని శ్రీనివాసరావు విమర్శించారు. లంక భూముల్లో మట్టి తవ్వకాలను తక్షణం నిలుపుదల చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు చింతకాయల బాబూరావు, కర్రి నాగేశ్వరరావు పాల్గొన్నారు.



ఏలూరు రైల్వే స్టేషన్‌లో బోగీ దగ్ధం

ప్రజాశక్తి - ఏలూరు స్పోర్ట్స్

ఏలూరు రైల్వే స్టేషనకు పెను ప్రమాదం తప్పింది. స్టేషన్‌లో నిలిపి ఉంచిన రైల్వే టెక్నికల్ వ్యాగన్‌లో ఒక్కసారిగా శనివారం మంటలు చెలరేగాయి. వెంటనే అప్రమత్తమైన సిబ్బంది మంటలను అదుపు చేయడంతో పెద్ద ప్రమాదం తప్పింది. ఈ ఘటనకు సంబంధించి రైల్వే సిబ్బంది తెలిపిన వివరాల ప్రకారం.. రైల్వే లైన్ మరమ్మతుల కోసం ఉపయోగించే రైల్వే టెక్నికల్ వ్యాగన్ ఏలూరు రైల్వే స్టేషన్‌కు మంగళవారం చేరుకుంది. ఏలూరు చుట్టుపక్కల రైల్వే లైన్‌కు మరమ్మతులు చేస్తూ తిరిగి సాయంత్రానికి స్టేషన్‌కు చేరుకుంటుంది ఈ క్రమంలో శనివారం రాత్రి ఒక్కసారిగా వ్యాగన్‌లో మంటలు చెలరేగాయి. వ్యాగన్‌లో ఉన్న ఆయిల్ టిన్నులకు మంటలు అంటుకోవడంతో బోగీ మొత్తం దగ్ధమైంది. రైల్వే సిబ్బంది సమాచారం మేరకు ఏలూరు అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపుచేశారు. ఒక్కసారిగా మంటలు చెలరేగడంతో స్టేషన్‌లో ఉన్న ప్రయాణికులు భయాందోళనకు గురయ్యారు. దీనిపై రైల్వే అధికారులు దర్యాప్తు చేస్తున్నారు.



'పోలవరం' వద్ద ఉద్రిక్తత

- టిడిపి నేతల పర్యటనను అడ్డుకున్న పోలీసులు
- దేవినేని ఉమా సహా పలువురు అరెస్టు

2



వెంకటగిరి ఎంఎల్ఎ ఆనం రామనారాయణరెడ్డి ఇంట్లో భేటీ అయిన టిడిపి నాయకులు

మళ్లీ వేడెక్కిన నెల్లూరు రాజకీయాలు

- త్వరలో టిడిపిలోకి ముగ్గురు ఎంఎల్‌ఎలు

ప్రజాశక్తి- నెల్లూరు ప్రతినిధి

నెల్లూరు జిల్లా రాజకీయాలు మరోసారి వెడెక్కాయి. ఇటీవల వైసిపి నుంచి బహిష్కరణకు గురైన ముగ్గురు ఎంఎల్‌ఎలు టిడిపిలో చేరనున్నారు. ఇందుకు ఆ పార్టీ అధ్యక్షులు నారా చంద్రబాబునాయుడు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. నెల్లూరు ఉమ్మడి జిల్లాలో మొత్తం పది అసెంబ్లీ నియోజకవర్గాలు ఉన్నాయి. అన్ని స్థానాలనూ గత ఎన్నికల్లో వైసిపి గెలుచుకుంది. వెంకటగిరి, ఉదయగిరి, నెల్లూరు రూరల్ ఎంఎల్‌ఎలు ప్రభుత్వంపై గతంలో విమర్శలు చేశారు. దీంతో, అధిష్టానం ఆ ముగ్గురినీ ఒకటన్నర నెలల క్రితం సస్పెండ్ చేసింది. అప్పటి నుంచి ఆ ముగ్గురూ టిడిపిలో చేరుతారని ప్రచారం సాగుతోంది. ఈ నేపథ్యంలో శుక్ర, శనివారాల్లో చోటుచేసుకున్న రాజకీయ పరిణామాలు నెల్లూరులొ హాట్ టాఫిక్‌గా మారాయి. వెంకటగిరి ఎంఎల్‌ఎ ఆనం రామనారాయణరెడ్డి శుక్రవారం రాత్రి హైదరాబాద్‌లో చంద్రబాబునాయుడును కలిశారు. పార్టీలోకి వస్తానని చెప్పడంతో అందుకు ఆయన సానుకూలంగా స్పందించినట్లు తెలిసింది. లోకేష్ పాదయాత్రను విజయవంతం చేయాలని, అటు తరువాత అధికారికంగా పార్టీలో చేరాలని చంద్రబాబునాయుడు సూచించినట్లు సమాచారం. ఈ నేపథ్యంలో శనివారం నెల్లూరులో టిడిపి సీనియర్ నేతలు సంతపేటలోని ఆనం రామనారాయణరెడ్డి నివాసానికి వెళ్లి ఆయనతో భేటీ అయ్యారు. తాను టిడిపిలోకి వస్తానని, కలిసి పనిచేస్తానని, అవసరమైతే ఎంఎల్‌ఎ పదవికి రాజీనామా చేస్తానని

మిగతా 2లో

నేతన్న నేస్తం లబ్దిదారుల నమోదు 20లోగా పూర్తి

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

నేతన్న నేస్తం కింద 2023-24 సంవత్సరానికి సంబంధించి గ్రామ, వార్డు సచివాలయాల ద్వారా నూతన లబ్ధిదారుల నమోదు ప్రక్రియను ఈనెల 20లోగా పూర్తి చేయాలని హ్యాండ్‌లూమ్స్ అండ్ టెక్స్‌టైల్స్ కమిషనర్ శనివారం విధివిధానాలు జారీచేశారు. గ్రామ, వార్డు సెక్రటరియేట్ల ద్వారా కొత్త లబ్దిదారులు, పాత లబ్ధిదారులు (ఇప్పటికే సహాయం పొందిన వారు) ధృవీకరణ ప్రక్రియ ఈనెల 21లోగా పూర్తి చేయాల్సి ఉంటుంది. అదే రోజు ఎంపిడిఓలు, మునిసిపల్ కమిషనర్లు దరఖాస్తులను పరిశీలించి జిల్లాల వారీగా హ్యాండ్లూమ్ అండ్ టెక్స్‌టైల్స్ ఆఫీసర్లు, అసిస్టెంట్ డైరెక్టర్లు, జనరేషన్ ఆఫ్ సోషల్ ఆడిట్ ప్రొవిజనల్‌కు పంపాల్సి ఉంటుంది. 28న సెక్రటరీ స్థాయిలో జాబితా ప్రచురించనున్నారు. 30న దరకాస్తుల ఎంపికపై ఏమైనా అభ్యంతరాలుంటే ఫిర్యాదులను స్వీకరిస్తారు. అర్హుల తుది జాబితాను జులై ఆరోతేదీన తయారు చేయనున్నారు. జిల్లా కలెక్టర్/డిఎల్‌సి ద్వారా జులై 8వ తేదీన తుది జాబితాను ఆమోదించనునానరు. అనంతరం సిఎం ఆదేశాల మేరకు నిధులు విడుదల అవుతాయని అధికారులు ఉత్తర్వులో పేర్కొన్నారు.

క్షీణిస్తున్న మహిళా కార్మిక శక్తి !

- ఉపాధి రంగంలో 20 శాతం కన్నా తక్కువమందే
- లింగ సమానత్వం దిశగా దేశంలో కానరాని పురోగతి



న్యూఢిల్లీ : దేశంలో మహిళా కార్మిక శక్తి ప్రాతినిధ్యం క్షీణిస్తోంది. దేశంలోని మహిళల్లో 20 శాతం కన్నా తక్కువ మందే వేతనాలతో కూడిన ఉద్యోగాల్లో వున్నారు. భారతదేశంలో ఉపాధికి సంబంధించి లింగ వ్యత్యాసం 50.9 శాతంగా వుందని అంతర్జాతీయ కార్మిక సంస్థ (ఐఎల్‌ఓ) డేటా పేర్కొంది. కార్మిక శక్తిలో పురుషుల వాటా 70.1 శాతంగా వుండగా, మహిళా కార్మికుల వాటా కేవలం 19.2 శాతంగా మాత్రమే వుంది. గతేడాది వరల్డ్ ఎకనామిక్ ఫోరమ్ విడుదల చేసిన లింగ వ్యత్యాస నివేదిక ప్రకారం, మొత్తంగా 146 దేశాలకు గానూ భారత్ 135వ స్థానంలో వుంది. శ్రీలంక, బంగ్లాదేశ్, నేపాల్ వంటి చిన్న దేశాల కన్నా వెనుకబడి వుంది. చైనా, పాకిస్తాన్, అజర్‌బైజాన్, కతార్ వంటి దేశాలతో పాటూ ప్రతి ఐదింటిలో ఒక దేశంలో లింగ అసమానతలు ఐదు శాతం దాటి వున్నాయి. లింగ సమానత్వం దిశగా పురోగతి స్లంభించిపోయిందని వరల్డ్ ఎకనామిక్ ఫోరం (డబ్ల్యుఇఎఫ్) పేర్కొంది. కోవిడ్ మహమ్మారి వల్ల ఈ పరిస్థితి మరింత దిగజారింది. మహిళలు ఎక్కువగా పనిచేసే రిటైల్, ఆతిథ్య రంగాలు కోవిడ్ కారణంగా దెబ్బతినడంతో ఉపాధి విషయంలో వారు మరింత ఇబ్బందులు పడ్డారు. ప్రపంచ కార్మిక శక్తిలో పూర్తి స్థాయి లింగ సమానత్వం రావాలంటే మరో 132 ఏళ్ళు పడుతుందని డబ్ల్యుఇఎఫ్ పేర్కొంది. గత రెండు దశాబ్దాల్లో భారతదేశంలో మహిళా కార్మిక ప్రాతినిధ్యం ఆశ్చర్యకరమైన రీతిలో తగ్గింది. 2005లో 32శాతంగా వున్నది 2021నాటికి 19శాతానికి పడిపోయింది. సమాజంలో విభిన్న సామాజిక వర్గాలు, మతాలు, వివిధ వయస్సు గ్రూపులు, గ్రామీణ, పట్టణ ప్రాంతాలవ్యాప్తంగా అందరికీ ఈ పరిస్థితి వర్తించింది. మహిళలు ఉపాధికి దూరంగా వుండేందుకు దారి తీస్తున్న కారణాలు గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో కొద్దిగా భిన్నంగా వున్నాయి. కానీ చాలా కేసుల్లో దాదాపు ఒకేలా వున్నాయని చెప్పవచ్చు. ఇందులో మొదటిది, ప్రధానంగా మహిళలు చేసే పనులకు గుర్తింపు లేకపోవడం, వాటికి ఎలాంటి జీతాలు చెల్లించకపోవడం. ఇక రెండవది, సమాజంలో వుండే నియమ నిబంధనలు, లింగ సమానత్వ అంశాలు - అంటే ఆడది ప్రధానంగా ఇంటి పనులకే పరిమితం కావాలి, ఇంట్లో పనులు చూసుకుని, పిల్లలను చక్కదిద్దుకుంటే చాలనే కన్జర్వేటివ్ భావజాలం ఇందుకు కారణంగా వుంది. ఇటువంటి బాధ్యతలే మహిళలను ఇంటికే కట్టిపడేసేలా చేస్తున్నాయి. ఇక మూడో కారణం వేతనాల చెల్లింపుల్లో అంతరాలు, నాల్గవది మరింత మెరుగైన రీతిలో ప్రభుత్వ చర్యలు, చట్టాలు, ఆర్థిక విధానాలు రూపొందించాల్సిన అవసరం వుంది. లింగ సమానత లోపించడం, మహిళలకు అనువైన ఉపాధి అవకాశాలు కరువవడం, వ్యవసాయంపై ఆధారపడడం, కొన్ని కుటుంబాలకు సంబంధించినంతవరకు పెరిగిన ఆర్థిక సుస్థిరత, ఉద్యోగాలు చేయడం కన్నా చదువుకే ప్రాధాన్యతనివ్వడం, భద్రతాపరమైన ఆందోళనలు వంటివి ప్రధాన కారణాలుగా వున్నాయి. మహిళలు ఉద్యోగాలు చేయకుండా నివారిస్తున్న ఈ సమస్యలను ఎలా ఎదుర్కొనాలనేది కూడా

మిగతా 2లో

మద్యం ఆదాయంతో నడుస్తోంది

- రాష్ట్ర ప్రభుత్వంపై బిజెపి అధినేత నడ్డా వ్యాఖ్య

ప్రజాశక్తి- శ్రీకాళహస్తి (తిరుపతిజిల్లా):

దేశంలో అత్యంత అవినీతి ప్రభుత్వం ఏదైనా ఉందంటే... అది వైఎస్.జగన్మోహన్ రెడ్డి పాలనలోని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వమేనని బిజెపి జాతీయ అధ్యక్షులు జెపి నడ్డా ఆరోపించారు. రాష్ట్రంలో జరుగుతున్న అవినీతి కార్యకలాపాలను మోడీ ప్రభుత్వం చూస్తూ ఊరుకోదని, ఎండగడుతుందని స్పష్టం చేశారు. బిజెపి ప్రభుత్వ తొమ్మిదేళ్ల పాలన, సంక్షేమ పథకాలపై తిరుపతి జిల్లా శ్రీకాళహస్తిలో శనివారం జరిగిన బహిరంగ సభలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. ల్యాండ్, ఇసుక, మద్యం, విద్య, వైద్యం అన్ని రంగాల్లో రాష్ట్ర ప్రభుత్వం అవినీతికి పాల్పడిందంటూ ఆరోపించారు. మద్యం ద్వారా వచ్చే ఆదాయంతోనే ప్రభుత్వం నడుస్తోందంటే జగన్ దిగజారుడు పాలనకు ఇంతకన్నా ఏమి నిదర్శనం కావాలన్నారు. రాష్ట్రంలో శాంతిభద్రతలు క్షీణించాయని, ప్రజలకు భద్రత కరువైందని ఆరోపించారు. అమరావతి కోసం కేంద్ర ప్రభుత్వం నిధులు మంజూరు చేసినా ఎక్కడా అభివృద్ధి జాడలేదని, అసలు రాజధానే లేకుండా నాలుగేళ్లుగా పాలన సాగిస్తున్నారని విమర్శించారు. కేంద్ర ప్రభుత్వం మంజూరు చేస్తోన్న నిధులను జగన్ సర్కార్ దారి మళ్లించి దోచుకుంటోందని ఆరోపించారు. తిరుపతి రైల్వే స్టేషన్‌ను రూ.300 కోట్లతో ఆధునీకరిస్తున్నట్లు తెలిపారు. రూ.1400 కోట్లతో ఏర్పేడు వద్ద ఐఐటి, ఐజర్ సంస్థలు త్వరలో ప్రారంభానికి నోచుకోనున్నాయన్నారు. నరేంద్ర మోడీ పాలనలో భారతదేశ ఆర్థిక వ్యవస్థ అభివృద్ధి వైపు పరుగులు తీస్తోందని పేర్కొన్నారు. ప్రధాన మంత్రి ఆవాస్ యోజన కింద మూడు కోట్ల ఇంటి నిర్మాణాలు చేపట్టిందన్నారు. జనధన్ పథకం ద్వారా 50 కోట్ల మందికి కేంద్ర ప్రభుత్వ పథకాల లబ్ధిని చేకూరుస్తూ వారి ఖాతాల్లోకి నేరుగా నగదు జమచేస్తోందని తెలిపారు. మొబైల్ ఫోన్ల తయారీ, ఎగుమతుల్లో ఎదిగిందని తెలిపారు. ఆపిల్ ఫోన్ల తయారీ కూడా మనదేశంలో జరుగుతోందన్నారు. బిజెపి నాయకులు సోము వీర్రాజు, కోలా ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.



సభా వేదికపై అభివాదం చేస్తున్న, జెపి నడ్డా, బిజెపి నాయకులు

డిజిటల్ చెల్లింపుల్లో భారత్ టాప్

న్యూఢిల్లీ : డిజిటల్ చెల్లింపుల్లో ప్రపంచంలోనే భారత్ అగ్రశ్రేణి దేశంగా ఉంది. 2022లో 8.95 కోట్ల లావాదేవీలను నమోదు చేసిందని కేంద్ర ప్రభుత్వానికి చెందిన 'మైగవ్ఇండియా' పోర్టల్ వెల్లడించింది. భారత్ తర్వాత బ్రెజిల్ 2.92 కోట్లతో రెండో స్థానంలో, చైనా 1.76 కోట్ల లావాదేవీలతో మూడో స్థానంలో నిలిచింది. థాయిలాండ్ 1.65 కోట్లతో నాలుగో స్థానంలో, ఐదో స్థానంలో సౌత్ కోరియా 80 లక్షల లావాదేవీలను నమోదు చేసిందని మైగవ్ఇండియా వెల్లడించింది. డిజిటల్ చెల్లింపుల్లో భారత్ ప్రథమ స్థానంలో ఉందని, దేశ గ్రామీణ ఆర్థిక వ్యవస్థ రూపాంతరం చెందుతుందని ఇటీవల ప్రధాని మోడి పేర్కొన్న విషయాన్ని కూడా ఈ సందర్భంగా మైగవ్ఇండియా ప్రస్తావించింది. కానీ.. ప్రపంచంలోనే అతిఎక్కువ జనాభా కలిగిన భారత ప్రజల నిష్పత్తితో పోల్చితే.. చిన్న దేశాల్లోనే డిజిటల్ లావాదేవీలు మెరుగ్గా ఉండటం గమనార్హం. ఉదాహరణకు బ్రెజిల్ జనాభా 21 కోట్లు ఉంటే.. దాదాపు మూడు కోట్ల లావాదేవీలు జరిగాయి. అదే 140 కోట్ల జనాభా కలిగిన భారత్‌లో 8 కోట్ల లావాదేవీలు నమోదయ్యాయి. ఈ రెండింటిని పోల్చి చూస్తే భారత్ ఇంకా వెనుకబడే ఉందని స్పష్టం అవుతోందని నిపుణులు పేర్కొంటున్నారు.

అమెజాన్ అడవుల్లో అద్భుతం !

40రోజుల అనంతరం సజీవంగా బయటపడిన నలుగురు చిన్నారులు



బొగొటా, కొలంబియా : అమెజాన్ అడవుల్లో అద్భుతం చోటు చేసుకుంది. 40రోజుల క్రితం జరిగిన విమాన ప్రమాదంతో కారడవుల్లో తప్పిపోయిన నలుగురు చిన్నారులు సజీవంగా దొరికారు. కొలంబియా సైనికుల గాలింపు చర్యల్లో వీరిని కనుగొన్నట్లు అధికారులు ప్రకటించారు. వెంటనే వారిని బొగొటా తీసుకువచ్చి ఆస్పత్రిలో ఆరోగ్య పరీక్షలు చేశారు. అధ్యక్షుడు గుస్తావో పెట్రో ఈ వార్త విన్నంతనే ఆనందం వ్యక్తం చేశారు. త్వరలోనే వారితో మాట్లాడాలని అనుకుంటున్నట్లు చెప్పారు. ఒక తల్లి పిల్లలైన వీరు వరుసగా 13, 9, 4, 11మాసాల వయసున్న వారు. ఈ 40రోజులు వారు ఎలా వున్నారు, ఏం చేశారు, తిన్నారు వంటి వివరాలేమీ ఇంకా తెలియరాలేదు. పిల్లలతో సైనికులు, వలంటీర్ల బృందం దిగిన ఫోటోను కొలంబియా మిలటరీ ట్వీట్ చేసింది. థర్మల్ బ్లాంకెట్‌లలో పిల్లలను కప్పి వుంచారు. మరొక సైనికుడు ఆ పసిబిడ్డ నోటికి బాటిల్ అందిస్తున్న దృశ్యాలు వైరల్ అయ్యాయి. మే 1వ తేదీన తెల్లవారు జామున సింగిల్ ఇంజను విమానం కుప్పకూలింది. ఆ సమయంలో విమానంలో ఆరుగురు ప్రయాణికులు వున్నారు. ఇంజను వైఫల్యంతో విమానం కూలిపోతోందని పైలట్ ప్రకటించారు. ఆ వెంటనే రాడార్ నుండి విమానం కనుమరుగై పోయింది. దీంతో వారిలో ఎవరైనా జీవించి వుంటారేమోననే ఆశతో తీవ్ర స్థాయిలో గాలింపు చర్యలు చేపట్టారు. కన్ను పొడుచుకున్నా కానరాని ఆ దట్టమైన అడవుల్లో యుద్ధ ప్రాతిపదికన గాలింపు చేపట్టారు. రెండు వారాల తర్వాత గాలింపు బృందానికి విమాన శిథిలాలు కనిపించాయి. అక్కడ ముగ్గురు పెద్దల మృత దేహాలు కనిపించాయి. కానీ పిల్లలు ఎక్కడున్నారో తెలియరాలేదు. దాంతో కొలంబియా ఆర్మీ గాలింపును ఉధృతం చేసింది. జాగిలాలతో 150మంది సైనికులు ఆ ఏరియాలోకి దిగారు. అక్కడి ఆదివాసీ గిరిజన తెగల వలంటీర్లు కూడా ఈ గాలింపు చర్యల్లో పాల్గొన్నారు.

'పోలవరం' వద్ద ఉద్రిక్తత

- టిడిపి నేతల పర్యటనను అడ్డుకున్న పోలీసులు
- మాజీ మంత్రి ఉమా సహా పలువురు అరెస్టు



తూర్పుగోదావరి జిల్లా గోపాలపురం స్టేషన్ వద్ద నిరసన తెలియజేస్తున్న టిడిపి నాయకులు, కార్యకర్తలను లాగేస్తున్న పోలీసులు

ప్రజాశక్తి- బుట్టాయగూడెం (ఏలూరు జిల్లా), గోపాలపురం (తూర్పుగోదావరి జిల్లా)

పోలవరం ప్రాజెక్టు పనుల పరిశీలనకు వెళ్తున్న టిడిపి నాయకులను పోలీసులు అడ్డుకున్నారు. ఏలూరు, తూర్పుగోదావరి జిల్లాల్లో అరెస్టులకు పాల్పడ్డారు. దీంతో, ఉద్రిక్తత నెలకొంది. పోలవరం ప్రాజెక్టు పనులను పరిశీలించేందుకు టిడిపి ప్రజాప్రతినిధులు, నాయకులు శనివారం ఉదయం కార్లలో వచ్చారు. ప్రాజెక్టు సమీపంలో రోడ్డు పక్కన కార్లను ఉంచి పాదయాత్రగా బయలుదేరారు. మాజీ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు ద్విచక్ర వాహనంపై ముందుగా బయలుదేరగా, ఆయన వెనుక టిడిపి నాయకులు ప్రదర్శనగా వెళ్తుండగా పోలవరం చెక్‌పోస్టు వద్ద పోలీసులు వారిని అడ్డుకున్నారు. ప్రాజెక్టు సందర్శనకు ప్రభుత్వ అనుమతి లేదంటూ ముందుకు కదలనీయలేదు. దీంతో, వాగ్వివాదం చేసుకుంది. ఈ నేపథ్యంలో దేవినేని సహా పలువురు టిడిపి నాయకులను, పోలీసులు అరెస్టు చేసి బుట్టాయగూడెం పోలీస్ స్టేషన్‌కు తరలించారు. సాయంత్రం ఆరు గంటల సమయంలో వారిని విడుదల చేశారు. ఈ సందర్భంగా స్టేషన్ వద్ద ఉమామహేశ్వరరావు, టిడిపి నాయకులు జవహర్, బొరగం శ్రీనివాస్ మాట్లాడుతూ టిడిపి ప్రభుత్వ హయాంలో ప్రజలను, రైతులను కొన్ని వందల బస్సుల్లో తీసుకెళ్లి పోలవరం ప్రాజెక్టును చూపించామన్నారు. వైసిపి ప్రభుత్వం నిర్వాసితులను, మీడియాను, ప్రజలను, ప్రతిపక్ష పార్టీల నేతలను ప్రాజెక్టు వద్దకు వెళ్లనీయకుండా అడ్డుకోవడంలో ఆంతర్యమేమిటని ప్రశ్నించారు. ముఖ్యమంత్రి వైఎస్.జగన్మోహన్‌రెడ్డి పోలవరం ప్రాజెక్టును నాశనం చేస్తున్నారని విమర్శించారు. తమ హయాంలో 72 శాతం ప్రాజెక్టు పనులు పూర్తయ్యాయని తెలిపారు. వైసిపి అధికారంలోకి రాగానే ఆ పనులను నిలిపివేసిందని, రివర్స్ టెండరింగ్ అంటూ డ్రామాలు ఆడిందని విమర్శించారు. పనులు శరవేగంగా చేపడుతున్న నవయుగ కంపెనీని వెళ్లగొట్టి రివర్స్ టెండరింగ్ పేరుతో వెయ్యి కోట్లు పక్కదారి పట్టించారని ఆరోపించారు. ప్రాజెక్టు నిర్మాణానికి సర్వం త్యాగం చేసిన నిర్వాసితులను ఘోరంగా మోసం చేశారని విమర్శించారు. పూర్తి స్థాయిలో పరిహారం ఇవ్వకుండా గ్రామాలను ఖాళీ చేయించారని, నిర్వాసిత కాలనీల్లో కనీస వసతుల్లేక నిర్వాసితులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. నిర్వాసితుల ఉసురుతో ఈ ప్రభుత్వం గోదావరిలో కలిసిపోతుందన్నారు.

'తూర్పు'లో ఎంఎల్‌ఎ నిమ్మల అరెస్టు

పోలవరం ప్రాజెక్టు పనుల పరిశీలనకు పాలకొల్లు ఎంఎల్‌ఎ నిమ్మల రామానాయుడు, టిడిపి ఏలూరు జిల్లా పార్లమెంటు అధ్యక్షులు, మాజీ ఎంఎల్‌ఎ గన్ని వీరాంజనేయులు, టిడిపి ఏలూరు జిల్లా ఇన్‌ఛార్జి బడేటి రాధాకృష్ణ (చంటి), టిడిపి గోపాలపురం నియోజకవర్గ ఇన్‌చార్జి మద్దిపాటి వెంకట్రాజులతో కూడిన బృందం బయలుదేరింది. ఈ విషయం తెలుసుకున్న తూర్పుగోదావరి జిల్లా గోపాలపురంలో పోలీసులు బారికేడ్లను అడ్డంగా పెట్టారు. ఈ విషయం తెలుసుకున్న టిడిపి నాయకులు వేరే మార్గంలో పోలవరానికి బయలుదేరారు. వారిని పోలీసులు వెంబడించి కొవ్వూరుపాడు శివారులో అరెస్టు చేసి గోపాలపురం పోలీస్ స్టేషన్‌కు తరలించారు.

అక్రమ అరెస్టులను ఖండిస్తూ పోలీస్ స్టేషన్ల వద్ద నిరసన

అరెస్టులను ఖండిస్తూ టిడిపి నాయకులు, కార్యర్తలు బుట్టాయగూడెం, గోపాలపురం పోలీస్ స్టేషన్ల వద్ద నిరసన తెలిపారు. బుట్టాయగూడెంలో మండుటెండలో బైఠాయించారు. గోపాలపురంలో మాజీ ఎంఎల్‌ఎ ముప్పిడి వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో పోలీస్ స్టేషన్ వద్ద ధర్నా చేశారు. ఈ సందర్భంగా పోలీసులకు, నాయకులకు మధ్య వాగ్వాదం, తీవ్ర తోపులాట చోటుచేసుకుంది. నాయకులు, కార్యకర్తలను పోలీసులు పక్కకులాగేశారు. నిమ్మల రామానాయుడు తదితరులను వారి ఇళ్లకు తరలించారు.

అక్రమాలు బయటపడతాయనే ప్రభుత్వం ఆంక్షలు : అచ్చెన్నాయుడు

పోలవరం ప్రాజెక్టులో అక్రమాలు, అవకతవకలు బయటపడతాయనే టిడిపి నేతలను ప్రాజెక్టు సందర్శనకు అనుమతివ్వకుండా రాష్ట్ర ప్రభుత్వం అడ్డుకొని అరెస్టు చేసిందని ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు కింజరాపు అచ్చెన్నాయుడు విమర్శించారు. శ్రీకాకుళం జిల్లా కోటబొమ్మాళిలో ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డికి దమ్ముంటే పోలవరం ప్రాజెక్టును అఖిలపక్షం సందర్శించే అవకాశం ఇవ్వాలన్నారు. ఎన్ని ఆంక్షలు పెట్టినా టిడిపి పోలవరాన్ని సందర్శించి అవినీతి, అక్రమాలను ప్రజలకు బహిర్గతం చేస్తామని చెప్పారు.

14న ఎపి ఇఎపిసెట్-23 ఫలితాలు విడుదల

- జెఎన్‌టియు విసి రంగజనార్ధన

ప్రజాశక్తి-అనంతపురం

ఎపి ఇఎపిసెట్ -23 ఫలితాలను ఈ నెల 14న విడుదల చేయనున్నట్లు ఎపిఇఎపిసెట్-23 చైర్మన్ రంగజనార్ధన తెలిపారు. ఫలితాలకు సంబంధించిన వివరాలను పరీక్షల నిర్వహణ కన్వీనర్ ఆచార్య సి.శోభాబిందుతో కలిసి శనివారం మీడియాకు వెల్లడించారు. అనంతపురం జెఎన్‌టియు, ఆంధ్రప్రదేశ్ ఉన్నత విద్యామండలి సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన ఎపి ఇఎపిసెట్-23 ఇంజనీరింగ్, అగ్రికల్చర్, ఫార్మసీ విభాగాల్లో ప్రవేశం కోసం మే 15 నుంచి 23వ తేదీ వరకు పరీక్షలు జరిగాయన్నారు. ఇంజనీరింగ్ విభాగంలో 2,24,724, అగ్రికల్చర్, ఫార్మసీ విభాగాల్లో 90,573 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరయ్యారని తెలిపారు. వీటి ఫలితాలను ఈ నెల 14న ఉదయం 10.30 గంటలకు రాష్ట్ర విద్యాశాఖా మంత్రి బొత్స సత్యనారాయణ విజయవాడలో విడుదల చేస్తారని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ఉన్నత విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ జె.శ్యామల రావు, ఎపి ఉన్నత విద్యా మండలి చైర్మన్ ఆచార్య కె.హేమచంద్రా రెడ్డి పాల్గొంటారని తెలిపారు.

ప్రజాశక్తిపై స్పందన ఫోన్ : 9490099006

ప్రజల పత్రికకు ప్రజలే మార్గదర్శకులు. ప్రజాశక్తిలో మీకు నచ్చిన నచ్చని అంశాలను ఎప్పటికప్పుడు మా దృష్టికి తీసుకువస్తే మరింత పదును పెట్టుకోవడానికి వీలవుతుంది.

94900 99006 ఫోన్ నెంబర్‌కు ఆదివారం మినహా ప్రతి రోజూ మధ్యాహ్నం 12 నుంచి సాయింత్రం 6 గంటల మధ్య మీ అభిప్రాయాలు తెలియజేయవచ్చు. మీరు చెప్పేది క్లుప్తంగా సూటిగా పద్ధతిగా వుండాలి. ఇప్పటికే చాలా మంది పంపుతున్న విమర్శలు, సూచనలు మాకు బాగా ఉపయోగపడుతున్నాయి. వారందరికీ కృతజ్ఞతలు.

అభిప్రాయాలు పంపదలిస్తే..

స్పందన, ప్రజాశక్తి తెలుగు డైలీ, ప్రజాశక్తి భవనం-అమరరెడ్డి కాలనీ, అరవింద హైస్కూల్ దగ్గర, తాడేపల్లి, గుంటూరు జిల్లా - 522 501కు కానీ **editorprajasakthi@gmail.com**కు పంపవచ్చు.

గ్రూప్-1 పరీక్షకు 84.05 శాతం హాజరు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

గ్రూప్-1 పోస్టుల భర్తీ కోసం ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (ఎపిపిఎస్‌సి) నిర్వహించిన ప్రధాన పరీక్ష శనివారంతో ముగిసింది. ఈ నెల 3 నుంచి 10వ తేది వరకు జరిగిన పరీక్షలకు 84.05 శాతం మంది అభ్యర్థులు హాజరయ్యారని ఎపిపిఎస్‌సి కార్యదర్శి జె ప్రదీప్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా 10 చోట్ల 11 పరీక్ష కేంద్రాల్లో ఈ పరీక్ష జరిగిందని వివరించారు. మొత్తం 6,455 మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకోగా వీరిలో 5982 మంది హాల్ టిక్కెట్లు డౌన్‌లోడ్ చేసుకున్నారని తెలిపారు. వీరిలో 5028 (84.05 శాతం) మంది పరీక్షకు హాజరయ్యారని వెల్లడించారు.

క్షీణిస్తున్న మహిళా కార్మిక శక్తి !

(మొదటి పేజీ తరువాయి)

ప్రధాన సమస్యగానే వుంది. వ్యక్తిగతంగా, సమాజపరంగా, ప్రభుత్వాల స్థాయిలో అనేక మార్పులు తీసుకువస్తేనే సమస్య పరిష్కారమవుతుంది. మహిళలు పనిచేయగల ఒక వాతావరణాన్ని ఏర్పాటు చేయాల్సి వుంటుంది. ఒక దేశం పురోగతి సాధించాలన్నా, ఆర్థిక ప్రగతిని అందుకోవాలన్నా ఈ సవాళ్ళన్నింటినీ పరిష్కరించి, మహిళల సేవలను, వారి శ్రమను ఆర్థికంగా, సమాజపరంగా గుర్తించడం చాలా కీలకం. లింగ వ్యత్యాసాలను రూపుమాపడానికి కొన్ని వ్యూహాలను అనుసరించాలని అంతర్జాతీయ కార్మిక సంస్థ సూచించింది. సమాన విలువ గల పనికి సమాన వేతనానికి హామీ కల్పించడం, ఇందుకు చట్టపరమైన రక్షణ కల్పించడం, వేతనాల్లో పారదర్శకత, చట్టపరమైన చర్యల ద్వారా లింగ వివక్షను, వేధింపులను నిర్మూలించడం, మహిళల్లో చైతన్యం తీసుకువచ్చేలా ప్రచారాలు నిర్వహించడం చేపట్టాలని సూచించింది. దేశంలో మహిళా ఉపాధిని మరింత పెంపొందించాలంటే మహిళా పారిశ్రామికవేత్తలకు ఆర్థిక తోడ్పాటును అందించే చొరవలు తీసుకోవడం, మెరుగైన విద్య, శిక్షణ, భద్రతాపరమైన చర్యలు ఉపాధి అవకాశాల పెంపు, మరింత మెరుగైన పని విధానాలు, పిల్లల సంరక్షణకు తగినచర్యలు తీసుకోవాల్సి వుందని పేర్కొంది.

దళితుల భూముల్లో అక్రమ తవ్వకాలు

- మట్టి మాఫియాపై చర్యలు తీసుకోవాలి
- ముఖ్యమంత్రి జగన్‌కు చంద్రబాబు లేఖ

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

పశ్చిమ గోదావరి జిల్లా యలమంచిలి మండలం చించినాడ, ఏనుగువానిలంక గ్రామాల్లో దళితులకు చెందిన భూముల్లో అక్రమ మట్టి తవ్వకాలు జరుగుతున్నాయని టిడిపి అధినేత చంద్రబాబు నాయుడు తెలిపారు. ఈ అక్రమ తవ్వకాలకు పాల్పడుతున్న మట్టి మాఫియాపై చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికి ఆయన శనివారం లేఖ రాశారు. అసైన్డ్ భూముల్లో 60 ఏళ్లుగా దళితులు సాగుచేసుకుంటున్నారని తెలిపారు. వైసిపి ఎమ్మెల్యే ముదునూరి ప్రసాద్ రాజు, ఎమ్మెల్సీ కౌరు శ్రీనివాస్ అనుచరుల ద్వారా నిబంధనలకు విరుద్ధంగా ఈ అక్రమ తవ్వకాలు చేస్తున్నారని తెలిపారు. ఈ తవ్వకాలను నిరసిస్తూ ఈ నెల 6న దళితులు నిరసనలకు దిగితే పోలీసులు వారిపైనే లాఠీఛార్జ్ చేశారని వెల్లడించారు. గాయపడిన వారికి సత్వర వైద్యం అందించకపోగా పోలీసులు బాధితులను కులం పేరుతో దారుణంగా దూషించారని వివరించారు. తీవ్ర గాయాలైన వారిని సమీపంలోని పాలకొల్లు ఆస్పత్రికి తరలించకుండా దాదాపు 70 కిలోమీటర్ల దూరంలో ఉన్న తాడేపల్లిగూడెం ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లారని తెలిపారు. మెడికో లీగల్ కేసుగా వైద్యులు పోలీసులకు సమాచారం అందించినప్పటికీ తీవ్ర గాయాలతో రక్తస్రావం అయిన బాధితుల నుంచి పోలీసులు ఎటువంటి వాంగ్మూలం తీసుకోలేదని పేర్కొన్నారు. శాంతియుతంగా ఆందోళన చేస్తున్న దళితులపై పోలీసులు లాఠీఛార్జీ చేసి, అక్రమంగా నిర్బంధించాల్సిన అవసరం ఏమిటని లేఖలో చంద్రబాబు ప్రశ్నించారు. అక్రమ తవ్వకాలను ప్రభుత్వం ఎందుకు అనుమతిస్తోందని ప్రశ్నించారు. పోలీసులు అధికార పార్టీ గూండాల్లా ప్రవర్తిస్తున్న తీరు విస్మయం కలిగిస్తోందన్నారు. అక్రమ తవ్వకాలను అడ్డుకునే క్రమంలో 9న ఉదయం 3 గంటల ప్రాంతంలో 9 ట్రక్కులను స్థానికులు పట్టుకున్నారని తెలిపారు. ఈ అక్రమ రవాణాపై పక్కా ఆధారాలు లభ్యమైనా ఎలాంటి చర్యలు తీసుకోకుండా పోలీసులే మట్టి మాఫియాకు సహాయం చేస్తున్నారని పేర్కొన్నారు. నిబంధనలకు విరుద్ధంగా గోదావరి నుంచి 200 మీటర్ల పరిధిలో తవ్వకాలు జరుపుతున్నారని, భారీ రవాణా వాహనాలు నది గట్టుపై ప్రయాణించడం వల్ల రివర్ బెండ్ దెబ్బతింటుందని తెలిపారు. దీని వల్ల ఆకస్మిక వరద ముప్పుకు అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. రవాణా కోసం ఏకంగా గ్రావెల్ రోడ్లను నిర్మించారని, దీనిపై హైకోర్టు స్టే ఆర్డర్ ఉన్నా ధిక్కరించి అక్రమ రవాణాకు పాల్పడుతున్నారని వివరించారు. పేదల ఇళ్ల నిర్మాణం కోసం మట్టి తరలింపు అని చెబుతున్నా ఇక్కడ తవ్విన దాంట్లో 80 శాతం ఇతర ప్రాంతాలకు అక్రమంగా రవాణా చేస్తున్నారని చంద్రబాబు పేర్కొన్నారు. దళితులను గాయపరిచి, దుర్భాష లాడిన పోలీసు అధికారులపై వెంటనే తగు చర్యలు తీసుకోవాలని, అక్రమ రవాణాకు పాల్పడుతున్న వారిని తక్షణమే అరెస్టు చేసి, తవ్వకాలను వెంటనే నిలిపివేయాలని డిమాండ్ చేశారు.

మరో 2 రోజులు వడగాల్పులు

- నేడు 50 మండలాల్లో మరింత తీవ్రం
- విపత్తుల నిర్వహణ సంస్థ వెల్లడి

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రాష్ట్రంలో మరో రెండు రోజులు వడగాల్పులు ప్రభావం చూపనున్నాయి. ఈ మేరకు రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ ఎండి డాక్టర్ బిఆర్ అంబేద్కర్ శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ నెల 11న 50 మండలాల్లో తీవ్ర వడగాల్పులు, 219 మండలాల్లో వడగాల్పుల ప్రభావం ఉంటుందని తెలిపారు. ఈ నెల 12న 100 మండలాల్లో తీవ్ర వడగాల్పులు, 119 మండలాల్లో వడగాల్పులు వీచే అవకాశముందని పేర్కొన్నారు. శనివారం విజయనగరం జిల్లా అక్కివరంలో 44.8 డిగ్రీల సెల్షియస్, విశాఖ జిల్లా పద్మనాభం, ప్రకాశం జిల్లా జువ్విగుంటలో 44.7 డిగ్రీలు, నెల్లూరు జిల్లా ఉదయగిరి, శ్రీకాకుళం జిల్లా పలాసలో 45.6 డిగ్రీలు, అనకాపల్లిలో 44.3 డిగ్రీల సెల్షియస్ చొప్పన అధిక ఉష్ణోగ్రతలు నమోదైనట్లు తెలిపారు. 60 మండలాల్లో తీవ్ర వడగాల్పులు, మరో 116 మండలాల్లో వడగాల్పులు వీచాయని పేర్కొన్నారు. ఎండల తీవ్రత దృష్ట్యా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. మరో వైపు అక్కడక్కడ ఈదురుగాలులతో కూడిన వర్షాలతో పాటు పిడుగులు పడే అవకాశముందని పేర్కొన్నారు. పొలాల్లో పనిచేసేవారు, పశువుల కాపరులు చెట్ల క్రింద ఉండరాదని హెచ్చరించారు.

తొమ్మిదేళ్లు 'స్మార్ట్' మీటర్ల భారం

- బిగించేందుకు సిద్ధమైన డిస్కంలు
- వ్యవసాయ కనెక్షన్లకు ప్రతి నెల 231.21
- గృహాలకు 109.74

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

విద్యుత్ వినియోగదారులను ఇప్పటికే ట్రూఅప్, ఇతర భారాలు వెంటాడుతున్నాయి. వీటికి తోడు ఇక నుంచి స్మార్ట్ మీటర్ల భారాలు కూడా కలిసి వినియోగదారుల నడ్డి విరవనున్నాయి. కేంద్రప్రభుత్వం తీసుకొచ్చిన రీవ్యాంప్డ్ డిస్ట్రిబ్యూషన్ సెక్టార్ స్కీం(ఆర్‌డిఎస్‌ఎస్)లో రాష్ట్రప్రభుత్వం వ్యవసాయ కనెక్షన్లకు స్మార్ట్ మీటర్లు, గృహ, వాణిజ్య, ప్రభుత్వ కార్యాలయాలు, పరిశ్రమ లకు స్మార్ట్ ప్రిపెయిడ్ మీటర్లను బిగించనుంది. ఇందుకు అవసరమైన టెండర్లను కూడా ఇటీవల జరిగిన రాష్ట్రమంత్రిమండలి ఆమోదం తెలిపింది. వ్యవసాయ కనెక్షన్ల మీటర్ల టెండర్‌ను షిరిడి సాయి ఎలక్ట్రికల్‌కు, ప్రిపెయిడ్ మీటర్ల టెండర్‌ను అదానీ సంస్థకు దక్కాయి. వ్యవసాయ కనెక్షన్లకు సంబంధించిన ఒక్కో స్మార్ట్ మీటర్‌కు రూ.36,975 లకు, గృహ, వాణిజ్య, పరిశ్రమలకు బిగించనున్న స్మార్ట్ ప్రిపెయిడ్ మీటర్లకు రూ.10,205.82లకు ఆమోదం తెలిపింది. రాష్ట్రంలో మొత్తం 1.96కోట్ల విద్యుత్ కనెక్షన్లు ఉన్నాయి. ఇందులో 18.62లక్షల వ్యవసాయ కనెక్షన్లు ఉన్నాయి. దీనికోసం మొత్తం రూ.6,888కోట్లకు టెండర్లు ఖరారు అయ్యాయి.

అయితే ఈ మొత్తాన్ని కంపెనీ కి ఒకేసారి కాకుండా ప్రతి నెల రూ.231.21లు చొప్పున 93 నెలలు పాటు చెల్లించాల్సి ఉంటుంది. వ్యవసాయ మీటర్లకు అయ్యే ఖర్చు తామే చెల్లిస్తామని ప్రభుత్వం చెబుతున్నా ఈ భారం అంతిమంగా వినియోగదారులపైనే పడనుంది. ఇక ప్రిపెయిడ్ మీటర్ల విషయానికి వస్తే మొదటి దశ కింద ఈ ఏడాది డిసెంబర్ చివరి నాటికి 27.68 లక్షల కనెక్షన్లకు బిగించాలని రాష్ట్రప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. వీటిల్లో 4.72లక్షల గృహాలు, 3.7లక్షల ఫీడర్ల వద్ద, 3.22 లక్షల ప్రభుత్వ కార్యాలయాలు, 1.19 లక్షలు పరిశ్రమలకు, 15.47లక్షల వాణిజ్య వినియోగదారులకు బిగించేందుకు డిస్కంలు సిద్ధమ య్యాయి. ప్రిపెయిడ్ మీటర్ ధర రూ.10,205. 82లుగా టెండర్‌ను డిస్కంలు ఫైనల్ చేశాయి. దీనికి కూడా 93 నెలలు చొప్పున జిఎస్‌టితో కలిపి రూ.109.74లు చొప్పున వినియోగదారులు చెల్లించాలి. మొదటి దశ పూర్తికాగానే 2025 డిసెంబర్ నాటికి రెండో దశలో మరో 13.5లక్షల కనెక్షన్లకు ఈ ప్రిపెయిడ్ మీటర్లకు డిస్కంలు టెండర్లు పిలుస్తాయి. మిగిలిన కనెక్షన్లకు కూడా దశల వారీగా అమర్చనున్నాయి. 1.60కోట్లకు ప్రిపెయిడ్ మీటర్లను అమర్చేందుకు ఈ టెండర్ ప్రకారం సుమారు రూ.16,500కోట్లు అవుతుంది. రెండో దశలో గానీ, ఆ తరువాత దశల్లో గానీ ధరలు పెరిగాయని మరలా మీటర్ల ధరలు పెంచే అవకాశం లేకపోలేదు.

రాష్ట్రంలోనే అధిక ధర

వ్యవసాయ కనెక్షన్లకు బిగించే స్మార్ట్ మీటర్ల ధర రాష్ట్రంలోనే అధికంగా ఉంది. రాజస్థాన్‌లో ఒక్కో మీటర్ నిర్వహణతో కలిపి రూ.7945లు, ఛండీఘర్‌లో రూ.9710లు మాత్రమే ధర ఉంది. ఇటీవల ఉత్తరప్రదేశ్‌కు చెందిన విద్యుత్ పంపిణీ సంస్థ గృహ, వాణిజ్య కనెక్షన్ల కోసం ప్రిపెయిడ్ మీటర్లకు టెండర్ పిలవగా అదానీ సంస్థ రూ.10వేలకు కోడ్ చేసింది. ఎక్కువ ధరకు కోడ్ చేసిందని ఉత్తరప్రదేశ్ డిస్కం అదానీ టెండర్‌ను రద్దు చేసింది. ఇప్పుడు అదే అదానీ సంస్థకు అక్కడి కంటే ఎక్కువగా సుమారు రూ.10,300లకు రాష్ట్రప్రభుత్వం ఖరారు చేసింది.

కౌలు రైతులను నిర్లక్ష్యం చేస్తే ప్రభుత్వం పతనం తప్పదు



పాదయాత్రలో పాల్గొన్న నాయకులు

- ఎపి కౌలు రైతు, రైతు, వ్యకాస నాయకులు
- కృష్ణా జిల్లాకు చేరుకున్న కౌలు రైతు రక్షణ యాత్ర

ప్రజాశక్తి-యంత్రాంగం

కౌలు రైతులను నిర్లక్ష్యం చేస్తే ప్రభుత్వానికి పతనం తప్పదని ఎపి కౌలు రైతు, రైతు, వ్యవసాయ కార్మిక సంఘాల నేతలు హెచ్చరించారు. కౌలు రైతుల చట్టాన్ని మార్పు చేయాలని, భూ యజమాని సంతకం నిబంధన తొలగించి.. కౌలు రైతులందరికీ గుర్తింపు కార్డులు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ ఎపి కౌలు రైతు సంఘం ఆధ్వర్యంలో కౌలు రైతు రక్షణ యాత్ర కొనసాగుతోంది. అనకాపల్లి జిల్లా నుంచి ప్రారంభమైన జాతా, నెల్లూరు జిల్లాలో ప్రారంభమైన మరో కృష్ణా జిల్లాలోని తోట్లవల్లూరుకు చేరాయి. ఈ సందర్భంగా తోట్లవల్లూరులో శనివారం పాదయాత్ర నిర్వహించారు. పాదయాత్రను ఎపి వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు దడాల సుబ్బారావు జెండా ఊపి ప్రారంభించారు. తొలుత తోట్లవల్లూరు సెంటర్‌లో జరిగిన బహిరంగ సభకు ఎపి కౌలు రైతు సంఘం కృష్ణాజిల్లా అధ్యక్షులు కె.శివనాగేంద్రం అధ్యక్షత వహించారు. సభలో ఎపి కౌలు రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు వై.రాధాకృష్ణ మాట్లాడుతూ.. దేశానికి ఆహార భద్రత అందిస్తూ, గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి కల్పిస్తున్న కౌలు రైతుల పట్ల ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందన్నారు. కేంద్ర ప్రభుత్వం మెడలు వంచిన ఢిల్లీ రైతాంగ ఉద్యమం స్ఫూర్తితో పోరాడి హక్కులు సాధించుకుందామని, కౌలు రైతులు ఐక్యంగా పోరాడాలని పిలుపునిచ్చారు. పంట సాగు హక్కు పత్రాలు మంజూరుకు భూ యజమాని సంతకం తప్పని సరి చేస్తూ తీసుకొచ్చిన 2019 చట్టం కౌలు రైతులకు తీవ్ర నష్టం చేస్తోందన్నారు. వెంటనే ఈ నిబంధనను తొలగించాలని డిమాండ్ చేశారు. ఎపి వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు దడాల సుబ్బారావు మాట్లాడుతూ వాస్తవ సాగుదారులైన కౌలు రైతులకు నామమాత్రంగానే సిసిఆర్‌సి మంజూరవుతున్నాయని తెలిపారు. సిసిఆర్‌సిలు మంజూరైన కౌలు రైతుల పేర్లను ఈ క్రాప్‌లో నమోదు చేయడం లేదన్నారు. దీంతో కౌలు రైతులకు పంట రుణాలు అందక ప్రయివేటు వ్యాపారుల వద్ద వేలాది రూపాయలు అధిక వడ్డీలకు తెచ్చి నష్టపోవాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఎపి రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎం.సూర్యనారాయణ మాట్లాడుతూ వ్యవసాయ సంక్షోభం కారణంగా భూ యజమానులు సాగు వదిలిపెట్టి భూములను కౌలుకు ఇస్తున్నారన్నారు. ప్రభుత్వానికి చిత్తశుద్ధి లోపించడంతోనే కౌలు రైతులకు సిసిఆర్‌సిలు అందడంలేదని తెలిపారు. ఆదాయ, కుల, ఇతర ధ్రువీకరణ పత్రాలను క్షేత్రస్థాయిలో పరిశీలించి ఇస్తున్న అధికారులు సిసిర్‌సి కార్డులకు మాత్రం భూ యజమాని ఆమోదం తప్పనిసరి అనడం దారుణమన్నారు. ఎపి కౌలు రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.హరిబాబు, రాష్ట్ర కమిటీ సభ్యులు లక్ష్మీపతి, కృష్ణాజిల్లా కార్యదర్శి పంచకర్ల రంగారావు, తదితరులు పాల్గొన్నారు. అనంతరం వల్లూరుపాలెం సెంటర్ వరకూ పాదయాత్ర కొనసాగింది. గన్నవరం, హనుమాన్‌జంక్షన్‌లో జాతాలకు ఘన స్వాగతం లభించింది. సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు వై.నరసింహారావు స్వాగతం పలికిన వారిలో ఉన్నారు.

పర్యటనను అడ్డుకోవడం సరికాదు

- సిపిఎం రాష్ట్ర కమిటీ

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

పోలవరం ప్రాజెక్టు పర్యటనకు వెళుతున్న టిడిపి ప్రతినిధి వర్గాన్ని అడ్డుకోవడం సరికాదని సిపిఎం రాష్ట్ర కమిటీ అభ్యంతరం తెలిపింది. ప్రభుత్వ వైఖరిని ఖండిస్తున్నట్లు ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి వి శ్రీనివాసరావు శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. ప్రభుత్వం ఏదో తప్పు చేస్తేనే దాస్తున్నదన్న భావం ఏర్పడుతోందని పేర్కొన్నారు. అడ్డుకోవడం వల్ల ప్రజల్లో అనుమానాలు పెరుగుతాయని తెలిపారు. ప్రాజెక్టు నిర్మాణంలో లోపాలకు కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలే బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. ప్రాజెక్టు నాణ్యతపై వస్తున్న వార్తలపై ప్రభుత్వం వివరణ ఇవ్వాలని కోరారు. ప్రతిపక్ష పార్టీలను ప్రభుత్వమే పోలవరం పర్యటనకు తీసుకెళ్లి నిపుణులతో వివరించాలని, ప్రజల్లో ఉన్న అనుమానాలను నివృత్తి చేయాలని డిమాండ్ చేశారు. ప్రాజెక్టు నాణ్యతపై ఇంజనీరింగ్ నిపుణులతో కమిటీ వేసి పరిశీలన చేయించాలని కోరారు.

నిషేధిత ప్రాంతమా ? : సిపిఐ

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

పోలవరం ఏమైనా నిషేధిత ప్రాంతమా ? ప్రతిపక్ష పార్టీల నాయకులు ఆ ప్రాంతంలో పర్యటించకూడదా అని సిపిఐ రాష్ట్రకార్యదర్శి కె రామకృష్ణ ప్రశ్నించారు. ఈ మేరకు శనివారం ప్రకటన విడుదల చేశారు. టిడిపి నేతల అక్రమ అరెస్టులను తీవ్రంగా ఖండించారు. పోలవరం విషయంలో జగన్ ప్రభుత్వం ఏ తప్పు చేయకపోతే ప్రతిపక్ష పార్టీల వారిని ఎందుకు అనుమతించడం లేదని ప్రశ్నించారు. గతంలో తనను కూడా నిర్బంధించి అరెస్టు చేశారని గుర్తుచేశారు. శనివారం టిడిపి నేతలను కూడా అక్రమంగా అరెస్టు చేశారని తెలిపారు. నిరంకుశ విధానాలను ప్రభుత్వం అవలంభిస్తోందని విమర్శించారు. అభివృద్ధిని అటకెక్కించిందని, ప్రతిపక్ష పార్టీల సూచనలను పరిగణలోకి తీసుకోవడం లేదని పేర్కొన్నారు. ప్రతిపక్షాలు స్వేచ్ఛగా పర్యటించే హక్కును కూడా కాలరాస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు.



బహిరంగ సభలో మాట్లాడుతున్న తిరుమావలవన్

బిజెపికి వ్యతిరేకంగా కలిసి రావాలి

- 'స్వయంపాలన సంకల్ప దీక్ష'లో విసికె పార్టీ జాతీయ అధ్యక్షులు తిరుమావలవన్
- దళితుల హక్కుల రక్షణకు పోరాటం : వి శ్రీనివాసరావు

ప్రజాశక్తి- అమలాపురం (డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా)

మతోన్మాదానికి బిజెపికి వ్యతిరేకంగా అన్ని పార్టీలూ కలిసి రావాలని విసికె పార్టీ జాతీయ అధ్యక్షులు, ఎంపి తిరుమావలవన్ పిలుపునిచ్చారు. 'స్వయంపాలన సంకల్ప దీక్ష' పేరుతో డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా అమలాపురంలోని సత్తెమ్మతల్లి లేఅవుట్‌లో శనివారం బహిరంగ సభ జరిగింది. ఈ సభకు అధ్యక్షత వహించిన ఆయన మాట్లాడుతూ దళితులపై దాడులను ప్రతి ఒక్కరూ ఖండించాలని కోరారు. దళితులు, బడుగు, బలహీన వర్గాలు రాజ్యాధికారం సాధించడమే లక్ష్యంగా పనిచేయాలన్నారు. పార్లమెంట్ భవనం ప్రారంభోత్సవాన్ని ఆర్‌ఎస్‌ఎస్ గురువైన సావర్కర్ పుట్టిన రోజున జరిపారని విమర్శించారు. మహిళ కావడంతో రాష్ట్రపతికి కనీసం ఆహ్వానం కూడా ఇవ్వకపోవడం దారుణమన్నారు. మనువాదం, హిందూ మతోన్మాదం పెరుగుతున్న కొద్దీ భారత రాజ్యాంగ విలువలు తగ్గుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఆ విలువలను కాపాడుకోవాలంటే అంబేద్కర్ ఆలోచనా విధానంతో సాగాలని, దీనికోసం కలిసొచ్చే అందర్నీ కలుపుకుంటామని తెలిపారు. ముఖ్యఅతిథిగా హాజరైన సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు మాట్లాడుతూ కేంద్రంలో బిజెపి అధికారంలోకొచ్చాక దేశంలో దళితులపై దాడులు విపరీతంగా పెరిగాయన్నారు. దళితుల హక్కుల పరిరక్షణకు పోరాడుతామని తెలిపారు. కోనసీమ జిల్లా పేరును డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లాగా నామకరణం చేయాలని వచ్చిన ప్రతిపాదనను ఏకపక్షంగా మద్దతు తెలిపిన పార్టీ సిపిఎం అని గుర్తు చేశారు. తమిళనాడులో విసికె పార్టీ, సిపిఎం, సిపిఐ కలిసి పనిచేయడం హర్షణీయమన్నారు. వైసిపి ప్రభుత్వం దళితుల స్థలాల్లోని ఇసుక, మట్టిని అక్రమంగా తవ్వి తరలించేస్తోందని, అధికారులు చూసీచూడనట్టు వ్యవహరిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ బహిరంగ సభలో ప్రజా కవి గద్దర్, గోరేటి వెంకన్న ఆటపాటలు సభికులను ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో విసికె పార్టీ రాష్ట్ర అధ్యక్షులు విద్యాసాగర్, విశ్రాంత రైల్వే ఉద్యోగి భారత భూషణ్, ఆంధ్రజ్యోతి ఎడిటర్ కె.శ్రీనివాస్, విసికె పార్టీ తెలంగాణ ఇన్‌ఛార్జి జీలుకర శ్రీనివాస్, విశ్రాంత హైకోర్టు న్యాయవాది నక్కా బాలయోగి, బొంతు రమణ తదితరులు పాల్గొన్నారు.

కలుషిత ఆహారం తిని 42 మందికి అస్వస్థత

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)

కడప జిల్లా రాజుపాలెం మండలం అరకటవేముల గ్రామంలోని ఎస్‌సి కాలనీకి చెందిన 42 మంది కలుషిత ఆహారం తిని శుక్రవారం రాత్రి అస్వస్థతకు గురయ్యారు. వీరంతా వాంతులు, విరేచనాలతో బాధపడుతూ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. ఎస్‌సి కాలనీకి చెందిన కొంగలి షడ్రక్ కుమార్తెకు శుభకార్యం నిర్వహించారు. ఇందులో భాగంగా ఆయన బంధువులు ప్రొద్దుటూరు పట్టణంలోని కిరాణా దుకాణంలో కొనుగోలు చేసిన అలసందలను తమ ఇంటిదగ్గరే ఉడకబెట్టుకొని అరకటవేములలోని వేడుకలో భాగంగా పాల్గొన్న వారికి పంచిపెట్టారు. ఉడకేసిన అలసందలను తిన్న కొంతమంది మరుసటి రోజు శనివారం తెల్లవారుజామున 5 గంటల ప్రాంతంలో కడుపునొప్పి, వాంతులు, విరేచనాలతో బాధపడుతూ ప్రొద్దుటూరు ప్రభుత్వాస్పతిలో చేరారు. వీరితోపాటు వేడుకలో పాల్గొన్న మరికొంత మంది వాంతులు, విరేచనాలతో బాధపడుతుండడంతో విషయం తెలుసుకున్న అదే గ్రామానికి చెందిన ఆశా కార్యకర్తలు ఉమామహేశ్వరి, బయమ్మ, ఎఎన్‌ఎం సావిత్రి, ఎంఎల్‌హెచ్‌పి జ్యోత్స్నలు 22 మందిని రాజుపాలెం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అస్వస్థతకు గురైనవారిలో చిన్నపిల్లలూ ఉన్నారు. వైద్య సిబ్బంది అప్రమత్తతతో ప్రాణాపాయం తప్పింది. డిఎంహెచ్ఒ ఖాదర్‌వలి, డిప్యూటీ డిఎంహెచ్ఒ శాంతికళ అరకటవేముల గ్రామానికి చేరుకుని అస్వస్థతకు గురైన వారిని పరామర్శించారు. మెరుగైన వైద్యం అందించాలని వైద్య సిబ్బందికి సూచించారు.

10.27 కిలోల బంగారం స్వాధీనం

ప్రజాశక్తి-నెల్లూరు


నెల్లూరు, హైదరాబాద్ జిల్లాల్లో డిఆర్‌ఐ అధికారులు భారీగా బంగారాన్ని పట్టుకున్నారు. మొత్తం 10.27 కిలోల బంగారాన్ని శనివారం సీజ్ చేశారు. ఆలస్యంగా అందిన సమాచారం మేరకు.. ఈ నెల 7న నెల్లూరు జిల్లాలోని వెంకటాచలం టోల్ ప్లాజా అధికారులు వాహన తనిఖీలు చేపట్టారు. ఈ క్రమంలో ఇద్దరు వ్యక్తులు కారులో 7,798 కిలోల బంగారాన్ని అక్రమంగా తరలిస్తున్నట్లు గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. బంగారాన్ని అక్రమంగా తరలిస్తున్న నిందితులను విచారించగా హైదరాబాదులో మరోచోట బంగారం అక్రమంగా దాచినట్లు తెలుసుకున్నారు. వెంటనే మరో డిఆర్‌ఐ బృందం హైదరాబాద్‌కు చేరుకుని 2,471 గ్రాముల బంగారాన్ని స్వాధీనం చేసుకున్నాయి. కేసు నమోదు చేసిన అధికారులు నిందితులను కోర్టులో హాజరుపర్చి వారిని రిమాండ్‌కు తరలించారు.

మళ్లీ వేడెక్కిన నెల్లూరు రాజకీయాలు

(మొదటి పేజీ తరువాయి)

ఈ సందర్భంగా ఆయన ప్రకటించారు. అక్కడ నుంచి ఆయన నేరుగా టిడిపి నేతలతో కలిసి ఎన్‌టిఆర్ భవన్‌కు వెళ్లారు. అక్కడ సినీనటులు నందమూరి బాలకృష్ణ పుట్టినరోజు వేడుకల్లో పాల్గొన్నారు. అనంతరం టిడిపి ఆత్మకూరు నేతలతో సమావేశమయ్యారు. ఆదివారం ఆయన ఆత్మకూరులో తన అనుచరులతోనూ, టిడిపి నేతలతోనూ భేటీ కానున్నారు. అంతకు ముందు టిడిపి సీనియర్ నేత అమర్‌నాథ్‌రెడ్డి, టిడిపి ప్రధాన కార్యదర్శి బీద రవిచంద్ర నెల్లూరు రూరల్ ఎంఎల్‌ఎ కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి నివాసానికి వెళ్లారు. పార్టీలోకి రావాలని ఆయనను ఆహ్వానించారు. తాను టిడిపిలోకి వస్తానని, లోకేష్ పాదయాత్రను విజయవంతం చేస్తానని శ్రీధర్‌రెడ్డి ఈ సందర్భంగా ప్రకటించారు. వైఎస్‌ఆర్ జిల్లా బద్వేల్‌లో పాదయాత్ర నిర్వహిస్తోన్న నారా లోకేష్‌ను ఉదయగిరి ఎంఎల్‌ఎ మేకపాటి చంద్రశేఖర్‌రెడ్డి శనివారం కలిశారు. తాను టిడిపిలో చేరుతానని చెప్పారు. అందుకు లోకేష్ సానుకూలంగా స్పందించినట్లు తెలిసింది. తన నియోజకవర్గంలో లోకేష్ పాదయాత్రను విజయవంతం చేస్తానని, టిడిపి టికెట్ ఇస్తే పోటీ చేస్తానని, లేదంటే ఎవరికి టికెట్ ఇచ్చినా పనిచేస్తానని ఈ సందర్భగా మీడియాకు చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. తనతోపాటు మరో ఇద్దరు ఎంఎల్‌ఎలు కూడా టిడిపిలో చేరుతున్నామని ఆయన ప్రకటించారు.

మామిడి ధర పతనం



- రూ.10కి కిలో పండ్లు
- నిలిచిపోయిన ఎగుమతులు
- మార్కెట్ సదుపాయం కల్పించని ప్రభుత్వం

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

మామిడి ధర పతనమైంది. కిలో పది రూపాయలకు పడింది. ఇక్కడి ఎగుమతులు కూడా నిల్చిపోయాయి. ప్రభుత్వం మార్కెట్ సదుపాయం కల్పించకపోవడంతో రైతులు దిక్కుతోచని స్థితిలో ఉన్నారు. మామిడి సాగులో ఉమ్మడి విజయనగరం జిల్లా రాష్ట్రంలో తృతీయ స్థానంలో ఉంది. మధురమైన భంగినపల్లి, నోరూరించే సువర్ణరేఖ, చెరుకు రసాలు, పనుకులు వంటి ఎన్నో రకాలకు ప్రసిద్ధి. సుమారు 1.05 లక్షల ఎకరాల్లో మామిడి సాగవుతోంది. సాగుదార్లంతా చిన్న, సన్నకారు రైతులే. కొందరు మామిడి తోటలను లీజుకు తీసుకుని సాగు చేస్తున్నారు. భూసారం, రకాన్ని బట్టి గతంలో ఎకరాకు 2.5 టన్నుల నుంచి 3 టన్నుల వరకు దిగుబడి వచ్చేది. గొప్పులు, దుక్కులు, క్రిమిసంహారక మందులు, కొమ్మకత్తిరింపులు తదితరాలకు ఎకరా ఒక్కంటికీ రూ.25 వేల వరకు పెట్టుబడి అవుతోంది. వాతావరణంలో వస్తున్న మార్పుల వల్ల దశాబ్ద కాలం నుంచి మామిడి దిగుబడులు తగ్గుతున్నాయి. ఈ ఏడాది కూడా 20 శాతం నుంచి 30 శాతం వరకు తగ్గాయని రైతులు చెబుతున్నారు. ప్రభుత్వ మార్కెటింగ్ సదుపాయం కల్పించకపోవడంతో సాగుదారులు పూర్తిగా దళారులపై ఆధారపడాల్సి వస్తోంది. ఇక్కడి నుంచి కోల్‌కత్తా, ముంబయి, భువనేశ్వర్, ఛత్తీస్‌గఢ్, ఢిల్లీ, రూర్కెలా వంటి మహానగరాలకు ఏటా వ్యాపారుల ద్వారా లక్షల టన్నుల మామిడి పళ్లు ఎగుమతి అవుతుంటాయి. ఈ ఏడాది ఢిల్లీ, కోల్‌కత్తా, ముంబయి వంటి మహానగరాల నుంచి ఆర్డర్లు లేకపోవడంతో వ్యాపారులు మామిడి కొనుగోలుకు ముందుకు రావడం లేదు. గతేడాది సువర్ణరేఖ 16 కేజీల బాక్సుకు రూ.వెయ్యి వరకు ధర వచ్చింది. ఈ ఏడాది మేలో రూ.500 నుంచి రూ.600కు మించలేదు. అన్నీపోగా బాక్సుపై రూ.100 కూడా మిగలడం లేదని రైతులు మే మొదటి వారం వరకు వాపోయారు. ప్రస్తుతం ఎగుమతులు నిలిచిపోవడంతో విజయనగరం, ఆ చుట్టుపక్కల పట్టణ ప్రాంతాల్లోనూ, రైతు బజార్లలోనూ కిలో రూ.10 నుంచి రూ.15 చొప్పున విక్రయించుకోవాల్సిన పరిస్థితి వస్తోందని తెలిపారు. మిగిలిన రకాలదీ అదే పరిస్థితి. అన్నీ ఒకేసారి పక్వానికి రావడంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. ప్రస్తుతం ఎగుమతులు నిలిచిపోవడంతో ఏటా ఈ సీజన్‌లో లోడింగ్ చేసే కార్మికులు కూడా ఉపాధి కోల్పోయారు. గత ఏడాది విజయనగరం మామిడి ఢిల్లీలోని ఆదర్శ మార్కెట్‌కు వస్తోందంటూ ప్రధాని మోడీ ప్రశంసించారు. వారికోసం రైళ్లల్లో కిసాన్ వ్యాగన్లు ఏర్పాటు చేసి, రవాణా ఛార్జీల్లో 50 శాతం రాయితీ కల్పిస్తున్నామని ప్రకటించారు. వాస్తవానికి ఆ రాయితీ రైతులకు అందలేదు. ఈ ఏడాది అటువంటి మాట సాయం కూడా కరువైంది. రెండు దశాబ్దాల క్రితం విజయనగరం జిల్లా కేంద్రంలో రైల్వే ట్రాక్‌కు ఆనుకుని నిర్మించిన గోదామును కూడా వినియోగంలోకి తేలేదు.



ప్రభుత్వమే ఆదుకోవాలి

నాకున్న పదెకరాలతోపాటు మరో పది ఎకరాలు మామిడి తోట లీజుకు తీసుకుని జీవనం సాగిస్తున్నాను. ఎగుమతులు నిల్చిపోయాయనే పేరుతో వ్యాపారులు కొనుగోలు చేయడం లేదు. స్థానికంగా విక్రయించుకుందామనుకున్నా గత ఏడాది రూ.60 నుంచి రూ.70 వరకు పలికే సువర్ణరేఖ, బంగినపల్లి ధర ఈ ఏడాది రూ.10కి మించడం లేదు. గత 20 ఏళ్లలో మునుపెన్నడూ ఇటువంటి పరిస్థితి లేదు. ప్రభుత్వమే ఆదుకోవాలి.

- పెంటపల్లి సత్యనారాయణ, మామిడి రైతు, బుడతనాపల్లి, విజయనగరం జిల్లా



ప్రభుత్వం కొనుగోలు చేయాలి

మామిడి పండ్లను ప్రభుత్వమే కొనుగోలు చేయాలి. ఇందుకోసం ప్రత్యేకంగా మార్కెట్ సదుపాయం కల్పించాలి. జిల్లాలో కోల్డ్ స్టోరేజీలు, మ్యాంగో జ్యూస్ ఫ్యాక్టరీలు ఏర్పాటు చేయాలి. లేదంటే జిల్లాలో వరి తరువాత అంతటి ప్రాధాన్యతగల మామిడి సాగు తగ్గిపోయే ప్రమాదం ఉంది.

- బుద్దరాజు రాంబాబు, ఎపి రైతు సంఘం జిల్లా కార్యదర్శి



ప్రభుత్వ మార్కెట్ అంటూ లేదు

జిల్లాలో మామిడి కొనుగోలుకు ప్రభుత్వ మార్కెట్ అంటూ లేదు. నేరుగా వ్యాపారులే కొనుగోలు చేస్తుంటారు. ముందస్తుగా అడ్వాన్సులిచ్చి కోతకు ఆర్డర్ ఇస్తారు. ఇందుకోసం బాక్సులు కూడా వారే సరఫరా చేస్తుంటారు.

- ఎవిఎస్‌వి జమదగ్ని, జిల్లా ఉద్యాన శాఖాధికారి, విజయనగరం

పెనమలూరు ఎమ్మెల్యే పార్థసారథికి గుండెపోటు

ప్రజాశక్తి-ఉయ్యూరు (కృష్ణా జిల్లా)



ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న కె.పి.సారథి

కృష్ణా జిల్లా పెనమలూరు నియోజకవర్గ వైసిపి ఎమ్మెల్యే, మాజీ మంత్రి కొలుసు పార్థసారథి శనివారం తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. కుటుంబ సభ్యులు ఆయనను విజయవాడ కానూరు ఆటోనగర్‌లోని టాప్ స్టార్ ఆస్పత్రికి తరలించారు. ఎమ్మెల్యేను పరీక్షించిన వైద్యులు ఆయనకు గుండెపోటు వచ్చిందని నిర్ధారించారు. యాంజియోగ్రామ్ చేసి స్టంట్ వేశారు. ఆయన ఆరోగ్యం నిలకడగా ఉందని వైద్యులు తెలిపారు. పార్థసారథి గుండెపోటుకు గురైన విషయం తెలిసిన వెంటనే మంత్రి జోగి రమేష్, ఎమ్మెల్యేలు పేర్ని వెంకట్రామయ్య (నాని), కైలే అనీల్‌కుమార్ ఫోన్‌లో పరామర్శించి ఆరోగ్య పరిస్థితి గురించి తెలుసుకున్నారు. వైసిపి నేతలు ఆస్పత్రి వద్దకు చేరుకుని ఎమ్మెల్యేలను పరామర్శించారు.

గిరిజన చట్టాల అమలుకు పోరాటం

- పోలవరం నిర్వాసితులకు పునరావాసం కల్పించాలి
- ఎపి ఆదివాసీ గిరిజన సంఘం రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రామారావు, సురేంద్ర

ప్రజాశక్తి - అరకులోయ రూరల్

గిరిజన చట్టాల అమలుకు విస్తృత పోరాటాలు నిర్వహించనున్నట్లు ఎపి ఆదివాసీ గిరిజన సంఘం రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు లోతా రామారావు, కిల్లో సురేంద్ర తెలిపారు. అల్లూరి సీతారామరాజు జిల్లా అరకులోయలోని ఆదివాసీ గిరిజన భవన్‌లో శనివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. ఈ నెల 8, 9 తేదీల్లో అరకులోయలోని సున్నం రాజయ్య నగర్‌లో జరిగిన సంఘం ఎనిమిదో మహాసభ విజయవంతమైందన్నారు. ఆ మహాసభలో చేసిన తీర్మానాలను వెల్లడించారు. రాష్ట్రంలో ఎర్రవరం, పెదకోట, జీలుగుమిల్లి ప్రాంతాల్లో గిరిజనులకు తీవ్ర నష్టం కలిగిస్తూ చేపడుతున్న హైడ్రో పవర్ ప్రాజెక్టులను తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. గ్రామసభ, ప్రజాభిప్రాయ సేకరణ లేకుండా ఆయాచోట్ల ప్రాజెక్టులకు అనుమతివ్వడం రాజ్యాంగ విరుద్ధమని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం అటవీ పర్యావరణ చట్ట నియమాలను సవరించడాన్ని అందరూ వ్యతిరేకించాలని కోరారు. ప్రభుత్వాల సహకారంతో అదానీ, ఇతర కార్పొరేట్ సంస్థలకు సహజ వనరులను కట్టబెట్టేందుకు ప్రయత్నించడం దారుణమన్నారు. బోయ/వాల్మీకిలను, బెంత ఒరియాలను ఎస్‌టి జాబితాలో చేర్చాలని రాష్ట్ర ప్రభుత్వం చేసిన తీర్మానాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఐటిడిఎలకు వచ్చే నిధుల్లో కోత పెడుతుండడంతో గిరిజన ప్రాంతంలో పాలన అస్తవ్యస్తంగా తయారైందని తెలిపారు. పోలవరం ప్రాజెక్టు నిర్వాసితుల సమస్యలను తక్షణం పరిష్కరించాలని, గిరిజనులకు రక్షణగా ఉన్న 1/70 చట్టాన్ని పటిష్టంగా అమలు చేయాలని, గిరిజన ప్రాంతాల్లో వంద శాతం ఉద్యోగావకాశాలు కల్పించే జిఒ నెంబరు 3కు చట్టబద్ధత కల్పించాలని డిమాండ్ చేశారు. గిరిజన సంస్కృతి, ఆచారాలను కాపాడాలని కోరారు. ఆదివాసీ మాతృభాష విద్యా వలంటీర్లను రెన్యువల్ చేయాలని, నాన్ షెడ్యూల్ గిరిజన గ్రామాలను ఐదో షెడ్యూల్ ఏరియాలో కలపాలని, ప్రభుత్వ రంగ సంస్థల ప్రయివేటీకరణ ఆపాలని డిమాండ్ చేశారు. పాడేరు ఏజెన్సీలో రూ.60 కోట్ల కాఫీ బకాయిలను వెంటనే విడుదల చేయాలని, జీడి రైతుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరారు. ఆంధ్రప్రదేశ్ గిరిజన సంఘం పేరును ఆంధ్రప్రదేశ్ ఆదివాసీ గిరిజన సంఘంగా మారుస్తూ తీర్మానం చేసినట్టు వెల్లడించారు. కార్యక్రమంలో సంఘం అల్లూరి జిల్లా కార్యదర్శి పి.బాలదేవ్, అరకులోయ మండల కార్యదర్శి పి.రామన్న పాల్గొన్నారు.

నిందితులకు ఇస్తానన్న 'సుఫారీ' ఎక్కడిది..?

- అవినాష్ రెడ్డిని 7 గంటల పాటు ప్రశ్నించిన సిబిఐ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

మాజీమంత్రి వైఎస్ వివేకానందరెడ్డిని హత్య చేసిన నిందితులకు ఇస్తానన్న రూ.నాలుగు కోట్ల సుఫారీ ఎక్కడిది..? ఎవరు సేకరించారు..? అని ఈకేసులో నిందితుడుగా ఉన్న వైఎస్ అవినాష్ రెడ్డిని సిబిఐ ప్రశ్నించింది. హంతకులకు రూ.నాలుగు కోట్లు ఇస్తానని వైఎస్ అవినాష్ రెడ్డి హామీ ఇచ్చి కొంత సొమ్ము ఇచ్చినట్లు, ఈ కేసులో అప్రూవర్‌గా మారిన దస్తగిరి ఇచ్చిన వాంగ్మూలం మేరకు సిబిఐ అధికారులు అవినాష్ రెడ్డిని ప్రశ్నించారు. ప్రతి శనివారం సిబిఐ విచారణకు హాజరుకావాలన్న హైకోర్టు ఆదేశాల ప్రకారం, శనివారం ఉదయం పది గంటలకు అవినాష్ రెడ్డి కోఠిలోని సిబిఐ కార్యాలయానికి వచ్చారు. సాయంత్రం ఐదు గంటల వరకు.. ఏడు గంటల పాటు సిబిఐ ఆయన్ను ప్రశ్నించింది. ముఖ్యంగా, హంతకులకు ఇస్తానన్న రూ.నాలుగు కోట్ల నగదుకు సంబంధించి సిబిఐ కూపీలాగింది. వివేకా హత్య జరిగిన రోజు అర్ధరాత్రి నుంచి తెల్లవారుజాము వరకు అవినాష్ రెడ్డి తన మొబైల్ ఫోన్ వాట్సప్ కాల్స్‌పైనా సిబిఐ ఆరా తీసింది. అర్ధరాత్రి సమయం ఎవరితో ఏ విషయంపై మాట్లాడారని అవినాష్ రెడ్డిని సిబిఐ అధికారులు ప్రశ్నించినట్లు తెలిసింది. విచారణ ప్రక్రియ మొత్తాన్ని సిబిఐ వీడియోగ్రఫీ చేసింది.

వైసిపి ఇసుక దాహం రాష్ట్ర ప్రజలకు శాపం

- పాదయాత్రలో నారా లోకేష్

ప్రజాశక్తి-అట్లూరు



ఇసుక డంప్ వద్ద సెల్ఫీ తీసుకుంటూ ఆక్రమాలపై వివరిస్తున్న నారాలోకేష్

వైసిపి ఇసుక దాహంతో రాష్ట్రంలోని ప్రజలకు శాపంగా మారిందని టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి లోకేష్ విమర్శించారు. యువగళం పేరుతో ఆయన చేపట్టిన పాదయాత్ర శనివారం నాటికి 122 రోజుకు చేరుకుంది. కడప జిల్లా బద్వేలు నియోజకవర్గంలోని జంగాలపల్లె విడిది కేంద్రం నుంచి పాదయాత్ర ప్రారంభమై అట్లూరు క్రాస్, రెడ్డిపల్లె, కొండూరు, బాలిరెడ్డిబావి, నదియాబాద్ విడిది కేంద్రం వరకూ కొనసాగింది. పాదయాత్ర సందర్భంగా పలు చోట్ల లోకేష్ మాట్లాడుతూ రాజంపేట ఎమ్మెల్యే మేడా మల్లికార్జునరెడ్డి సిద్దవటం మండలం జంగాలపల్లె వద్ద పెన్నా నదిలోని ఇసుకను తోడేస్తున్నారని ఆరోపించారు. ఇసుక డంపింగ్ యార్డు పెన్నా నది పక్కనే ఉన్నా స్థానికులకు మాత్రం ఇసుక అందుబాటులో ఉండడంలేదని వాపోయారు. బెంగళూరు, హైదరాబాద్ నగరాలకు ఇక్కడ నుంచి ఇసుక తరలించి కోట్లాది రూపాయలు దోచుకుంటున్నా ఎస్ఇబి అధికారులకు కనపడడం లేదా అని ప్రశ్నించారు. జగన్మోహన్ రెడ్డి దోచుకోవడం, దాచుకోవడం తప్ప ప్రజల కష్టాలు పట్టడంలేదని విమర్శించారు. కొత్తగా ప్రాజెక్టులు కట్టడం చేతగాని జగన్ ప్రభుత్వం నిర్వాసితులకు పరిహారం ఇవ్వకుండా ఇబ్బంది పెట్టడం దారుణమన్నారు. చింటువారిపల్లి సోమశిల ప్రాజెక్టు భూ నిర్వాసితులకు తక్షణమే పరిహారం అందజేయాలని ప్రభుత్వానికి లేఖరాస్తామన్నారు. ప్రభుత్వం స్పందించకపోతే రాబోయే టిడిపి ప్రభుత్వం నిర్వాసితులకు న్యాయం చేస్తుందని హామీ ఇచ్చారు.

చీనీ రైతుల గిట్టుబాటు ధర కోసం టిడిపి ప్రభుత్వ హయాంలో ప్రత్యేక రైళ్లు ఏర్పాటు చేశామని తెలిపారు. ఈ ప్రాంత రైతుల కష్టాలు చూశాకే సీమను హార్టికల్చర్ హబ్‌గా తీర్చిదిద్దాలని మిషన్ రాయలసీమలో ప్రకటించామని పేర్కొన్నారు. గత ప్రభుత్వంలో హార్టికల్చర్‌కు అందజేసిన రాయితీలన్నీ తాము అధికారంలోకి రాగానే తిరిగి ప్రవేశపెడతామని తెలిపారు. కొండూరు, అట్లూరు గ్రామాల ప్రజలకు చెక్ పోస్టు సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.

బద్వేలు నియోజకవర్గం అట్లూరులో ఉదయగిరి ఎమ్మెల్యే మేకపాటి చంద్రశేఖరరెడ్డి లోకేష్‌ను కలిసి సంఘీభావం తెలిపారు. అనంతరం పాదయాత్రలో పాల్గొన్నారు. త్వరలోనే టిడిపిలో చేరుతానని, తనతోపాటు శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా నుంచి మరో ఇద్దరు ఎమ్మెల్యేలు చేరుతారని తెలిపారు. బద్వేలు మాజీ ఎమ్మెల్యే విజయమ్మ, రితీష్ రెడ్డి, ఆనం రామనారాయణ రెడ్డి కుమార్తె కైవల్యా రెడ్డి పాల్గొన్నారు.

కాంట్రాక్టు అధ్యాపకులను రెగ్యులర్ చేయాలి

ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు


ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ప్రభుత్వ డిగ్రీ, జూనియర్, పాలిటెక్నిక్ కళాశాలల్లో పనిచేస్తున్న కాంట్రాక్టు అధ్యాపకులను వీలైనంత ఎక్కువ మందిని రెగ్యులర్ చేయాలని పిడిఎఫ్ ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు రాష్ట్రప్రభుత్వాన్ని కోరారు. ప్రభుత్వ కళాశాలల కాంట్రాక్టు లెక్చరర్ల జెఎసి ఆధ్వర్యంలో 'జగనన్నకు చెబుదాం-కాంట్రాక్టు లెక్చరర్ల గోడు' పేరిట విజయవాడలోని ఎంబి విజ్ఞాన కేంద్రంలో శనివారం జరిగిన సదస్సులో ఆయన మాట్లాడారు. రెగ్యులర్ కావాలంటే 2014 జూన్ నాటికి ఐదేళ్ల సర్వీస్ పూర్తిచేసి ఉండాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించిందని, దీనివల్ల డిగ్రీ, జూనియర్, పాలిటెక్నిక్ కళాశాలల్లో పనిచేస్తున్న సుమారు 4 వేల మంది అధ్యాపకులు నష్టపోతున్నారని తెలిపారు. ప్రభుత్వ కళాశాలల్లో పనిచేస్తున్న కాంట్రాక్టు అధ్యాపకులకు సుమారు 12 ఏళ్ల సర్వీస్ ఉందన్నారు. ఐదేళ్ల నిబంధన ఎత్తివేసేందుకు పిడిఎఫ్ ఎమ్మెల్సీలుగా తమ వంతు ప్రయత్నం చేస్తామని, సిఎం దృష్టికి తీసుకెళ్తామన్నారు. 2014 జూన్ 2 నాటికి వివిధ శాఖల్లో పనిచేస్తున్న వారందరినీ రెగ్యులర్ చేయాలని కోరారు. కాంట్రాక్టు లెక్చరర్ల అసోసియేషన్ జాతీయ అధ్యక్షులు కొప్పిశెట్టి సురేష్ మాట్లాడుతూ కాంట్రాక్టు వారిని రెగ్యులర్ చేయడం వల్ల రాష్ట్రప్రభుత్వంపై ఆర్థికం భారం ఉండదన్నారు. రెగ్యులర్ చేసేందుకు అడ్డంగా ఉన్న 2/94 చట్టాన్ని సవరించాలని డిమాండ్ చేశారు. రెగ్యులరైజేషన్ కోసం నిర్వహించే కార్యక్రమాలకు తమ మద్దతు ఉంటుందని ఉన్నత విద్య పరిరక్షణ వేదిక అధ్యక్షులు రాజగోపాల్ చెప్పారు. రెగ్యులర్ డిమాండ్‌పై ఎమ్మెల్యేలు, మంత్రులు, ఇతర ప్రజాప్రతినిధులను, అధికారులను కలిసి వారం పాటు వినతిపత్రాలు ఇవ్వాలని సదస్సు తీర్మానించింది. ఈ సదస్సులో అసోసియేషన్ నాయకులు రత్నకుమారి, స్వాతి, శ్రీనివాస్ యాదవ్, కె సురేష్, కల్లూరి శ్రీనివాసరావు, సాయిరామ్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం కె సురేష్ చైర్మన్‌గా, కో చైర్మన్లుగా సాయిరామ్, కె శ్రీనివాసరావులతో కలిసి జెఎసిగా ఏర్పాటైంది.

ఘనంగా గీతం స్నాతకోత్సవం

- తేజ ఫైటర్ ఎయిర్ క్రాఫ్ట్ సృష్టికర్త హరినారాయణకు గౌరవ డాక్టరేట్

ప్రజాశక్తి - మధురవాడ (విశాఖపట్నం)



కోటా హరినారాయణకు గౌరవ డాక్టరేట్ అందజేస్తున్న శ్రీభరత్

గీతం విశాఖపట్నం డీమ్డ్ విశ్వవిద్యాలయం 14వ స్నాతకోత్సవం శనివారం వర్సిటీలో ఘనంగా జరిగింది. వర్సిటీ ఛాన్సలర్ డాక్టర్ వీరేంద్ర సింగ్ చౌహన్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో తేజ ఫైటర్ ఎయిర్ క్రాఫ్ట్ సృష్టికర్త, పద్మశ్రీ అవార్డు గ్రహీత డాక్టర్ కోటా హరినారాయణకు విశ్వవిద్యాలయం గౌరవ డాక్టరేట్ (డాక్టర్ ఆఫ్ సైన్స్)ను, ప్రముఖ తెలుగు చలనచిత్ర నటి వాణిశ్రీకి గౌరవ డాక్టరేట్ డిలిట్‌ను అందజేశారు. స్నాతకోత్సవానికి భారత ప్రభుత్వ శాస్త్ర సాంకేతిక విభాగం (డిఎస్‌టి) కార్యదర్శి డాక్టర్ ఎస్.చంద్రశేఖర్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ.. శాస్త్ర విజ్ఞాన రంగంలో భారత దేశం గణనీయ ప్రగతి సాధిస్తోందని తెలిపారు. వాతావరణ మార్పుల ప్రభావం, సంప్రదాయేతర ఇంధన వనరుల అవసరాలు, డిజిటల్ ప్రపంచంలో పెరుగుతున్న పోటీపై దేశ యువత బాధ్యతగా మెలగాలని సూచించారు. సరికొత్త ఆలోచనలతో ఔత్సాహిక పారిశ్రామికవేత్తలుగా మారడానికి ముందుకు రావాలని పిలుపునిచ్చారు. దేశంలో వ్యవసాయ రంగం కుంటుపడి ఆహార భద్రతకు ముప్పు రాకుండా చూసుకోవాలని తెలిపారు. ఈ సందర్భంగా 2022-23 విద్యా సంవత్సరంలో ఇంజనీరింగ్, ఫార్మసీ, ఆర్కిటెక్చర్, లా, ఇంటర్నేషనల్ బిజినెస్, ఎంబిఎ, బిబిఎమ్, బికామ్ వంటి కోర్సులు పూర్తి చేసిన 2769 మంది పట్టభద్రులకు డిగ్రీలు, 84 మంది పరిశోధక విద్యార్థులకు డాక్టరేట్లు, అత్యుత్తమ ప్రతిభను కనబరిచినందుకు 72 మంది విద్యార్థులకు బంగారు పతకాలను అందజేశారు. కార్యక్రమంలో గీతం యూనివర్సిటీ అధ్యక్షులు ఎం.శ్రీభరత్, ఉపాధ్యక్షులు ఎమ్.గంగాధరరావు, కార్యదర్శి ఎమ్.భరద్వాజ, రిజిస్ట్రార్ డాక్టర్ డి.గుణశేఖరన్ పాల్గొన్నారు. స్నాతకోత్సవ వేదికపై నటి వాణిశ్రీ చేసిన చేసిన ప్రసంగం విశేషంగా ఆకట్టుకుంది. తమ కుటుంబ ఆర్థిక పరిస్థితుల వల్ల పెద్ద చదువులు చదవలేకపోయినట్టు ఆమె తెలిపారు.

తిరుమలలో 22న వాచీల వేలం

ప్రజాశక్తి- తిరుమల

తిరుమల శ్రీవారి ఆలయంతో పాటు ఇతర అనుబంధ ఆలయాలలో హుండీ ద్వారా భక్తులు కానుకగా సమర్పించిన వాచీలను ఈ నెల 22న టెండర్ కమ్ వేలం వేయనున్నారు. ఇందులో టైటాన్, క్యాషియో, టైమెక్స్, ఆల్విన్, సొనాట, టైమ్‌వెల్, ఫాస్ట్‌ట్రాక్ కంపెనీల వాచీలున్నాయి. కొత్తవి, ఉపయోగించిన, పాక్షికంగా దెబ్బతిన్న వాచీలు మొత్తం 10 లాట్లు ఈ-వేలంలో ఉంచారు. ఇతర వివరాలు తిరుపతిలోని టిటిడి మార్కెటింగ్ కార్యాలయాన్ని 0877-2264429 నంబరులో కార్యాలయం వేళల్లో కానీ, టిటిడి వెబ్‌సైట్ www.tirumala.org ద్వారా వివరాలు తెలుసుకోవచ్చని పేర్కొంది.

చంద్రబాబును ప్రజలు నమ్మరు

- మంత్రి జోగి రమేష్

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

టిడిపి అధ్యక్షులు చంద్రబాబునాయుడు మోసపూరిత హామీలను నమ్మే పరిస్థితిలో ప్రజలెవరూ సిద్ధంగా లేరని రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ మంత్రి జోగి రమేష్ పేర్కొన్నారు. తాడేపల్లి వైసిపి కార్యాలయంలో శనివారం ఆయన మీడియాతో మాట్లాడారు. ఎన్నికల మేనిఫెస్టోను చెత్తబుట్టలో వేసి ప్రజలను మోసం చేశారని, 2014లో 650 హామీలిచ్చి ఒక్కటి కూడా నెరవేర్చలేదన్నారు. నమ్మించి వంచించిన ఫలితంగానే ప్రజలు చిత్తుగా ఓడించారని, జగన్ ప్రభుత్వంలో మంత్రులుగా ఉన్నందుకు గర్వపడుతున్నామన్నారు.



కర్నూలులోని పాతబస్తీ సెంటర్‌లో ధర్నా చేస్తున్న సిపిఎం నేతలు

విద్యుత్ ఛార్జీల పెంపును నిరసిస్తూ ధర్నా

ప్రజాశక్తి - కర్నూలు కార్పొరేషన్

పెంచిన విద్యుత్ ఛార్జీలను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేస్తూ కర్నూలు పాతబస్తీలో సిపిఎం ఆధ్వర్యాన శనివారం ధర్నా నిర్వహించారు. ధర్నానుద్దేశించి సిపిఎం నగర కార్యదర్శి ఎం.రాజశేఖర్ మాట్లాడుతూ విద్యుత్ ఛార్జీల పేరుతో వైసిపి ప్రభుత్వం ప్రజలను నిలువు దోపిడీ చేస్తోందని ధ్వజమెత్తారు. ఇప్పటికే ఇంటి పన్ను, కుళాయి పన్ను, చెత్త పన్ను వసూలు చేస్తోన్న ప్రభుత్వం విద్యుత్ ఛార్జీలు పెంచి సామాన్య ప్రజలపై మరింత భారం మోపిందన్నారు. యూనిట్‌కు 40 పైసలు చొప్పున కరెంట్ చార్జీలు పెంచడం హేయమైన చర్య అని పేర్కొన్నారు. దీనికితోడు నిత్యావసర వస్తువుల ధరలను విపరీతంగా పెంచి పేదల నడ్డి విరుస్తోందని తెలిపారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం తీసుకునే నిర్ణయాలకు రాష్ట్రంలో వైసిపి ప్రభుత్వం వత్తాసు పలకడం సరికాదన్నారు. వైసిపి సర్కారుకు ప్రజలపై ఏమాత్రం చిత్తశుద్ధి ఉన్నా సర్దుబాటు పేరుతో పెంచిన విద్యుత్ ఛార్జీలను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ధర్నాలో సిపిఎం నగర కార్యదర్శివర్గ సభ్యులు డి.అబ్దుల్ దేశాయ్ తదితరులు పాల్గొన్నారు.

సంపాదకీయం


కుజ దోషం!

'అజ్ఞానపుటంధయుగంలో/ అంతా తమ ప్రయోజకత్వం/ తామే భువి కధినాధులమని/ స్థాపించిన సామ్రాజ్యాలూ/ నిర్మించిన కృత్రిమ చట్టాల్/ ఇతరేతర శక్తులు లేస్తే/ పడిపోయెను పేకమేడలై' అంటాడు మహాకవి శ్రీశ్రీ. ఈ ఆధునిక యుగంలోనూ పరిస్థితుల్లో పెద్ద మార్పు కనిపించడం లేదు. వైజ్ఞానిక రంగం అందించిన సమస్త సాధనాల్నీ వాడుకుంటున్నాం. శాస్త్ర, సాంకేతిక రంగాల్లోని నూతన ఆవిష్కరణల ఫలాలనూ అనుభవిస్తున్నాం. వాటిని మన జీవన శైలిలో అంతర్భాగం చేసుకుంటున్నాం. కానీ ఆలోచనల్లో మాత్రం శతాబ్దాల వెనుకనే వుండిపోతున్నాం. ప్రపంచంలో మారనిదంటూ ఏదీ లేదు. మార్పు సహజం. 'శరత్‌కాలపు ఆకాశం నీలం, జ్యేష్ఠమాసపు వానల తర్వాత గాలిలో నిర్మలత్వం ఏదో అర్థం కాని నూతనత్వం' అంటాడు చలం. ఈ మార్పు కంటికి కనిపించకున్నా మనసుని స్పృశిస్తుంది... మైమరిపింపజేస్తుంది... గొప్ప అనుభూతిని పంచుతుంది. ఒకవైపు విజ్ఞాన ఫలితాలను అనుభవిస్తూనే... మరోవైపు భౌతికవాద దృష్టి లోపించడం, కార్యాకారణ సంబంధమనే సూత్రాన్ని, మార్పును ఒప్పుకోలేని మతోన్మాద పోకడ ఒక పథకం ప్రకారం దేశంలో అమలు జరుగుతోంది.

'శవత్వం పాశవత్వం పెరిగి/ నవత్వం తరిగి/ దానవత్వం సర్వత్రా/ దంష్ట్రలు కొరుకుతున్న నేడు' అంటాడు శ్రీశ్రీ ఖడ్గసృష్టిలో. ఆర్‌ఎస్‌ఎస్ అనుబంధ సంస్థ 'సంవర్ధిని న్యాస్'... ఢిల్లీలోని జెఎన్‌యులో 'గర్భ సంస్కార్' పేరిట ఒక వర్క్‌షాప్ నిర్వహించింది. ఈ వర్క్‌షాప్‌లో కొందరు గైనకాలజిస్టులు, ఆయుర్వేద వైద్యులు కూడా పాల్గొన్నారు. దేశభక్తి, స్త్రీల పట్ల గౌరవం పెంపొందాలంటే మహిళలు గర్భధారణ సమయంలో భగవద్గీత, రామాయణ శ్లోకాలు పఠించాలని, దీనివల్ల తల్లి గర్భంలోని శిశువుకు భారతీయ సాంస్కృతిక విలువలు అలవడతాయని ఉద్బోధించారు. అలాగే ఇటీవల అనంతపురం శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయంలో కొందరు ఉద్యోగులు చనిపోయారని మృత్యుంజయ యాగం చేసేందుకు వైస్ ఛాన్సలర్, రిజిస్ట్రార్ సమాయత్తమయ్యారు. గతంలో ఆచార్య దోణప్ప వైస్ ఛాన్సలర్‌గా వున్న కాలంలో జ్యోతిష్యాన్ని డిగ్రీ, డిప్లమో కోర్సులుగా ప్రవేశపెట్టడంపై పెద్ద వివాదమే జరిగింది. ఆ తర్వాత సి.నారాయణరెడ్డి హయాంలో జ్యోతిష్యం నిరూపితమైన శాస్త్రం కాదని తొలగించారు. తాజాగా... అత్యాచారానికి గురైన ఓ మహిళ జాతకంలో కుజదోషం వుందో లేదో తేల్చాలని ఇటీవల లక్నో విశ్వవిద్యాలయంలోని జ్యోతిష్య విభాగం అధిపతిని అలహాబాద్ హైకోర్టు ఆదేశించింది. అయితే, ఈ ఆదేశంపై అత్యున్నత ధర్మాసనం స్టే ఇచ్చినప్పటికీ... ఒక రేపిస్టు బెయిల్ దరఖాస్తును విచారించే సమయంలో జ్యోతిష్యుడి నివేదికను హైకోర్టు కోరడమే విడ్డూరంగా వుంది. ఒక రేపిస్టును తప్పించడానికి జ్యోతిష్య శాస్త్రాన్ని అడ్డుపెట్టుకోవడం న్యాయసమ్మతం కాదు.

ఒకానొక సందర్భంలో సుప్రీంకోర్టు కూడా దీర్ఘకాలంగా రాజుకుంటున్న వివాదంలో నమ్మకాల ఆధారంగానే తీర్పునిచ్చింది. శాస్త్రం మానవ జాతికొక అస్త్రం. కానీ, జ్యోతిష్యం నమ్మకం తప్ప శాస్త్రం కాదు. దాని ఆధారంగా కోర్టు ఈ రకమైన తీర్పునివ్వడం ధర్మం కాదు. ఈ వ్యవహారం ఆసాంతం నేరస్తుడ్ని తప్పించడానికి జరుగుతున్న కుట్ర తప్ప మరొకటి కాదు. న్యాయవ్యవస్థ, సమాజం ఒక రేపిస్టుని క్షమించదు. కానీ, అతడ్ని తప్పించడం కోసం... సమాజంలోని నమ్మకాల మాటున శాస్త్రం గాని శాస్త్రాన్ని అడ్డం పెట్టుకుంటున్నారు. ఒక మహిళ గోప్యతా రక్షణతో పాటు ఆమె వ్యక్తిత్వంపై కూడా దోషాన్ని అంటగట్టే ప్రయత్నం న్యాయస్థానంలోనే జరగడం దారుణం. మతోన్మాద భావాలను సమాజంలో విచ్చలవిడిగా చెలామణీ చేసేందుకు సాక్షాత్తూ ప్రభుత్వమే పూనుకుంటోంది. 'మానవుడి జ్ఞానం తన అభివృద్ధి క్రమంలో సరళరేఖలా పయనించదు. అది నిరంతరం ఒక వక్రరేఖను అనుసరిస్తుంటుంది' అంటాడు లెనిన్ ఓ సందర్భంలో. అంతేకాదు... 'మనం చైతన్యవంతంగా వుండకపోతే, ఊబిలో కూరుకుపోయే ప్రమాదం వుంద'ని హెచ్చరిస్తాడు. మూఢత్వపు చీకట్ల నుంచి విజ్ఞానకాంతుల వైపు పయనించే పథగాములకు ఈ హెచ్చరిక మార్గదర్శకం.

మహనీయుల మాట



అఖండ ప్రజ్ఞత్వం అంటే...
ఒక్క శాతం ప్రోత్సాహం,
99 శాతం చెమటోడ్చి సాధించడం.
- థామస్ అల్వా ఎడిసన్,
ప్రసిద్ధ అమెరికన్ శాస్త్రవేత్త.

Thomas A Edison

అడుగు జారుతున్న మోడీ అగచాట్లు !

ప్రస్తుతం



తెలకపల్లి రవి

మే 28వ తేదీన అంగరంగవైభోగంగా ప్రధాని నరేంద్రమోడీ పార్లమెంటు నూతన భవనాన్ని ప్రారంభించారు. అయితే ఆ వెనువెంటనే బిజెపి పాలిత రాష్ట్రాల ముఖ్యమంత్రులందరినీ పిలిపించి ఉపన్యాసం ఇచ్చిపంపారు. కాకుంటే లోక్‌సభ ఎన్నికలు రానుండగా జరిగిన ఈ సమావేశంలో ఆయన యుద్ధానికి దూసుకుపోదామని పిలుపిస్తారనుకుంటే ఆ ఉపన్యాస పాఠం మారింది. మీ రాష్ట్రాలలోని ప్రాంతీయ పార్టీలతో మంచి సంబంధాలు పాటించేలా జాగ్రత్తపడాలని ఉపదేశించారు. వారు ప్రాంతీయ సమస్యల విషయంలో వారి భావాలకు బిజెపి కూడా అండగా వుంటుందనే సంకేతం వెళ్లాలన్నారు. వాస్తవానికి పార్లమెంటు భవన ప్రారంభ సభలో మోడీ స్వయంగా తానే మాజీ ప్రధాని జెడిఎస్ అధినేత దేవెగౌడను అత్యంత ఆప్యాయంగా పలకరించారు. అత్యధిక ప్రతిపక్షాలు బహిష్కరించిన ఈ కార్యక్రమానికి దేవెగౌడతో పాటు ఎ.పి ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి, టిడిపి ఎంపీలు కూడా హాజరైన సంగతి తెలిసిందే. ఇదంతా ఊరికే పోలేదని గమనించాలి. కర్ణాటకకు తిరిగివెళ్లిన దేవెగౌడ బిజెపి ఏమీ అంటరాని పార్టీ కాదని ప్రకటించారు. వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో దానితో పొత్తు పెట్టుకోవడం గురించి ఆలోచించవచ్చునన్నారు. ఇక ఎ.పి కి ఎంతో కాలంగా శూన్యహస్తం చూపిస్తున్న కేంద్రం హఠాత్తుగా రెవెన్యూ లోటు కింద రూ.10 వేల కోట్లు విడుదల చేసింది. ఇంతకాలం నిరాకరించిన అన్యాయాన్ని ప్రశ్నించే బదులు ఇది వైసిపి లొంగిపోయిన ఫలితమేనని టిడిపి విమర్శించింది. మోడీ, అమిత్ షాలను జగన్ పలుసార్లు కలుసుకోవడాన్ని తప్పు పట్టింది. కాని మరో రెండు రోజుల తర్వాత చంద్రబాబు నాయుడు స్వయంగా తానే వెళ్లి కలసి వచ్చారు. ఇది వచ్చే ఎన్నికల్లో పొత్తు కోసమని కథనాలు వస్తే ఇరు పక్షాలూ మౌనం పాటిస్తున్నాయి. పోలవరం ప్రాజెక్టు ఎత్తు 45 మీటర్లు కాగా 41.5కు తగ్గించి తొలిదశ పేరిట పూర్తిచేస్తామన్నట్టు కేంద్రం ప్రకటిస్తే దానిపై పరస్పరం కీచులాడుకుంటున్నాయి. ఇందుకోసం రూ.17 వేల కోట్లు మంజూరు చేస్తానని కేంద్రం తెలియజేసినట్టు రాష్ట్రం ప్రకటించింది. ప్రజలు ఘోషిస్తున్నట్టు పునరావాసానికి సంబంధించిన ప్రకటనేదీ వెలువర్చలేదు. ఇది కేంద్రానికి లొంగుబాటు అని టిడిపి అంటుంటే తమ ఘనత అని ప్రభుత్వం ప్రచారం చేసుకుంటున్నది. అంతేగాని నిధుల కోత, పునరావాసానికి ఎగనామం గురించి పట్టించుకోవడం లేదు. ఇదే సమయంలో తెలంగాణకు సంబంధించి లిక్కర్ కుంభకోణంలో బిఆర్‌ఎస్‌తో ఏదో రాజీకి రావడానికి ప్రయత్నాలు జరుగుతున్నట్టు కథనాలు వెలువడుతున్నాయి.



గత వారం రోజుల్లో ముఖ్యమంత్రి కెసిఆర్ ప్రసంగాల్లో బిజెపి పై విమర్శ బదులు కాంగ్రెస్‌పై దాడి పెరిగిందని పరిశీలకులు అంటున్నారు.

అడుగు వెనక్కు

తెలుగు రాష్ట్రాలకు సంబంధించిన ఈ ప్రత్యేక కోణాన్ని అలా వుంచితే దేశవ్యాపితంగా బిజెపి నూతన వ్యూహాన్ని తీసుకుందని చెప్పే ఉదాహరణలు ఇంకా వున్నాయి. మూడో సారి కూడా తన్నుకుంటూ వచ్చేస్తామని పైకి చెబుతున్నా తాము నమ్ముకున్న బ్రాండ్ మోడీ పలచబడిపోయిందనీ ఓట్లను రాబట్టే శక్తి చాలడం లేదని సంఘ పరివార్ గ్రహించిన కారణంగానే ఈ కొత్త హడావుడి అంటున్నారు. ఆరెస్సెస్ అధికార పత్రికలోనే ఈ విషయం పరోక్షంగా అంగీకరించారు. మోడీ జనాకర్షణ, హిందూత్వ భావజాలం మాత్రమే అధికారం తెచ్చి పెడతాయనుకుంటే పొరబాటని ఆ పత్రిక పేర్కొంది. ఆయన ఒక్కసారి ప్రచారానికి వస్తే ప్రజలు ఓట్లు గుమ్మరిస్తారనే భ్రమలు కర్ణాటక అంతకు ముందు హిమాచల్ ప్రదేశ్ తొలగించాయి. ఫిబ్రవరిలో ఎన్నికల తేదీలు ప్రకటించడానికి ముందునుంచే మోడీ అక్కడ కాలికి బలపం కట్టుకు తిరిగారు. 19 సభలు ఆరు రోడ్ షోలు నిర్వహించారు. ప్రతిజ్ఞలు చేయించారు. ఇది గాక జెపి నడ్డా 16 రోడ్‌షోలు, స్మృతి ఇరానీ 19, రాజ్‌నాథ్ సింగ్ 4, హిమంత బిస్వాస్ శర్మ 16 రోడ్‌షోలు చేశారు. యోగి ఆదిత్యనాథ్ తదితరులు కూడా విస్తారంగా తిరిగారు. అయితే విజయం సంగతి అటుంచి ఆ పార్టీ 31 స్థానాల్లో డిపాజిట్లు కోల్పోయింది. మరి అమిత్ షా అదే పనిగా చెప్పుకున్న సోషల్ మీడియా నెట్‌వర్క్, సోషల్ ఇంజనీరింగ్, పన్నా ప్రముఖ్‌ల ప్రచారం ఏమైంది? అంతకుముందు మీడియా తన వంతు ప్రచారం చేసింది. ఆఖరుకు ఫలితాల తర్వాత కూడా కాంగ్రెస్‌లో ముఖ్యమంత్రి ఎంపికపై సిద్దరామయ్య, శివకుమార్ తగాదా చీలిక వరకూ వెళుతుందన్న వాతావరణం కల్పించింది. ఇవన్నీ ఎన్ని చేసినా వీటన్నిటిని బట్టి బ్రాండ్ మోడీ బలహీనమైందని తేలింది. ఆయన 46 సభల్లో పాల్గొంటే అందులో 15 మాత్రమే గెలవగలిగారు.

> **ఇతర రాష్ట్రాలలో సర్వేలలో కూడా మోడీకి మద్దతు నలబై శాతం మించి వుండటం లేదు. అదే సమయంలో వ్యతిరేకులు, అసంతృప్తితో వున్నవారి శాతం అంతకంటే ఎక్కువగా వుంటున్నది. మహారాష్ట్ర లోనూ అదే అంచనా వచ్చింది. మరోవైపున మైనార్టీలలో అభద్రత, సామాజిక శక్తుల చలనం, ప్రతిపక్షాల ఐక్యత పెరుగుతున్నది. బిజెపి మతతత్వ నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా ఓట్లు చీలకుండా చూడాలనే భావన బలపడుతున్నది. బీహార్ రాజధాని పాట్నాలో జరిగే శిఖరాగ్ర సమావేశం దీనిపై స్పష్టమైన సంకేతాలివ్వవచ్చు. 450 స్థానాల్లో బిజెపికి వ్యతిరేకంగా ఒకే అభ్యర్థి నిలిచేలా చూడాలన్న నినాదం ఇందులో భాగమే, సాధ్యాసాధ్యాలు ఎలా వున్నా ఇది దేశంలో రాజకీయ వాతావరణాన్ని సూచిస్తున్నది.**

పెరిగిన హడావుడి

కళ్ల ముందు కనిపించే ఈ వాస్తవాలను రాజకీయంగా ఒప్పుకోవడం బిజెపి కి మరీ ముఖ్యంగా మోడీ కి తెలియని పని. ప్రచార పటాటోపం కొనసాగించడమే వారి మార్గంగా వుంటుంది. అందుకే ఆయన నమ్మకస్తుల ముఠా లోపాయికారిగానే చర్చ చేసి చెప్పకుండా చేయాలనుకున్నది చేస్తుంది. తొమ్మిదేళ్ల పాలన వార్షికోత్సవాలను ఆర్భాటంగా చేయాలన్న ఆలోచనకు కొత్త ట్విస్టుతో ముందుకు తెచ్చింది. దేశవ్యాపితంగా 500 నియోజక వర్గాల్లో సభలు తలపెట్టింది. ఓటర్లను ప్రభావితం చేయగల అయిదు లక్షల ప్రముఖ కుటుంబాలను కలుసుకోవలసిందిగా రాష్ట్రాల విభాగాలకు ఆదేశాలు వెళ్లాయి. నటీనటులను, సెలబ్రిటీలను కలుసుకోవడం ఇందులో భాగమే. దేశంలోని మొత్తం నియోజక వర్గాలను 144 క్లస్టర్లుగా విభజించి ప్రజలతో సంబంధాలు పెంచుకోవడానికి ఎనిమిది రోజుల పాటు కార్యక్రమాలు నిర్వహిస్తారట. మోడీ హయాంలో హైవేలు ఇతర మౌలిక సదుపాయాలు గొప్పగా పెంచినట్టు చెప్పడానికి వికాస్ తీర్థ జరుపుతారు. గతంలో చాయ్ పే చర్చ లాగే ఇప్పుడు టిఫిన్ పే చర్చ ప్రహసనం సాగిస్తారు, దేశంలో 51 జాతీయ స్థాయి ర్యాలీలు జరుపుతారు. ఎన్నికలు జరిగే అయిదు రాష్ట్రాలలో మోడీ మరోసారి ప్రచారంపై కేంద్రీకరిస్తారు. గతంలో ముఖ్యమంత్రులను మార్చడంలో కాంగ్రెస్‌ను గుర్తుచేసిన మోడీ నాయకత్వం ఆ పని విరమించింది. మరోవైపున రాష్ట్రాలలో మరీ దూకుడుగా వున్న అధ్యక్షులను మార్చే కార్యక్రమం ప్రారంభమైంది. ఉదాహరణకు తెలంగాణలో ఉత్తరాది తరహా పద్ధతులతో ఉద్రిక్తతలకు కారణమైన బండి సంజయ్‌ని మార్చడం గురించిన చర్చ వాస్తవ రూపం దాల్చుతుందంటున్నారు. ఇతర పార్టీల నుంచి వచ్చినా ప్రయోజనం లేదని వాపోతున్న డి.కె అరుణ, ఈటల రాజేందర్ వంటి వారికి పదవులు ఇచ్చి సంతృప్తిపర్చే తతంగం తప్పదంటున్నారు. ఎ.పి లోనూ టిడిపి నుంచి వచ్చిన నేతల ఒత్తిడి మేరకే చంద్రబాబును కలుసుకున్నట్టు చెబుతున్నారు.

సర్వేల సారం

అదానీ వ్యవహారంతో మొదలు పెట్టి అంతర్జాతీయంగానూ మోడీ ప్రభ మసకబారింది. అంతర్జాతీయ మీడియాలో వ్యతిరేక కథనాలను ఖండించడం ఒక పెద్ద కార్యక్రమంగా మారింది. ఇతర రాష్ట్రాలలో సర్వేలలో కూడా మోడీకి మద్దతు నలబై శాతం మించి వుండటం లేదు. అదే సమయంలో వ్యతిరేకులు, అసంతృప్తితో వున్నవారి శాతం అంతకంటే ఎక్కువగా వుంటున్నది. మహారాష్ట్ర లోనూ అదే అంచనా వచ్చింది. మరోవైపున మైనార్టీలలో అభద్రత, సామాజిక శక్తుల చలనం, ప్రతిపక్షాల ఐక్యత పెరుగుతున్నది. బిజెపి మతతత్వ నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా ఓట్లు చీలకుండా చూడాలనే భావన బలపడుతున్నది. బీహార్ రాజధాని పాట్నాలో జరిగే శిఖరాగ్ర సమావేశం దీనిపై స్పష్టమైన సంకేతాలివ్వవచ్చు. 450 స్థానాల్లో బిజెపికి వ్యతిరేకంగా ఒకే అభ్యర్థి నిలిచేలా చూడాలన్న నినాదం ఇందులో భాగమే, సాధ్యాసాధ్యాలు ఎలా వున్నా ఇది దేశంలో రాజకీయ వాతావరణాన్ని సూచిస్తున్నది. బిజెపికి అనుకూలంగా వుండే ఒరిస్సా ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ కూడా పార్లమెంటు ప్రారంభంలో స్వయంగా పాల్గొనకపోవడం యాదృచ్ఛికం కాదు. అదే సమయంలో వైసిపి, టిడిపి, జనసేన మూడు ప్రాంతీయ పార్టీలు తనకు అనుకూలంగానే వున్నాయి గనక ఏం చేయాలనే వ్యూహమథనం సాగిస్తున్నట్టు కనిపిస్తుంది. అందరినీ అందుబాటులో వుంచుకోవాలనేదే అంతిమంగా తమ రాజకీయ అవసరమనేది బిజెపి దాచుకోవడం లేదు. ఎటొచ్చి ఈ పార్టీలే తమ వైరుధ్యాలను తీర్చుకోవడానికి దానికి సాగిలబడుతుండటం రాష్ట్రానికి హాని కలిగిస్తున్నది. ఇప్పట్లో ఇది ఎలా ముగిసేది ఇంకా స్పష్టం గాకున్నా వారి వైఖరిలో మాత్రం మార్పు వచ్చే సూచనలు లేవు. తెలంగాణలోనూ రాజకీయ దృశ్యం ఎలాంటి మార్పులకు లోనవుతుందనేది జాగ్రత్తగా గమనించాల్సిన విషయం. అయితే తెలుగు రాష్ట్రాలతో సహా దక్షిణాదిన బిజెపి బలం పరిమితమే గనక ఎన్ని ఎత్తుగడలు వేసినా అధికారంలోకి రావడం గాని దేశవ్యాపితంగా బలాబలాల మార్పులో గాని పెద్ద ప్రభావం వుండదు. హిందీ రాష్ట్రాలు మరీ ముఖ్యంగా యు.పి, గుజరాత్ వంటి చోట్ల బిజెపిని నిలవరించడం కీలక కర్తవ్యమవుతుంది. బిజెపి ఆరెస్సెస్ కూటమి తమ బలహీనతను గుర్తించిందని వారి కదలికలు చెబుతున్నాయి. మరి కాంగ్రెస్, ఇతర లౌకిక ప్రాంతీయ పార్టీలు కూడా పైన చెప్పుకున్నట్టు అవగాహన పెంచుకుని అడ్డుకునే దిశలో సాగుతాయా అన్నదే భవిష్యత్తును నిర్దేశిస్తుంది. అదే సమయంలో అడుగు జారుతున్న సంఘ పరివార్ ముందుకు తెచ్చే విభజన రాజకీయాలను, విద్వేష ప్రయత్నాలను కూడా విఫలం చేయవలసి వుంటుంది.

★

విలక్షణం జె.ఎస్ వ్యక్తిత్వం

నివాళి


వి. బాలసుబ్రమణ్యం

జె.ఎస్ అనే రెండక్షరాలు ఎంత మరిచిపోదామనుకున్నా సాధ్యంగాని అక్షరాలు. ఆయన మనల్ని విడిచిపోయి 13 ఏళ్లు గడుస్తున్నా నిరంతరం వెంటాడుతూనే వున్న అక్షరాలు. మనకెందరో జీవితంలో తారస పడుతుంటారు. వారిలో కొందరు మనల్ని ఉత్తేజితుల్ని చేసిన వాళ్లు కావచ్చు. కొందరు మనలో భావోద్వేగాల్ని రగిలించి వుండొచ్చు. కొందరు మనల్ని చెయ్యిబట్టి నడిపించి ఉండొచ్చు. కొందరి మాటలు నిరంతరం మనల్ని మనం శోధించుకునేవీ, ప్రశ్నించుకునేవీ కావచ్చు. కొందరితో కాలక్షేపం సైతం కొండంత తృప్తిని ఇవ్వొచ్చు. కొందరి నుంచి ఎంత నేర్చుకున్నా నేర్చుకోవాల్సింది మిగిలే వుండిపోవచ్చు. ఇవన్నీ ఒకే దగ్గరికి చేరిస్తే ఆయన జె.ఎస్ (జెట్టి శేషారెడ్డి) అవుతాడు.

ఎప్పుడు మాట్లాడినా మళ్ళీ మళ్ళీ ఆయనతో మాట్లాడాలని పించడమే ఆయన గొప్పదనాల్లో కల్లా గొప్పదనం. ఎక్కడా భేషజం వుండదు. ఎన్నడూ రాజీ ఉండదు. ఎప్పుడూ పాతదే కనపడదు. ఆత్మీయతతో కట్టిపడేస్తూ అంతర్మథనానికి నెట్టేవి ఆయన మాటలు. ఆయనతో విభేదించినా, వాదించినా చివరికి ఓడిపోయినా ఒకే తృప్తి, ఆనందం కలిగేవి. ఇలా ఎంతైనా ఆయన వ్యక్తిత్వాన్ని గురించి చెప్పుకోవచ్చు. కానీ మనం ఉద్యమాల్లో వున్న వాళ్ళం. ఏదో ఒక వసంత కాల సుప్రభాతం వస్తుందనీ, మనం వెదజల్లిన విత్తనాలు మొలకెత్తి, మహావృక్షాలై పుష్పించి, మరో ప్రపంచపు సుగంధాలు విరజిమ్ముతాయని నమ్ముతున్న వాళ్ళం. దీనికి సిద్ధాంతం, నిర్మాణం ప్రాణమని విశ్వసిస్తున్నవాళ్ళం. ఇలాంటి మనకు ఆయన ఏమిచ్చి వెళ్లారు అనేది సూటిగా మాట్లాడుకోవాల్సిన తరుణమిది.

చివరి దాకా ప్రజలతో మమేకం

ఒకసారి బొలీవియా గురించి చర్చ జరుగుతూ ఉంది. ఆదిమ తెగల లాంటి అట్టడుగు స్థానిక తెగలకు భూమి పంచడాన్ని గురించి జె.ఎస్ ప్రస్తావిస్తున్నారు. ఆ ప్రజల కష్టాల్ని, వారి పోరాటాలని వివరిస్తున్నారు. అంతే ఆయన కళ్ళలో తళుక్కున నీళ్లు తొణికాయి. వాటిని కనిపెట్టే పెట్టకముందే దాచేసుకుని చెప్పాల్సింది చెబుతూ పోతున్నారు. ఎక్కడి బొలీవియా? ఎక్కడి స్థానిక తెగలు? వారికి భూములు ఇస్తే జె.ఎస్ కు ఎందుకింత ఆనందం? వారి కష్టాలు చెబుతుంటే ఆయనకెందుకంత భావోద్వేగం? పేదల పట్ల ఈ ఆర్ద్రతే ఆయన్ను జీవితాంతం నడిపించి వుంటుందనుకుంటాను. ప్రజా వైద్యవృత్తికి అంకితం చేసి వుంటుందనుకుంటాను. పేదల్ని ప్రేమించడం, వాళ్ళ కడగండ్లకు చలించిపోవడం, వాళ్లకే చిన్న మంచి జరిగినా



12న జెట్టి శేషారెడ్డి వర్ధంతి

మురిసిపోవడం ప్రతి ఉద్యమకారుడికి వుండాల్సిన ప్రాథమిక లక్షణాలన్పిస్తుంది.

జె.ఎస్ నిరంతర పాఠకుడు. జ్ఞాన పిపాసి. మేధావి. ఇంకా ఇంకా ఆయన ఎన్నైనా కావచ్చు. కానీ ప్రజలతో మమైకత్వం మాత్రం ఆయన చివరి క్షణాల దాకా వదులుకోలేదు. ప్రజా వైద్యుడిగా ఆయనకా అవకాశం చిక్కింది. ఎదురుగా కూర్చున్న పేద రోగి నాడి పట్టుకొని ఆయన ప్రజల నాడిని తెలుసుకొనేవాడు. వైద్యాన్ని దీనికి ఒక అవకాశంగా మలుచుకునేవాడు. వాళ్ళ మనిషిగా వాళ్ళ భాషలో మాట్లాడేవాడు. వాళ్ళ నుంచి వినేవాడు. వాళ్లతో అనుబంధాన్ని పెంచుకునే వాడు. ఎప్పుడూ సాధారణ జనానికి దూరం గాకుండా జాగ్రత్తపడేవాడు. మనం టీబీకి మందులిస్తాం, ఆహారం ఎవరు పెడతారు? అని అనుభవం నుంచే సిద్ధాంతాన్ని అన్వయించుకునేవాడు. జె.ఎస్ సిద్ధాంత నిబద్ధత లోని అసలు రహస్యం ఇదే !

అపార జ్ఞాన తృష్ణ

తన అనుభవాల్ని ఆయన సమకాలీన ప్రపంచానుభవాలతో నిరంతరం సరిచూచుకునేవాడు. అందుకోసం ఎక్కడెక్కడివో చదివేవాడు. అందరితోనూ సంబంధాలు పెట్టుకొని వారి నుంచి తెలుసుకొనేవాడు. ఎక్కడా వెనకబడేవాడు కాదు. అందుకోసం ఆధునిక సమాచార సాంకేతిక విజ్ఞానాన్ని ఒడిసి పట్టుకొనేవాడు. అప్పుడాయనకు వయస్సేమీ అడ్డం రాలేదు. వేకువనే లేచి, ఇంటర్నెట్లో ప్రపంచమంతా గాలించి, మంచిని వేరుచేసి, దుర్మార్గాలని దూరం చేసి, పది మందికి మెయిల్ చేసి వైద్యానికి ఉదయం 6 గంటలకల్లా సిద్ధమయ్యేవాడు. అంతటి జ్ఞాన తృష్ణ ఆయనది. అయితేనేం? ఆయనెప్పుడూ నాదే చివరి మాట అనే వాడు కాదు. ఎన్నో వాదాలు ఆయనతో చేసే అవకాశం నాకు వచ్చింది. ఓపిగ్గా వింటాడు. అంతే ఓపిగ్గా తన వాదన కూడా వినిపిస్తాడు. ఎదుటివారి వాదనను కూడా వాదంగా స్వీకరిస్తాడు. అలా వాదించే హక్కును గౌరవిస్తాడు. సమావేశాల్లో చర్చల్లో ఈ ప్రజాస్వామిక లక్షణం చాలా కష్టమైన పని. మేధావులకు, నాయకులకు మరీ కష్టమైన పని. అందుకే జె.ఎస్ తో పోట్లాడితే చిరాకు వేసేది కాదు. ముచ్చట వేసేది. కొంతకాలం గడిచాక సిగ్గేసేది. ఒడిలో పడుకొన్న బిడ్డ కాళ్లు చేతులతో తన్నుతుంటే, లాలిస్తూ ముచ్చట పడే తల్లి ప్రతిరూపం శేషారెడ్డిలో కనిపించేది.

పదునెక్కిన కత్తి వాదర!

జె.ఎస్ చాలా మృదుస్వభావి. ఎప్పుడూ నవ్వుతూ కనపడేవాడు. ఆయన కనిపిస్తే, పలికితే, చెయ్యి పట్టుకుంటే తీయగా ఉండేది. కానీ ఆయన అత్యంత కఠినుడు కూడా. ఎప్పుడూ ఎంత సరళంగా ఉంటారో పాలసీల దగ్గరకొచ్చేటప్పటికి ఆయనంత కరుగ్గా మారి పోయేవాడు. ఇక రాజీ పడే ప్రశ్నే లేదు. ఎవరినీ లెక్క చేయడు. ఏ ములాజా పెట్టుకోడు. తాను ఎంత ఒంటరి అయినా కూడా పట్టించుకోడు. 'కత్తి వాదర పదునుగా ఉంటేనే పనికొస్తుంది. లేకుంటే తుప్పుపట్టి పోతుంది' అనిపించేది జె.ఎస్ ని అలాంటి సందర్భాల్లో చూసినప్పుడు. ఎక్కడో ఒకచోట రాజీపడడం, విసిగిపోవడం, నిరాశపడడం, తటస్థతతో సరిపెట్టుకోవడం, మౌన ధారణ చేయడం జె.ఎస్ నిఘంటువులో లేని మాటలు. అదే సందర్భంలో మెజారిటీ అభిప్రాయానికి ఆయన అంతే వినయంగా ఒదిగిపోయేవాడు. ఒక్క అడుగు అటూ ఇటూ వేసే వాడు కాదు.

జె.ఎస్ ఓ స్పష్టమైన ప్రాపంచిక దృక్పథానికి, సిద్ధాంతానికి ఈ రెంటినీ అంగీకరించే, నిర్మాణానికి జీవితాంతం కట్టుబడ్డ వ్యక్తి. జీవితంలోని ప్రతి అణువు దీనికి అంకితం చేసిన వ్యక్తి. అట్లని ఆయన ప్రపంచం చాలా చిన్నదనుకుంటే పొరపాటు. సాహిత్యవేత్తల నుంచి, సామాజిక వర్గాల నాయకుల దాకా...సాంకేతిక నిపుణుల నుంచి సంప్రదాయ పండితుల దాకా ఆయనకుండే సంబంధాలు కోకోల్లలు. తద్వారా ఆయన నమ్మిన సిద్ధాంతానికి ఓ ఆమోదం లభింపచేయగలిగాడు. ఎదుటివారిని అంగీకరించడం, గౌరవించడం పది మంది మనిషిగా చలామణి కావడం చాలా కొద్ది మంది ఉద్యమకారులకే సాధ్యం. వారిలో జె.ఎస్ ముందుండే వాడు.

జన విజ్ఞాన వేదికకు దిక్సూచి

అలాగే ఎన్ని సంస్థలతో, ఉద్యమాలతో ఆయనకు అనుబంధ బాంధవ్యాలు ఉండేవో చెప్పలేము. ప్రతి సంస్థలోను ఏదో ఆదర్శాన్ని ఆయన వెతుక్కునేవారు. ఆశించేవారు. అది రెడ్ క్రాస్ కావచ్చు, యు.టి.ఎఫ్ కావచ్చు, సైన్స్ ఉద్యమం కావచ్చు. యు.టి.ఎఫ్ నుంచి ఆయన చాలా ఆశించాడు. గ్రామాల్లో ఉంటారని, పాఠాలు చెప్పే వారిని, ఆలోచనాపరులని, సంఘటిత పడ్డవారని, లోకానికి ఇంతకంటే పనికొచ్చే వాళ్ళు ఎవరుంటారని ఆయన టీచర్లను, వారి ఉద్యమాన్ని ఎంతో ప్రేమించాడు, గౌరవించాడు. ఇక జన విజ్ఞాన వేదిక ఆయన చేతుల్లో పుట్టింది, ఎదిగింది. అక్షర దీపం మేము చేపట్టినప్పుడు, అది సారా వ్యతిరేక ఉద్యమంగా ప్రభంజనమైనప్పుడు జె.ఎస్ ఎంత ఆనందించాడో, ఎంత ప్రోత్సహించాడో చెప్పలేను. 'న్యూ ఎకనామిక్ పోలసీ, ఇట్స్ ఇంపాక్ట్ అండ్ ఇంప్లికేషన్' మీద 'జాతీయ సదస్సును మేము 1993 డిసెంబర్‌లో జరిపినప్పుడు 'హిందూ' సంపాదకులు ఎన్.రామ్ హాజరయ్యారు. ముగ్ధులయ్యారు. 'జెవివి ని చూచి నేర్చుకోండి' అని తమిళనాడు సైన్స్ ఫోరంకు సలహా ఇచ్చారు. నిజానికి ఈ ఆలోచన, ప్రాణాళిక, వనరుల సేకరణ, వక్తల గుర్తింపు ప్రతి ఒక్కటీ జె.ఎస్ దే. ముప్పై ఏళ్ల ఆనాటి వక్తల మాటలన్నీ నేడు అక్షర సత్యాలయ్యాయి. జె.ఎస్ ది అంత దూరదృష్టి .

చివరిగా ఒక మాట. మనకంటే చిన్నవాళ్లతో, సమానమైన వాళ్ళతో సాన్నిహిత్యం నెరపడం చాలా సులభం. అందులో మన ఆధిపత్యాన్ని వీలున్నప్పుడల్లా ప్రదర్శించుకునే వీలుంటుంది. కానీ మనకంటే పెద్దవాళ్లతో, గొప్ప వాళ్ళతో సాన్నిహిత్యమే మనమెంత అల్పులమో అడుగడుగునా అంచనా వేసుకునేందుకు అవకాశం కల్పిస్తుంది. మధ్యతరగతి బుద్ధిజీవులకు ఎప్పటికప్పుడు తమ 'ప్రతిభా పాటవాల' పరిమితుల్ని గుర్తు చేసే ఒక వ్యవస్థ తప్పనిసరి అవసరమనిపిస్తుంది. జె.ఎస్ రూపంలో మాకు ఆ అవకాశం దక్కింది ఒళ్ళు దగ్గర పెట్టుకునేలా చేసింది!

/ వ్యాసకర్త మాజీ ఎమ్మెల్సీ /

జనవాక్యం

పన్నులు ఏమవుతున్నాయి?

ప్రజలు స్వచ్ఛందంగా పన్నులు కడుతుంటే మీడియాకు వచ్చిన ఇబ్బంది ఏమిటని పురపాలక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి శ్రీలక్ష్మి గారు ప్రశ్నిస్తున్నారు. నిజం చెప్పాలంటే గతంలో లేని పన్ను ఇప్పుడు ఎందుకు చెల్లించాలని ప్రజలు ప్రశ్నిస్తున్నారు! అసలు ఆ చెత్త పన్ను లక్ష్యం ఏమిటి? కట్టిన పన్నులు ఏమవుతున్నాయి? అనే మీడియా ప్రశ్నిస్తున్నది. అది మీడియా బాధ్యత. మీడియాలో వచ్చిన కథనాలకు శ్రీలక్ష్మి గారి ఎదురు ప్రశ్నలు బాధ్యతారాహితం అని చెప్పాలి!

- గరిమెళ్ల రామకృష్ణ,
ఏలూరు, ఏలూరు జిల్లా.

రైల్వే ఖాళీల భర్తీ ...?

ఇండియన్ రైల్వేలో దాదాపు మూడు లక్షలకు పైగా ఉద్యోగాలు ఖాళీగా పడి ఉన్నాయి. ఏటికేడు ఈ సంఖ్య పెరుగుతూ పోతోంది. అలాగే రైల్వేలో రక్షక దళం అయిన ఆర్.పి.ఎఫ్ కానిస్టేబుల్, ఎస్సై లాంటి పోస్టులు వేలకువేలు ఖాళీగా పడి ఉన్నాయి. వీటిని భర్తీ చెయ్యక దాదాపు ఐదు సంవత్సరాలు కావస్తోంది. ప్రభుత్వం ఖజానా నింపుకోవడానికి ప్రయత్నం చేస్తోంది కానీ ఖాళీగా పడి ఉన్న ఉద్యోగాల భర్తీని గాలికి వదిలేసింది. ఈ కారణంగా రైలు ప్రమాదాలు జరిగి అధిక ప్రాణ నష్టం సంభవిస్తోంది. ప్రభుత్వం వెంటనే ఉద్యోగులపై పని ఒత్తిడి తగ్గించి, ఉద్యోగాలను భర్తీ చేసి రైలు ప్రమాదాలను నిలువరించాలి.

- బిల్లు కుళ్లాయప్ప,
సత్య సాయి జిల్లా.

గుజరాత్‌లో ఐసిస్ కుట్ర భగ్నం

- నలుగురి అరెస్టు

న్యూఢిల్లీ : గుజరాత్ పోలీసు యాంటీ టెర్రరిస్ట్ స్క్వాడ్ (ఎటిఎస్) భారీ ఉగ్ర కుట్రను భగ్నం చేసింది. పోర్బందర్ పట్టణంలో ఇస్లామిక్ స్టేట్ మాడ్యూల్ గుట్టు రట్టు చేసింది. ఒక మహిళతో సహా నలుగురు అనుమానిత ఉగ్రవాదులను అరెస్ట్ చేసింది. అరెస్టయిన నలుగురు వ్యక్తులు ఐసిస్ టెర్రర్ మాడ్యూల్‌లో భాగమేనని అందిన సమాచారం మేరకు ఎటిఎస్ సిబ్బంది దాడులు నిర్వహించారు. నిందితులంతా ఓ ఏడాది నుంచి సంబంధాలను కొనసాగిస్తున్నారని అధికారులు తెలిపారు. దేశం విడిచి వెళ్లడానికి, ఐసిస్ ఉగ్రవాద సంస్థలో చేరడానికి వీరు ప్రణాళిక రచించారని తెలిపారు. డిఐజి దీపన్ భద్రన్, ఎస్పీ సునీల్ జోషి నేతృత్వంలో జరిగిన దాడుల్లో సుమేర అనే మహిళతోపాటు, ముగ్గురు పురుషులను శుక్రవారం అరెస్ట్ చేశారు. వీరి వద్ద నుంచి అనేక నిషిద్ధ వస్తువులను వీరి నుంచి స్వాధీనం చేసుకున్నారు. పాకిస్థాన్‌లోని హ్యాండ్లర్స్ వీరిని రాడికలైజ్ చేసినట్లు గుర్తించారు. కాగా, కొన్ని రోజుల క్రితం అహ్మదాబాద్‌లో ముగ్గురు అనుమానిత ఐసిస్ ఉగ్రవాదులను పోలీసులు అరెస్టు చేశారు.

బహనగా బజార్ రైల్వేస్టేషన్‌ను సీజ్ చేసిన సిబిఐ

భువనేశ్వర్: ఒడిషాలో జరిగిన ఘోర రైలు ప్రమాదంపై సిబిఐ దర్యాప్తు ప్రారంభించింది. ఈ నేపథ్యంలో దుర్ఘటన చోటుచేసుకున్న బాహానగా బజార్ రైల్వేస్టేషన్‌ను తాజాగా సీల్ చేసింది. ఇంతకుముందే స్టేషన్ లాగ్ బుక్, రిలే ప్యానెల్, ఇతర పరికరాలను సిబిఐ స్వాధీనం చేసుకుంది. రైల్వే స్టేషన్‌ను సిబిఐ స్వాధీనం చేసుకోవడంతో తదుపరి ఉత్తర్వులు వచ్చేవరకూ బాహానగా బజార్ స్టేషన్‌లో ఏ రైళ్లూ ఆగవని రైల్వే అధికారులు శనివారం వెల్లడించారు. సాధారణ రోజుల్లో భద్రక్–బాలేశ్వర్, హావ్‌డా– భద్రక్, ఖరగ్‌పూర్– ఖుర్దా రోడ్ తదితర ఏడు ప్రయాణికుల రైళ్లతోపాటు అవసరమైన సందర్భాల్లో గూడ్సు రైళ్లు ఇక్కడ ఆగేవి. 'రిలే ఇంటర్‌లాకింగ్ ప్యానెల్‌ను స్వాధీనం చేసుకున్నందున.. సిగ్నలింగ్ వ్యవస్థను నిర్వహించేందుకు స్టేషన్ సిబ్బందికి అవకాశం లభించదు. ఈ నేపథ్యంలో.. తదుపరి నోటీసులు వచ్చే వరకు స్టేషన్‌లో ప్రయాణికుల, గూడ్సు రైళ్లు ఆగవు' అని వెల్లడించారు. కాగా, బాహానగా బజార్ స్టేషన్ మీదుగా రోజూ దాదాపు 170 రైళ్లు రాకపోకలు సాగిస్తాయి.

బాలికపై హత్యాచారం కేసులో దోషులకు మరణశిక్ష

చండీగఢ్ : తొమ్మిదేళ్ల మూగచెవిటి బాలికపై అత్యాచారం చేసి, హత్యకు పాల్పడిన ఇద్దరు యువకులకు మరణశిక్ష విధిస్తూ హర్యానాలోని పాల్వాల్ ప్రత్యేక ఫాస్ట్ ట్రాక్ కోర్టు సంచలన తీర్పునిచ్చింది. పోస్కో చట్టంలోని సెక్షన్ 6, ఐపీసీలోని సెక్షన్ 364, సెక్షన్ 302, 201 కింద ఈ ఇద్దర్నీ దోషులుగా కోర్టు ప్రకటించింది. ఈ నేరం అత్యంత హేయమైన, కిరాతక చర్య అని, బాధితురాలి చేతులు కట్టేసి, పదేపదే అత్యాచారానికి పాల్పడ్డారని, బీడీలతో ఆమె కళ్లకు వాతలు పెట్టారని అడిషన్ సెషన్స్ జడ్జి ప్రశాంత్ రానా పేర్కొన్నారు. నేర తీవ్రత దృష్ట్యా ఈ కేసు అరుదైన కేసుల్లోనే అత్యంత అరుదైన కేటగిరి కిందకు వస్తుందని, దోషులకు మరణశిక్ష మాత్రమే సరైన శిక్ష అవుతుందని స్పష్టం చేశారు. అత్యాచారం–హత్యకు గురైన మైనర్ బాలిక, అఘాయిత్యానికి పాల్పడిన 22, 27 ఏళ్ల యువకులు ఇరుగుపొరుగునే ఉంటుంటారు. బాలిక జామపళ్లు అమ్ముకునేందుకు వెళ్తుండగా ఈ ఇద్దరు యువకులు ఆమెను అటకాయించి దట్టమైన పొలాల్లోకి లాక్కెళ్లాడు. అక్కడే ఆమెపై పదేపదే అత్యాచారం జరిపి, ఆపై హత్య చేశారు. హంతకులు ఇద్దరూ బాలిక గొంతును బలంగా నులమడంతో ఆమె ఉక్కిరిబిక్కిరై శ్వాసఆడక ప్రాణాలు కోల్పోయింది. ఆ మరుసటి రోజు ఛిద్రమైన స్థితిలో, ముఖం నిండా క్రిమికీటకాదులు పాకుతుండగా బాలిక మృతదేహం వెలుగుచూసింది.

సమస్యలను పరిష్కరిస్తేనే ఆసియా గేమ్స్‌కు..

ప్రభుత్వానికి రెజ్లర్లు అల్టిమేటం



ప్రజాశక్తి–న్యూఢిల్లీ బ్యూరో

బిజెపి ఎంపి, డబ్ల్యుఎఫ్ఐ చీఫ్ బ్రిజ్ భూషణ్ శరణ్ సింగ్‌కు వ్యతిరేకంగా ఆందోళన చేపట్టిన దేశ అగ్రశ్రేణి రెజ్లర్లు శనివారం కేంద్ర ప్రభుత్వానికి అల్టిమేటం ఇచ్చారు. తమ డిమాండ్లు పరిష్కారమైతేనే ఈ ఏడాది జరగబోయే ఏషియన్ గేమ్స్‌లో పాల్గొంటామని, లేదంటే వాటిని బహిష్కరిస్తామని హెచ్చరించారు. హర్యానాలోని సోనిపట్‌లో శనివారం జరిగిన ఖాప్ నేతలు నిర్వహించిన మహాపంచాయత్లో రెజ్లర్లు సాక్షి మలిక్, బజరంగ్ పునియా పాల్గొన్నారు. ఈ సందర్భంగా సాక్షి మలిక్ మాట్లాడుతూ. "ఈ సమస్యలన్నీ పరిష్కారమైతేనే మేం ఏషియన్ గేమ్స్‌లో పాల్గొంటాం. మేం ప్రతిరోజూ మానసికంగా ఎంతటి వేదన అనుభవిస్తున్నామో మీకు అర్థం కాదు" అని అన్నారు. ఇక, ఈ సందర్భంగా బజరంగ్ పునియా మాట్లాడుతూ.. ప్రభుత్వంలో జరిగిన చర్చల గురించి ఖాప్ నేతలకు వివరించనున్నట్లు తెలిపారు. ఇక, ఆందోళన చేస్తున్న రెజ్లర్ల మధ్య ఐక్యత లోపించిందంటూ వస్తున్న వార్తలను సాక్షి మలిక్ తోసిపుచ్చారు. తామంతా ఒక్కటే అని తెలిపారు. ప్రభుత్వం ఇచ్చిన గడువులోగా సమస్య పరిష్కారం కాకపోతే మళ్లీ కలిసికట్టుగా ఆందోళనకు దిగుతామని పేర్కొన్నారు. రెజ్లింగ్ సమాఖ్య అధ్యక్షుడు, బిజెపి ఎంపి బ్రిజ్ భూషణ్ లైంగిక ఆరోపణల కేసులో నిరసనలు కొనసాగిస్తున్న తమపై తీవ్రమైన ఒత్తిడి ఉందని రెజ్లర్ సాక్షి మాలిక్ అన్నారు. రాజీకి రావాలని నిందితుని మనుషులు బెదిరిస్తున్నారని పేర్కొన్నారు. ఫిర్యాదును వెనుకకు తీసుకోవాలని ఒత్తిడి చేసినందునే మైనర్ రెజ్లర్ తండ్రి మాట మార్చారని అన్నారు. 'నిందితున్ని అరెస్టు చేసి దర్యాప్తు చేయించాలని మొదటి నుంచి కోరుతున్నాం.. బ్రిజ్ భూషణ్ బయట ఉండడం వల్ల కేసును తప్పుదోవ పట్టిస్తున్నాడు' పేర్కొన్నారు.

బ్రిజ్ భూషణ్‌ను అరెస్టు చేయాలనేది రెజ్లర్ల ప్రధాన డిమాండ్‌గా ఉండగా, 15న దర్యాప్తు నివేదిక వస్తుందని, ఛార్జిషీటు నమోదయ్యేంత వరకూ వేచిచూడాలని ప్రభుత్వం కోరుతోంది. ఈ నేపథ్యంలో ఈనెల 15 తరువాతే నిరసన కొనసాగిస్తున్న రెజ్లర్లు, వారికి బాసటగా ఉన్న మహాపంచాయత్ తదుపరి కార్యాచరణను నిర్ణయించే అవకాశం ఉంది.కాగా, 2023 ఏషియన్ గేమ్స్ చైనాలో వచ్చే సెప్టెంబర్‌లో జరుగనున్నాయి. గత ఒలంపిక్స్–2018లో జరిగిన ఏసియన్ గేమ్స్‌లో బజరంగ్ పూనియా, వినేష్ ఫోగట్ లు బంగారు పతకాలు గెలుచుకున్నారు. ఈ నేపథ్యంలో కొద్దికాలంగా నిరసన సాగిస్తున్న రెజ్లర్లు ఏషియన్ గేమ్స్ నుంచి వెదొలిగితే ఆ ప్రభావం ఇండియాపై పడే అవకాశాలుంటాయి.

కేరళలో అంతర్జాతీయ సైన్స్ ఫెస్టివల్

- ఆసియాలోనే అతి పెద్ద సమావేశం
- డిసెంబర్‌లో ప్రారంభం



తిరువనంతపురం : కేరళలోని తిరువనంతపురంలో డిసెంబర్ నుంచి రెండు నెలల పాటు అంతర్జాతీయ సైన్స్ ఫెస్టివల్‌ను నిర్వహించబోతున్నారు. దీనిని ఆసియాలోనే అతి పెద్ద సైన్స్ ఫెస్టివల్‌గా భావిస్తున్నారు. సైన్స్‌ను అందరికీ చేరువ చేయడమే ఈ ఫెస్టివల్ ముఖ్యోద్దేశం. దీనిలో భాగంగా విద్యార్థులు, శాస్త్రవేత్తల కోసం సైన్స్ ఎగ్జిబిషన్, సైన్స్ కాంగ్రెస్‌లను నిర్వహిస్తారు. ఎగ్జిబిషన్‌లో మ్యూజియం, నౌకాదళానికి చెందిన హెచ్‌ఎంఎస్ బీగల్ నౌక ప్రతిమ ఉంటాయి. డార్విన్ పరిణామ సిద్ధాంతం స్ఫూర్తితో రూపొందించిన ఫెస్టివల్ లోగోను కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్ ఆవిష్కరించారు. కేరళ రాష్ట్ర సైన్స్, టెక్నాలజీ, ఎన్విరాన్‌మెంట్ కౌన్సిల్ (కేఎస్‌సీఎస్టీఈ), శాస్త్ర సాంకేతిక శాఖ, ఎఎంయూఎస్‌ఈయూఎం సంయుక్తంగా లైఫ్ సైన్స్ పార్కులోని 20 ఎకరాల సువిశాల ప్రాంగణంలో ఈ ఫెస్టివల్‌ను నిర్వహిస్తాయి. సైన్స్ ఫెస్టివల్‌కు సన్నాహకంగా 2016 నవంబర్‌లోనే అతి పెద్ద ర్యాలీ నిర్వహించారు. దీనికి పాఠశాలలు, కళాశాలల నుండి విశేష స్పందన లభించింది. అయితే కోవిడ్ కారణంగా ఫెస్టివల్ నిర్వహణలో జాప్యం జరిగింది. ఫెస్టివల్ కోసం గత కొంత కాలంగా రాష్ట్రంలో పలు కార్యక్రమాలు నిర్వహించారు. ఫెస్టివల్ నిమిత్తం రాష్ట్ర ప్రభుత్వం నాలుగు కోట్ల రూపాయలు కేటాయించింది. రెండు నెలల పాటు జరిగే ఫెస్టివల్‌లో వివిధ అంశాలపై కూలంకషంగా చర్చలు జరుగుతాయి. దీనికి పది లక్షల మంది హాజరవుతారని అంచనా.

తీవ్రంగా మారనున్న 'బిపోర్‌జాయ్'

- మూడు రాష్ట్రాలకు హెచ్చరికలు

ముంబయి: అరేబియా సముద్రంలో ఏర్పడిన 'బిపోర్‌జాయ్' తుపాను మరో 24 గంటల్లో మరింత తీవ్ర రూపం దాల్చనున్నట్లు భారత వాతావరణ శాఖ శనివారం తెలిపింది. ఇది మరింత బలపడి ఉత్తర–ఈశాన్య దిశగా కదులుతుందని వెల్లడించింది. ఇది ప్రస్తుతం గోవాకు పశ్చిమాన 690 కి.మీ దూరంలో, ముంబయికి పశ్చిమ–నైరుతి దిశలో 640 కి.మీలో కేంద్రీకృతమైనట్లు తెలిపింది. అలాగే ఈ తుపాను ప్రభావంతో కర్ణాటక, గోవా, మహారాష్ట్రలోని తీర ప్రాంతాల్లో భారీ వర్షాలు పడే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరించింది. బలమైన ఈదురు గాలులు కూడా వీస్తాయని తెలిపింది. కాగా, భారీ అలల కారణంగా గుజరాత్‌లోని ప్రముఖ తితాల్ బీచ్‌ను ఈ నెల 14 వరకూ మూసివేస్తున్నట్లు స్థానిక అధికారులు తెలిపారు. తుపాను కారణంగా జూన్ 10 నుంచి 12 వరకు 45 నుంచి 55 కిలోనాట్స్ వేగంతో బలమైన ఈదురుగాలులు వీస్తాయని.. ఇవి 65 కిలోనాట్స్ వరకూ చేరవచ్చని అధికారులు తెలిపారు. దీంతో అరేబియా సముద్రంలో చేపల వేటకు వెళ్లవద్దని మత్స్యకారులకు అధికారులు హెచ్చరికలు జారీ చేశారు.

ఎన్‌సిపి వర్కింగ్ ప్రెసిడెంట్లుగా సుప్రియా, ప్రఫుల్ పటేల్

ముంబయి : నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీ (ఎన్‌సిపి) వర్కింగ్ ప్రెసిడెంట్లుగా సుప్రియా సూలే, ప్రఫుల్ పటేల్‌ను నియమించారు. శనివారం ఆ పార్టీ 25వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా శరద్ పవార్ ఈ నియామకాలు చేశారు. పవార్, పీఏ సంగ్మా కలిసి 1999లో ఎన్‌సిపిని స్థాపించారు. వర్కింగ్ ప్రెసిడెంట్‌గా మహారాష్ట్ర, హర్యానా, పంజాబ్, ఉమన్ యూత్, లోక్‌సభ సమన్వయకర్తగా సుప్రియా సూలే బాధ్యతలు నిర్వహిస్తారు. మధ్యప్రదేశ్, రాజస్థాన్, గోవా వ్యవహారాలను ప్రఫుల్ పటేల్ చూసుకుంటారు. శరద్ పవార్ గత నెలలో ఎన్‌సిపి చీఫ్ పదవికి రాజీనామా ప్రకటించగా, పార్టీ కార్యకర్తలు ఆ ప్రతిపాదను వ్యతిరేకిస్తూ ఆందోళనకు దిగారు. దీంతో పవార్ ఆ ఆలోచనను వెనక్కి తీసుకున్నారు. వర్కింగ్ ప్రెసిడెంట్లను ఏర్పాటు చేసుకోవాలని పవార్‌కు పార్టీ ప్యానల్ సూచించింది. ఈ నేపథ్యంలో పవార్ తాజా నియామకాలు చేపట్టారు. పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి సునీల్ టక్కరెకు ఒడిషా, పశ్చిమబెంగాల్, రైతులు, మైనారిటీ శాఖ బాధ్యతలు అప్పగించారు. నంద శాస్త్రిని ఢిల్లీ పార్టీ చీఫ్‌గా పవార్ ప్రకటించారు. కొత్త పదవుల్లో శదర్ పవార్ మేనల్లుడు అజిత్ పవార్‌కు ఎలాంటి బాధ్యతలు అప్పగించకపోవడం విశేషం.

హత్య చేయడం ఎలా?

- ఇంటర్నెట్‌లో సోధించి ఘాతుకం
- సాయికృష్ణ రిమాండ్ రిపోర్టులో పోలీసుల వెల్లడి

ప్రజాశక్తి – హైదరాబాద్ బ్యూరో

తెలంగాణలోని శంషాబాద్‌లో వెలుగులోకి వచ్చిన అప్సర దారుణ హత్యపై దిగ్భ్రాంతి కలిగించే వాస్తవాలు బయటపడుతున్నాయి. 'హత్య చేయడం ఎలా?' అని ఇంటర్నెట్‌లో సోధించి మరీ పూజారి సాయికృష్ణ ఈ ఘాతుకానికి ఒడిగట్టినట్టు పోలీసులు తెలిపారు. పెళ్లి చేసుకోవాలని కోరిన అప్సరను అంతం చేసేందుకు అతడు పక్కా ప్రణాళిక రచించినట్లు పేర్కొన్నారు. ఈ మేరకు కోర్టుకు సమర్పించిన రిమాండ్ రిపోర్టులో పోలీసులు పలు దిగ్భ్రాంతికర అంశాలు వెల్లడించారు. అప్సరతో వివాహేతర సంబంధం కొనసాగించిన సాయికృష్ణకు అమెను పెళ్లి చేసుకోవాలనే ఉద్దేశం లేదని, ఆమె న్యాయం కోసం పోరాడుతానని హెచ్చరించడంతో ఎట్లాగైనా ఆమెను హతమార్చాలని సాయికృష్ణ నిర్ణయించుకున్నట్లు పోలీసులు తెలిపారు. రిమాండ్ రిపోర్టు ప్రకారం..."గతేడాది ఏప్రిల్ నుంచి పూజారి సాయికృష్ణ, అప్సర మధ్య ఏర్పడిన పరిచయం వివాహేతర బంధానికి దారితీసింది. పెళ్లి చేసుకోమని అప్సర కోరింది. తనను పెళ్లి చేసుకోకపోతే రోడ్డుకు ఈడుస్తానని బెదిరించింది. అందుకే సాయికృష్ణ ఆమెను అడ్డుతొలగించాలనుకొని హత్య చేశాడు' అని పోలీసులు తెలిపారు. హత్యకు వారం రోజుల ముందు 'మనిషిని చంపడం ఎలా?' అనే విషయంపై సాయికృష్ణ ఇంటర్నెట్‌లో శోధించినట్లు పోలీసులు గుర్తించారు. 'జూన్ 3వ తేదీ రాత్రి 9 గంటలకు కోయంబత్తూర్‌కు టికెట్ బుక్ చేశానని అప్సరను నమ్మించి ఆమెను కారులో ఎక్కించుకొని సరూర్‌నగర్ నుంచి బయల్దేరాడు. రాత్రి 9 గంటలకు ఇద్దరూ శంషాబాద్ చేరుకున్నారు. శంషాబాద్ అంబేద్కర్ విగ్రహం దగ్గరికి చేరుకున్న తర్వాత టికెట్ బుక్ చేయలేదని చెప్పి.. అక్కడి నుంచి గోశాలకి తీసుకెళ్లాడు. అర్ధరాత్రి 12 గంటలకు ఇద్దరూ సుల్తాన్‌పల్లిలోని గోశాలకు చేరుకున్నారు. ఆమె నిద్రిస్తున్న సమయంలో సాయికృష్ణ హత్య చేశాడు' అని పోలీసులు పేర్కొన్నారు.

ఎంపి పదవికి బోరిస్ రాజీనామా

లండన్ : తన పార్లమెంట్ సభ్యత్వానికి రాజీనామా చేస్తున్నానని బ్రిటన్ మాజీ ప్రధాని బోరిస్ జాన్సన్ ప్రకటించారు. పార్టీ గేట్ కుంభకోణంపై పార్లమెంట్‌ను తప్పుదారి పట్టించినందుకు గానూ ఆయనపై ఆంక్షలు విధించనున్నట్లు కమిటీ ప్రకటించిన నేపథ్యంలో జాన్సన్ ఈ ప్రకటన చేశారు. కరోనా సమయంలో ప్రభుత్వం విధించిన నిబంధనలు, ఆంక్షలనే పలుసార్లు ఉల్లంఘించడానికి సంబంధించిన పార్టీగేట్ గురించి జాన్సన్ వరుసగా పార్లమెంట్‌లో చేసిన ప్రకటనలన్నీ తప్పుదారి పట్టించేలా వున్నాయని ఎంపీల దర్యాప్తులో వెల్లడైంది. దాంతో తన పార్లమెంట్ సభ్యత్వానికి రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించి సుదీర్ఘమైన ప్రకటన జారీ చేశారు. తనను ఎలాగోలా బయటకు పంపాలన్నదే తన ప్రత్యర్థుల ఉద్దేశ్యంగా వుందని ఆయన విమర్శించారు. తిరిగి పార్లమెంట్‌కు రావడానికి ప్రయత్నిస్తానని కూడా ఆయన సూచనప్రాయంగా తెలిపారు. పార్లమెంట్‌ను వీడడం చాలా బాధగా వుందని వ్యాఖ్యానించారు.

మణిపూర్ హింసపై మౌనమెందుకు?

- ప్రధాని వైఖరిని తప్పుపట్టిన ప్రతిపక్షాలు

ఇంఫాల్ : హింసాకాండతో మణిపూర్ అట్టుడుకుతున్నప్పటికీ ప్రధాని నరేంద్ర మోడీ మౌనం వహించడాన్ని పది ప్రతిపక్ష పార్టీలు తప్పుపట్టాయి. రాష్ట్రంలో సాధారణ పరిస్థితులు నెలకొనేలా చర్యలు తీసుకోవాలని కోరేందుకు త్వరలో ప్రధానిని కలవాలని ఆ పార్టీలు నిర్ణయించాయి. కాంగ్రెస్, సీపీఐ(ఎం), సీపీఐ, జేడీయూ, ఎఐఎఫ్‌బీ, ఆర్‌ఎస్‌పీ, శివసేన (ఉద్ధవ్ ఠాక్రే), తృణమూల్ కాంగ్రెస్, ఎన్సీపీ, ఆప్ పార్టీల నేతలు ఇంఫాల్‌లోని కాంగ్రెస్ భవన్‌లో సమావేశమయ్యారు. ఈ సమావేశానికి మణిపూర్ పీసీసీ అధ్యక్షుడు కె.మేఘచంద్ర అధ్యక్షత వహించారు. రాష్ట్రంలో నెలకొన్న ఉద్రిక్త పరిస్థితులను నివారించి, శాంతియుత వాతావరణాన్ని నెలకొల్పే దిశగా సమావేశం మూడు తీర్మానాలను ఆమోదించింది. మణిపూర్‌లో నెలకొన్న పరిస్థితిపై చర్చించేందుకు అసెంబ్లీ ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించాలని సమావేశం డిమాండ్ చేసింది. హింసాత్మక సంఘటనలతో రాష్ట్రం ఉడికిపోతుంటే గత 36 రోజులుగా ప్రధాని మౌనం వహించడాన్ని తీవ్రంగా ఖండించింది. కాగా మణిపూర్‌లో శాంతి స్థాపన కోసం కాంగ్రెస్ పార్టీ ఐదు పాయింట్ల అజెండాను రూపొందించింది. మణిపూర్‌లో ఇలాంటి భీతావహ వాతావరణాన్ని ఎన్నడూ చూడలేదని పీసీసీ ఉపాధ్యక్షుడు హెచ్.గోస్వామి వ్యాఖ్యానించారు. ముఖ్యమంత్రి బీరేన్ సింగ్ నిర్లక్ష్య వైఖరే ఈ పరిస్థితికి కారణమని విమర్శించారు.

గవర్నర్ అధ్యక్షతన శాంతి స్థాపన కమిటీ ఏర్పాటు

మణిపుర్‌లో హింసా కాండా కొనసాగుతూనే ఉంది. శుక్రవారం సైతం దుండగుల కాల్పుల్లో ముగ్గురు సాధారణ ప్రజలు మరణించారు. ఈ నేపథ్యంలో రాష్ట్రంలో శాంతి స్థాపనకు శనివారం కేంద్ర ప్రభుత్వం ఒక కమిటీని ప్రకటించింది. శనివారం కేంద్ర హోం శాఖ ఒక కమిటీని నియమించింది. మణిపుర్ గవర్నర్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన ఈ శాంతి స్థాపన కమిటీలో ముఖ్యమంత్రి, కొందరు మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, వివిధ పార్టీలకు చెందిన నాయకులు, ప్రజాసంఘాల నేతలు సభ్యులుగా ఉంటారని పేర్కొంది. జాతుల మధ్య శాంతి స్థాపన ప్రక్రియను సులభతరం చేసేందుకు, వారి మధ్య చర్చల నిర్వహణకు ఈ కమిటీ చొరవ తీసుకుంటుందని కేంద్ర హోం శాఖ ప్రకటనలో తెలిపింది. కేంద్ర హోంమంత్రి అమిత్ షా ఇటీవల మణిపుర్‌లో పర్యటించి, పరిస్థితులను సమీక్షించారు. ఈ సందర్భంగా శాంతి కమిటీని ఏర్పాటు చేస్తామని ప్రకటించారు. ఈ మేరకు శనివారం ప్రకటన జారీ అయ్యింది. పౌరుల మధ్య సామాజిక ఐక్యత, పరస్పర అవగాహనను శాంతి కమిటీ బలోపేతం చేస్తుందని హోంశాఖ తెలిపింది. జాతుల మధ్య సంబంధాలను మెరుగుపరుస్తుందని పేర్కొంది. మణిపుర్‌లో మే 3 నుంచి హింసా కాండ కొనసాగుతున్న సంగతి తెలిసిందే. ఈ హింసాత్మక ఘటనల్లో ఇప్పటివరకు సుమారు 100 మంది చనిపోగా, 300 మందికిపైగా గాయపడ్డారు. మణిపుర్ హింసాకాండపై సిబిఐ విచారణ ప్రారంభించింది. ఇప్పటికే 10 మంది సభ్యులతో కూడిన సిట్‌ను ఏర్పాటు చేసింది.

ఉక్రెయిన్‌కు 210కోట్ల డాలర్ల భద్రతా సాయం

ప్రకటించిన పెంటగన్

వాషింగ్టన్ : ఉక్రెయిన్‌కు భద్రతాపరమైన సాయంగా 210కోట్ల డాలర్లు అదనంగా అందచేయనున్నట్లు అమెరికా రక్షణ శాఖ ప్రకటించింది. కాగా, రష్యాపై సుదీర్ఘ స్థాయిలో పోరును కొనసాగించాలని ఉక్రెయిన్ భావిస్తున్నట్లు సంకేతాలు అందుతున్నాయి. ఈ నేపథ్యంలో అమెరికా ప్రకటన వెలువడడం గమనార్హం. ఈ సాయంలో పేట్రియాట్ వైమానిక రక్షణ వ్యవస్థలకు అదనపు ఆయుధాలు, హక్ వైమానిక రక్షణ వ్యవస్థలు, క్షిపణులు, 105ఎంఎం, 203ఎంఎం ఆర్టిలరీ రౌండ్లు, లేజర్ గైడెడ్ రాకెట్ వ్యవస్థలు తదితర ఆయుధాలు కూడా వున్నాయని రక్షణ విభాగం తెలిపింది. అమెరికా వద్ద వున్న నిల్వల నుండి ఆయుధాలు తీసి పంపించడం కాకుండా ఆయుధ వ్యాపారుల నుండి ఆయుధాలు కొనుగోలు చేసేందుకు బైడెన్ ప్రభుత్వాన్ని అనుమతించారు. ఆయుధ వ్యవస్థల లభ్యత, వాటి ఉత్పత్తిని బట్టి వీటిని ఎప్పుడు అందచేసేది ఆధారపడి వుంటుంది. రష్యాతో సుదీర్ఘ పోరాటానికి ఉక్రెయిన్ సిద్ధపడినట్లు కనిపించగానే అమెరికా ఈ ప్రకటన చేసింది. ఉక్రెయిన్ సెక్యూరిటీ అసిస్టెన్స్ ఇనీషియేటివ్ (యుఎస్ఎఐ) కింద పెంటగన్ ఇప్పటివరకు ఉక్రెయిన్‌కు 700కోట్ల డాలర్లకు పైగా సాయాన్ని అందించింది. ఐదు విడతలుగా ఈ సాయం అందింది. ఈ నెల 8న బ్రిటీష్ ప్రధాని రిషి సునాక్‌తో జరిగిన సమావేశంలో బైడెన్ మాట్లాడుతూ, ఉక్రెయిన్‌కు అవసరమైనంత కాలమూ అవసరమైన సాయాన్ని అందచేయగలమన్న విశ్వాసాన్ని వ్యక్తం చేశారు.




మీకోసం

ఫ్రిజ్ నుంచి ఘాటైన వాసనలు రాకుండా ఉండాలంటే న్యూస్‌పేపరును నీళ్లల్లో ముంచి కాసేపు ఉంచాలి. ఆ తరువాత ఆ నీటిని పిండేసి, ఓ గిన్నెలో ఈ తడి కాగితాన్ని ఉంచి ఫ్రిజ్ లోపల పెడితే సరిపోతుంది.

జీవన సౌరభం

జీవితంలో ప్రతిరోజూ నిన్నటి కన్నా ఎక్కువ విషయాలు నేర్చుకుంటూ ఉండాలి.

స్నేహితులు



అనగనగా ఒక చెరువు ఒడ్డున ఒక మర్రిచెట్టు ఉంది. చెట్టు మీద కోతి, కోకిల ఉండేవి. చెరువులో ఒక తాబేలు ఉండేది. చిన్నప్పుడు అవి మూడూ కలిసి చెరువు గట్టు మీద ఆడుకునేవి. పాడుకునేవి. కోతి తన అమ్మానాన్నలతో ఎక్కువగా ఉండేది. కోకిల, తాబేలుకు అమ్మానాన్నలు లేరు. దాంతో అవి ఒంటరిగా ఉండేవి.

కోతి వాళ్ళ అమ్మ అప్పుడప్పుడు చెట్టుపై నుంచి ఈ మూడింటిని చూస్తూ ఉండేది. అది చూసి కోకిల 'మీ అమ్మ ఎప్పుడూ నిన్ను గమనిస్తూ ఉంటుంది. జాగ్రత్తగా చూసుకుంటుంది. నువ్వు చాలా అదృష్టవంతురాలివి' అన్నాయి తాబేలమ్మ, కోకిలమ్మ. 'అవును మా అమ్మ లేకుంటే నేను ఏమైపోయేదాన్నో.' అన్నది కోతి పిల్ల.

కొంత కాలానికి అవి మూడు బతకటానికి వేర్వేరు చోట్లకు వెళ్లిపోయాయి. కొన్ని రోజులకు అవి మూడూ చెరువు ఒడ్డున కలిశాయి. అప్పుడు కోతి తన బుజ్జి కోతి పిల్లను పొట్టకు తగిలించుకొని వచ్చింది. బుజ్జి కోతికి కోకిలమ్మ, తాబేలమ్మలను పరిచయం చేసింది. 'ఇదిగో! ఈ ఇద్దరితో చిన్నప్పుడు ఈ చెరువు దగ్గర ఆడుకునే దాన్ని.' అని చెప్పింది. కోకిలమ్మకు, తాబేలమ్మలకు నమస్కరించింది బుజ్జి కోతి. బుజ్జికోతి సంస్కారానికి ముచ్చటపడ్డాయి కోకిలమ్మ, తాబేలమ్మ.

'మీ పిల్లలను తీసుకు రాలేదా?' అని కోకిలను, తాబేలును అడిగింది కోతి.

'నేను గుడ్లను పెట్టి ఇసుకతో కప్పేస్తాను. వాటిని పొదగమూ, పట్టించుకోమూ. పిల్లలను కూడా పెంచం. అవి మాతో కలిసి ఉండవు. తలో దిక్కు వెళ్లిపోతాయి' అంది తాబేలు.


కోకిల కూడా అలాగే చెప్పింది. 'నేను కాకమ్మ గూటిలో గుడ్లు పెడతాను. కాకమ్మ పొదిగి పిల్లలను చేస్తుంది. ఆ తర్వాత అవి రెక్కలొచ్చి ఎక్కడికో పోతాయి.' అంది. విని, కోతి ఆశ్చర్యపోయింది.

'మిత్రమా! దీనికి నీవు ఆశ్చర్యపోవద్దు. చిన్నప్పుడు నువ్వు మీ అమ్మ దగ్గర పెరిగావు. కాబట్టి నీవూ నీ పిల్లల్ని పెంచుతున్నావు. మేమూ మా అమ్మల దగ్గర పెరగలేదు. అందుకే మా పిల్లల్ని మేమూ పెంచడం లేదు. ఏదైనా, అమ్మానాన్నలు పాటిస్తేనే కదా, పిల్లలూ పాటిస్తారు.' అంది తాబేలు.

'సరే మిత్రులారా! చీకటి పడుతుంది. బుజ్జి కోతి భయపడుతుంది. ఇక నేను ఇంటికి వెళతాను. మళ్లీ కలుద్దాం'." అని ఆనందంగా కోతిపిల్లని తన కడుపునకు తగిలించుకోని తన ఇంటికి బయల్దేరింది కోతి.

– పైడిమర్రి రామకృష్ణ
92475 64699


లెక్క తేల్చండి



చిన్నారులూ, ఇక్కడున్న పట్టికలో రకరకాల బొమ్మలున్నాయి. వాటిని నెంబర్లు గా గుర్తించి గణించాము. చివరి లైన్లో ఉన్న బొమ్మల అంకెల ఆధారంగా మీరు జవాబు రాబట్టండి.

89 : జవాబు

నేను గీసిన బొమ్మ





జాస్తి హిరణ్మయి,
9వ తరగతి,
ఆంబిటస్ స్కూలు,
విజయవాడ,
ఎన్టీఆర్ జిల్లా.

పిల్లలూ, మీ కథలు, బొమ్మలూ పంపండి. ఇదిగో మెయిల్ ఐడీ: chinnaarips@gmail.com

నేను చూడని ప్రపంచాన్ని
నా బొమ్మలు చూస్తున్నాయి...

గోలు బొమ్మలు తయారు చేయడం అంటే ... కదలకుండా గంటల తరబడి కూర్చోవాలి. అందుకు ఎముకలు, శరీరం ఎంతో సపోర్టు ఉండాలి. కాని కోయంబత్తూరుకు చెందిన రాధిక చిన్నతనం నుంచి ఎముకల వ్యాధితో బాధపడుతోంది. వరసగా శస్త్రచికిత్సలు చేయించుకుంది. మంచం మీద ఉండే పట్టుదలగా చదువుకుంది. సరదాగా డ్రాయింగ్, క్రాఫ్ట్, పెయింటింగ్ నేర్చుకొని, ప్రావీణ్యం సాధించింది. ఆ అలవాటే ఇప్పుడు ఆమెకు జీవనోపాధి అయింది. న్యూస్‌పేపర్‌తో రకరకాల బొమ్మలు తయారు చేస్తూ అందర్నీ ఆకర్షిస్తోంది. ప్రతికూల పరిస్థితుల నుంచి తన జీవితాన్ని ఎలా మలుచుకుందో తన మాటల్లోనే విందాం.





"నాకు ఊహ తెలిసినప్పటికే నేను రోజంతా మంచంలో కూర్చునేదాన్ని. ఇంటి పక్కన పిల్లలతో కలిసి ఆడుకోవాలని అనిపించేది. కానీ, శరీరం సహకరించేది కాదు. తోటి పిల్లలు ఉదయం పాఠశాలకు, సాయంత్రం ట్యూషన్‌కు వెళతారు. నేను వాళ్లను చూస్తూ ఉండేదానిని. ఎప్పుడైనా నేను మంచంలో నుంచి లేచేది– ఆసుపత్రికి వెళ్లేటప్పుడు మాత్రమే! బాల్యం నాకు చాలా కష్టంగా గడిచింది. అందరి పిల్లల్లా నేను ఉండేదాన్ని కాదు. జన్యుపరమైన వ్యాధితో బాధపడ్డాను.

ఏడు శస్త్ర చికిత్సలైనా..



ఐదేళ్ల వయసులో కుడి కాలికి శస్త్రచికిత్స చేయాలన్నారు వైద్యులు. తర్వాత మూడు నెలలు బెడ్ రెస్ట్. తొమ్మిది నెలల్లో అదే కాలుకు మరొక శస్త్రచికిత్స. ఆపై, ఒక సంవత్సరం మంచంలోనే. పెద్దయ్యేకొద్దీ నాకు వచ్చిన వ్యాధి గురించి తెలుసుకున్నా. దాని పేరు ఆస్టియోజెనిసిస్ ఇంపెర్ఫెక్టా. పెళుసు ఎముక వ్యాధి. ఇది జన్యుపరంగా లేదా వంశపారంపర్యంగానైనా రావొచ్చుట. దీనివల్ల ఎముకలు సులభంగా విరిగిపోతాయి. చిన్న గాయమైనా దాని ప్రభావం తీవ్రంగా ఉంటుంది. 12 సంవత్సరాల వయస్సుకే ఏడు శస్త్ర చికిత్సలు జరిగాయి నాకు.


ఒకసారి ఆపరేషన్ కోసం థియేటర్ లోపలికి వెళ్లేటప్పుడు మా నాన్నతో 'నొప్పి భరించలేను నాన్నా... నన్ను చంపేయండి' అంటూ ఏడ్చా. ఆ వయస్సులో ఆపరేషన్లతో, ఎముకల నొప్పులతో నీరసంగా ఉండేది. రెండు కాళ్లూ కదిలేవి కావు. వీల్‌చైర్‌లోనే బాల్యం గడిపా. తోటి పిల్లల్ని చూస్తున్నప్పుడు చదువుకోవాలన్న పట్టుదల ఉండేది. చదువుపై నా ఆసక్తి గమనించి, అమ్మానాన్న స్కూలుకు పంపారు. కొత్త ప్రదేశాలు చూస్తున్నప్పుడు, కొత్త విషయాలు తెలుసుకున్నప్పుడు శరీరంలో చురుకుదనం లేకపోయినా మనసు మాత్రం ఉత్సాహంగా అనిపించేది.

కళల వైపు దృష్టి

నన్ను నడిపించాలన్న కోరికతో నాన్న చాలా కష్టపడేవారు. అప్పట్లో ఒక్కో సర్జరీకి రూ. 35 వేలు అయ్యేది. అది అప్పట్లో నాన్నకు ఒక సంవత్సర జీతం. ఆయన టెక్స్‌టైల్ మిల్లులో సూపర్‌వైజర్‌గా పనిచేసేవారు. నా రెండు కాళ్లల్లో ఎముకలకు నాలుగు మెటల్ ప్లేట్లు స్క్రూలతో అమర్చారు. దాంతో కర్ర సహాయంతో నడవగలిగేదానిని. ఒక్కోసారి నా పరిస్థితి చూసి నాకే జాలి వేసేది. భవిష్యత్తులో ఏం చేయలేనేమో అనుకునేదాన్ని. ఎలాగోలా ఇంటర్ పూర్తి చేశా. తర్వాత డ్రాయింగ్, పెయింటింగ్‌పై దృష్టి పెట్టా. ఇంట్లో ఖాళీగా ఉండటం ఇష్టం లేక నేర్చుకునేందుకు వెళ్లా. అవే ఇంత గుర్తింపు తీసుకొస్తాయని తెలియదు. న్యూస్ పేపర్లతో బొమ్మలు చేయడం చూపించారు. నేను ఇంటికి వచ్చాక వాటికి రంగులు వేసేదాన్ని. ప్లెయిన్ ప్లేట్లపై పువ్వులు, బొమ్మలు పెయింటింగ్ చేసేదాన్ని. వాటిని చూసి అమ్మ చాలా బాగున్నాయంటూ మెచ్చుకునేది. మెటీరియల్ తీసుకొచ్చి ఇచ్చేది. అలా అమ్మానాన్న నా వెన్నుతట్టారు. దాంతో కూర్చీలో గంటల కొద్ది కూర్చోవడం ఇష్టం లేక ఏకాగ్రతగా బొమ్మలు చేసి వాటికి రంగులు వేసేదాన్ని. నేను నడవలేను అన్న బాధను మరిచిపోయేలా చేసింది ఈ బొమ్మలే.

సృజనాత్మకంగా ...

పాత వార్తా పత్రికలను కొనుగోలు చేసి, వాటిని కర్రపుల్లలుగా చుట్టి మొదట బొమ్మ చేయాలి. ఆ తర్వాత వాటికి పేపర్‌తో వస్త్రాలు వేసి, అభరణాలు వేశా. వాటికి రకరకాల రంగులు పూశా. ఎండలో పెట్టా. ఎంతో ఆకర్షణీయంగా, అందంగా ఉన్నాయంటూ నా స్నేహితులు, ఇంట్లో వారు మెచ్చుకున్నారు. కొత్తగా పెళ్లయిన జంటలు, వ్యంగ్య చిత్రాల నుండి సితార్, ట్రంపెట్ ఢోలక్‌లను మోస్తున్న సంగీతకారుల బృందాలు, పెళ్లి బృందాల బొమ్మలు, నృత్యకారులు, సంగీత విద్వాంసులు, కృష్ణుడు, గణేశుడు... ఇలా చాలా చేశా. పండగ సందర్భాల్లోనూ ఈ రకమైన బొమ్మలు చేసి ఇవ్వమని అందరూ అడిగేవారు. నా తమ్ముడు వాటిని అమ్మేవాడు. బయట నుంచి ఆర్డర్లు కూడా వచ్చేవి.



అప్పుడే నాకు కొత్త ఆలోచన వచ్చింది. నా స్టైల్లో వైద్య నిపుణులు తెల్లటి కోటు, స్టెతస్కోప్ వేసుకున్న బొమ్మలు చేశా. లాయర్లు, పోలీసులు, కూలి పనులు చేసుకునే వ్యక్తులు, యూనిఫామ్ వేసుకున్న స్కూలు పిల్లలు ... ఇలా కొత్తగా ప్రయత్నించా. దాంతో మరింత గుర్తింపు వచ్చింది. కొనుగోలుదార్లు పెరిగారు. నేను చేసిన బొమ్మలను వారి ఇళ్లలో పెట్టుకుని మురిసిపోతుంటే నాకు చాలా ఆనందంగా ఉంది. ఈ బొమ్మలు చూసి బట్టల తయారీదారులు వచ్చారు. వస్త్రాలు మీదబొమ్మలు చేయమన్నారు. ఒక్కో బొమ్మ రెండు, మూడు రోజులు పట్టింది. అలా వ్యాపారరంగంలోనూ అడుగుపెట్టా. అలా తనుష్క బంగారం ఆభరణాల బొమ్మలూ చేయమన్నారు. చేసి ఇచ్చా. ఒక్కోసారి ఎదురుదెబ్బలు తగిలి నష్టపోయా. అయినా బాధపడకుండా బొమ్మలు రూపొందిస్తున్నా. నెలకు రూ.15 వేలు వరకు ఆదాయం కనిపించింది. 2018 నుంచి 2,650 కంటే ఎక్కువ బొమ్మలు చేశా.

ఎన్నో ప్రశంసలు

నా కళాత్మకమైన బొమ్మలను చూసి ఎందరో మెచ్చుకున్నారు. అవార్డులూ ఇచ్చారు. నా జీవితం గురించి తెలుసుకుని నన్ను ప్రోత్సహించారు. ముఖ్యమంత్రి చేతుల మీదగా ప్రతిభ ప్రశంసా పత్రాన్ని అందుకున్నా. నేను నేర్చుకున్న ఈ విద్యను స్కూలు పిల్లలకు నేర్పిస్తున్నా. వారి సహాయంతో పెయింటింగ్, బొమ్మల తయారీ రంగంలోనూ రాణిస్తున్నా. వాటిని విదేశాలకు పంపిస్తున్నా... నేను వెళ్లలేకపోయినా నా బొమ్మలు ప్రపంచాన్ని చూస్తున్నాయంటే నా ఆనందం మాటల్లో చెప్పలేను."

అద్భుతమైన జోడీ..




వరుణ్ తేజ్, లావణ్య త్రిపాఠి అద్భుతమైన జోడీ అని చిరంజీవి అన్నారు. శుక్రవారం సాయంత్రం కొద్దిమంది కుటుంబ సభ్యుల మధ్య ఈ జంట నిశ్చితార్థం జరిగిందన్నది తెలిసిందే. ఈ సందర్భంగా కొత్త జంటకు శుభాకాంక్షలు చెబుతూ చిరంజీవి తాజాగా ట్విటర్‌లో ఓ పోస్ట్ పెట్టారు. 'నిశ్చితార్థంతో ఒక్కటైన వరుణ్‌తేజ్– లావణ్య త్రిపాఠికి నా హృదయపూర్వక అభినందనలు. మీ జంట అద్భుతంగా ఉంది. అందరి ప్రేమాభిమానాలతో మీ జీవితం సంతోషంగా సాగాలని కోరుకుంటున్నా' అని పేర్కొన్నారు మరోవైపు, 'అన్నయ్యా.. ఎంతోకాలం నుంచి ఈ రోజు కోసం ఎదరుచూస్తున్నా. వెల్‌కమ్ టు ది ఫ్యామిలీ వదిన' అంటూ నిహారిక పోస్ట్ పెట్టారు. ప్రస్తుతం ఈ ఫొటోలు నెట్టింట వైరల్‌గా మారాయి. అల్లు అర్జున్, సాయిధరమ్ తేజ్, మంచు లక్ష్మి, ప్రగ్యాజైశ్వాల్, కోన వెంకట్ తదితరులు కూడా ఈ జంటకు శుభాకాంక్షలు చెప్పారు.



తెలంగాణ యాసలో బాలకృష్ణ


బాలకృష్ణ నటిస్తున్న 'భగవంత్ కేసరి' నుండి తాజాగా టీజర్ విడుదలైంది. కామెడీ సినిమాలకు కేరాఫ్ అడ్రస్ అయిన అనిల్ రావిపూడి దర్శకత్వంలో తెరకెక్కుతోన్న ఈ చిత్రం నుండి బాలకృష్ణ పుట్టిన రోజు సందర్భంగా ఈ మూవీ టీజర్ రిలీజ్ చేశారు. 'రాజు తన వెనక ఉన్న వందల మంది మందను చూపిస్తాడు. మొండోడు తనకు ఉన్న గుండెను చూపిస్తాడు' అంటూ తెలంగాణ యాసలో బాలకృష్ణ చెప్పిన డైలాగుతో ఈ టీజర్ మొదలైంది. షైన్ స్క్రీన్స్ బ్యానర్‌పై సాహు గారపాటి, హరీష్ పెద్ది.. ఈ సినిమాను నిర్మిస్తున్నారు. దసరా కానుకగా ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకు రానుంది.

బాబితో 'ఎన్‌బికె 109'



దర్శకుడు బాబీ కొల్లితో కలిసి నందమూరి బాలకృష్ణ కొత్త ప్రాజెక్టు చేయబోతున్నారు. శనివారం తన 63వ పుట్టినరోజున జరుపుకున్నారు. సితార ఎంటర్టైన్మెంట్స్, శ్రీకర స్టూడియోస్, ఫార్చూన్ ఫోర్ సినిమాస్ సంస్థలపై నాగవంశీ, సాయి సౌజన్య నిర్మిస్తున్నారు. తాజాగా మూవీ యొక్క కాన్సెప్ట్ పోస్టర్ ని మేకర్స్ విడుదల చేసారు. 1982 బ్యాక్ డ్రాప్ లో ఈ మూవీ రూపొందనున్నట్లు తెలుస్తోంది. ప్రపంచానికి అతను తెసులు, కానీ అతని ప్రపంచం ఏమిటో ఎవరికీ తెలియదు అనే వ్యాఖ్యలతో ఈ కాన్సెప్ట్ పోస్టర్ ఇంట్రెస్టింగ్‌గా ఉంది. అలానే ఒక ఓపెన్ చేసిన సూట్ కేసు, అందులో మాన్సన్ హౌస్ మద్యం బాటిల్, సిగరెట్స్, వెపన్స్ ఉంచారు. వయొలెన్స్‌కా విసిటింగ్ కార్డు 2024 ప్రథమంలో మీ ముందుకు రానుంది అంటూ మేకర్స్ పెట్టిన ఈ పోస్ట్ ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. కాగా ఈ క్రేజీ కాంబినేషన్ మూవీ గురించిన మరిన్ని విషయాలు త్వరలో అధికారికంగా వెల్లడి కానున్నాయి.

'ఓజీ'.. దాస్ కన్ఫర్మ్



పవన్ కల్యాణ్ హీరోగా సుజీత్‌తో ఓ భారీ యాక్షన్ డ్రామా తెరకెక్కుతోన్న సంగతి తెలిసిందే. ప్రస్తుతం షూటింగ్ జరుపుకుంటున్న ఈ చిత్రంలో కోలీవుడ్ యువ నటుడు అర్జున్ దాస్ నటించనున్నట్లు కొన్ని రోజులుగా వార్తలు వస్తున్నాయి. ఈ విషయంపై ఇప్పుడు ఒక స్పష్టత వచ్చింది. తాజాగా 'ఓజీ' చిత్రంలో అర్జున్ దాస్ నటిస్తున్నట్లు మేకర్స్ స్పష్టం చేశారు. అర్జున్ టోన్‌తో మా ఓజి మరింత వైబ్రెంట్‌గా ఉండబోతుంది అని ఇంట్రెస్టింగ్ పోస్ట్ చేశారు. ఈ చిత్రానికి థమన్ సంగీతం అందిస్తుండగా డీవీవీ ఎంటర్టైన్మెంట్స్ వారు నిర్మాణం వహిస్తున్నారు.



'ప్రాజెక్ట్ కే' మ్యూజిక్ మొదలైంది!

ప్రభాస్ హీరోగా పాన్ వరల్డ్ స్థాయిలో తెరకెక్కుతున్న సినిమా 'ప్రాజెక్ట్–కే'. నాగ్ అశ్విన్ దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమా భారీ బడ్జెట్‌తో తెరకెక్కుతోంది. ప్రస్తుతం ఈ సినిమా చిత్రీకరణ జరుపుకుంటోంది. తాజాగా ఈ సినిమాకు సంబంధించిన బిగ్ అప్డేట్ బయటకు వచ్చింది. ఈ సినిమా మ్యూజిక్ వర్క్స్ మొదలైనట్లు సంగీత దర్శకుడు సంతోష్ నారాయణన్ వెల్లడించారు. 'ప్రాజెక్ట్ కే' కోసం నా మ్యూజికల్ జర్నీ ఆఫ్రికాలో స్టార్ట్ అయింది దీనికోసం ప్రపంచమంతా తిరుగుతాను' అంటూ ఇన్‌స్టాగ్రామ్‌లో రాసుకొచ్చారు. టైమ్ ట్రావెల్ కాన్సెప్ట్‌తో తెరకెక్కుతున్న ఈ సినిమాలో అమితాబ్ కీలకపాత్రలో నటిస్తున్నారు. దీపికా పదుకొణె హీరోయిన్‌గా చేస్తున్నారు. వైజయంతీ బ్యానర్‌పై రూపొందుతున్న ఈ మూవీ వచ్చే ఏడాది సంక్రాంతికి విడుదల కానుంది.

స్వైటెక్‌కే ఫ్రెంచ్ ఓపెన్ టైటిల్

- ఫైనల్లో ముఖోవాపై గెలుపు



పారిస్: ఫ్రెంచ్ ఓపెన్ గ్రాండ్‌స్లామ్ మహిళల సింగిల్స్ టైటిల్‌ను డిఫెండింగ్ ఛాంపియన్ ఇగా స్వైటెక్ చేజిక్కించుకుంది. శనివారం జరిగిన ఫైనల్లో టాప్‌సీడ్, పోలండ్‌కు చెందిన స్వైటెక్ 6–2, 5–7, 6–4తో 19వ సీడ్ కరోలినా ముఖోవాపై విజయం సాధించింది. తొలి సెట్‌ను సునాయాసంగా నెగ్గిన స్వైటెక్.. రెండో సెట్‌ను ప్రత్యర్థికి చేజార్చుకుంది. ఇక మూడో సెట్‌లోనూ ఓ దశలో 0–2 పాయింట్లతో వెనుకబడ్డా.. ఆ తర్వాత వరుసగా గేమ్ పాయింట్లు సాధిస్తూ విజేతగా నిలిచింది. దీంతో వరుసగా ఏడేళ్ల క్రితం సెరెనా విలియమ్స్ తర్వాత వరుసగా మూడు గ్రాండ్‌స్లామ్ టైటిళ్లు నెగ్గిన మహిళగా స్వైటెక్ రికార్డు నెలకొల్పింది. విజయం సాధించిన అనంతరం స్వైటెక్ మాట్లాడుతూ.. ముఖోవా అద్భుతమైన ప్లేయర్. వైవిధ్యమైన ఆటతో ఓ దశలో తనపై ఆధిపత్యం చెలాయించింది. పట్టుదలకు ఆమె మారుపేరు అని పేర్కొంది. ఈ ఏడాది జరిగే వింబుల్డన్ గ్రాండ్‌స్లామ్ టైటిల్‌ను కైవసం చేసుకుంటే.. హెనిన్, క్రిస్ ఎవర్ట్, స్టెఫీగ్రాఫ్, మోనికా సెలెస్ వంటి అగ్రశ్రేణి క్రీడాకారిణుల జాబితాలో చేరనుంది. కెరీర్‌లో 5వ గ్రాండ్‌స్లామ్ టైటిల్ నెగ్గిన స్వైటెక్.. ఈ టోర్నమెంట్‌లో సబలెంకా, రైబకినా వంటి యువ క్రీడాకారిణుల త్రయంతో నూతన అధ్యాయాన్ని లిఖించనుంది. టైటిల్ విజేతగా నిలవడంతో 22ఏళ్ల స్వైటెక్ తన టాప్‌సీడ్ ర్యాంక్‌ను మరింత పదిలం చేసుకుంది.

వీల్‌ఛైర్ ఛాంపియన్ టొకిటో..

జపాన్‌కు చెందిన టొకిటో ఒడ్డా వీల్‌ఛైర్ ఛాంపియన్‌గా నిలిచాడు. శనివారం జరిగిన ఫైనల్లో టొకిటో 6–1, 6–4తో బ్రిటన్‌కు చెందిన ఆల్ఫీ హెవిట్‌పై నెగ్గాడు. దీంతో 17ఏళ్లకే గ్రాండ్‌స్లామ్ టైటిల్ నెగ్గిన తొలి వీల్‌ఛైర్ ఛాంపియన్‌గా జపాన్‌కు చెందిన టొకిటో రికార్డు నెలకొల్పాడు.

బాలికల ఛాంప్ కొర్నీవా..

ఫ్రెంచ్ ఓపెన్ బాలికల టైటిల్‌ను రష్యాకు చెందిన 15ఏళ్ల అలీనా కొర్నీవా గెలుచుకుంది. శనివారం జరిగిన ఫైనల్లో 3వ సీడ్ కొర్నీవా 7–6(7–4), 6–3తో 6వ సీడ్, 18ఏళ్ల లూసియానా పెరేజ్ అలెర్నోన్‌పై విజయం సాధించింది. టైటిల్‌ను చేజిక్కించుకొనే క్రమంలో కొర్నీవా కేవలం ఒక్క సెట్‌ను మాత్రమే ప్రత్యర్థి చేజార్చుకుంది. ఫైనల్లో కొర్నీవా 3ఏస్‌లను సంధించగా.. పరేజ్ అలెల్కన్ 9డబుల్ ఫాల్ట్స్ చేసింది. ఈ ఏడాది జరిగిన ఆస్ట్రేలియన్ ఓపెన్ గ్రాండ్‌స్లామ్ బాలికల టైటిల్‌ను గెలిచింది. దీంతో ఒకే ఏడాది రెండు బాలికల గ్రాండ్‌స్లామ్ టైటిళ్లు నెగ్గిన బాలికగా కొర్నీవా నిలిచింది.

పురుషుల సింగిల్స్ ఫైనల్ నేడు..



పురుషుల సింగిల్స్ ఫైనల్ ఆదివారం జరగనుంది. 3వ సీడ్, సెర్బియాకు చెందిన నొవాక్ జకోవిచ్, నార్వేకు చెందిన 4వ సీడ్ కాస్పర్ రూఢ్‌ల మధ్య టైటిల్ పోరు జరగనుంది. జకోవిచ్ టైటిల్ నెగ్గితే 23వ గ్రాండ్‌స్లామ్‌లతో రికార్డు నెలకొల్పనున్నాడు. రూఢ్ ఓ గ్రాండ్‌స్లామ్ ఫైనల్‌కు చేరడం ఇది రెండోసారి. సెమీస్‌లో జకోవిచ్ 6–3, 5–7, 6–1, 6–1తో టాప్‌సీడ్ అల్కరాజ్‌పై రూఢ్.. 22వ సీడ్, జర్మనీకి చెందిన జ్వెరేవ్‌పై 6–3, 6–4, 6–0తో గెలిచి ఫైనల్‌కు చేరారు. ముఖాముఖి పోరులో జకోవిచ్ 4–0 ఆధిక్యతలో ఉన్నాడు.



బాలికల ఛాంప్ కొర్నీవా

వీల్‌ఛైర్ ఛాంపియన్ టొకిటో

సాధిస్తారా.. సమర్పిస్తారా..
టీమిండియా లక్ష్యం 444, ప్రస్తుతం 164/3



లండన్: ప్రతిష్టాత్మక ప్రపంచ టెస్ట్ ఛాంపియన్‌షిప్(డబ్ల్యుటిసి) ఫైనల్ రసకందాయంలో పడింది. ఆస్ట్రేలియా నిర్దేశించిన 444పరుగుల లక్ష్యాన్ని ఛేదించే క్రమంలో టీమిండియా నాల్గోరోజు ఆట ముగిసే సమయానికి 3వికెట్ల నష్టానికి 164పరుగులు చేసింది. కోహ్లి(44), రహానే(20) క్రీజ్‌లో ఉన్నారు. చివరిరోజు మరో 280 పరుగులు చేస్తే టీమిండియా, మరో ఏడు వికెట్లు కూలిస్తే తొలిసారి డబ్ల్యుటిసి టైటిల్‌ను చేజిక్కించుకోనున్నాయి.

ఓవర్‌నైట్ స్కోర్ 4వికెట్ల నష్టానికి 123 పరుగులతో శనివారం నాలుగో రోజు ఆటను కొనసాగించిన ఆస్ట్రేలియా జట్టు రెండో ఇన్నింగ్స్‌ను 8 వికెట్ల నష్టానికి 270పరుగుల వద్ద డిక్లేర్డ్ చేసింది. 167 పరుగులకే 6 వికెట్లు కోల్పోయిన ఆసీస్‌ను మిచెల్ స్టార్క్(41), అలెక్స్ క్యారీ(66నాటౌట్) ఆదుకున్నారు. వీరిద్దరూ 7వ వికెట్‌కు 97 పరుగుల భాగస్వామ్యాన్ని నిర్మించి టీమిండియా ముందు భారీ లక్ష్యాన్ని నిర్దేశించగలిగారు. లబూషేన్ (41), కామెరూన్ గ్రీన్ (25) త్వరగా ఔటయ్యారు. ప్యాట్ కమిన్స్(7) ఔటయ్యాక ఆస్ట్రేలియా జట్టు ఇన్నింగ్స్‌ను డిక్లేర్డ్ చేసింది. జడేజాకు మూడు, షమీ, ఉమేశ్‌కు రెండేసి, సిరాజ్‌కు ఓ వికెట్ దక్కింది.



అంపైర్ తప్పుడు నిర్ణయానికి శుభ్‌మన్ ఔట్..

భారీ లక్ష్యాన్ని ఛేదించే క్రమంలో థర్డ్ అంపైర్ తప్పుడు నిర్ణయానికి టీమిండియా ఓపెనర్ శుభ్‌మన్ గిల్(18) బలయ్యాడు. బోలాండ్ వేసిన 8వ ఓవర్‌లో శుభ్‌మన్ గిల్ బ్యాట్ ఎడ్జ్ తీసుకున్న బంతి స్లిప్ ఫీల్డర్ కామెరూన్ గ్రీన్ డైవ్‌తో సింగిల్ హ్యాండ్‌తో బంతిని అందుకున్నాడు. అయితే బంతిని అందుకునే క్రమంలో నేలకు తాకినట్లు తేలింది. దాంతో ఫీల్డ్ అంపైర్.. థర్డ్ అంపైర్ సమీక్ష కోరాడు. పలు కోణాల్లో పరిశీలించి ఔట్‌గా ప్రకటించాడు.

Published and Printed by Mallajosyula Venkata Subrahmanya Sarma on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governorpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Bendi Tulasi Das, Ph : 9490099275, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68